గురువారం
1•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 263
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



నేడు హోలీ





బుధవారం కాంచీపురంలో శంకరాచార్య జయేంద్ర సరస్వతికి నివాళులు అర్పిస్తున్న భక్తులు. చిత్రంలో తదుపరి శంకరాచార్య విజయేంద్ర సరస్వతి కూడా ఉన్నారు.



జయేంద్ర సరస్వతి
1935 - 2018

కంచి కామకోటి పీఠాధిపతి

జయేంద్ర సరస్వతి శివైక్యం

- కొంతకాలంగా శంకరాచార్యకు అస్వస్థత
- కాంచీపురంలో గుండెపోటుతో మృతి
- నేడు 'బృందావన ప్రవేశ కార్యక్రమం'
- సంతాపం తెలిపిన రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, సీఎం కేసీఆర్
- తదుపరి శంకరాచార్య విజయేంద్ర సరస్వతి

3

కాంగ్రెస్‌ది ద్రోహ చరిత్ర

- తెలంగాణకు పైసా ఇవ్వనన్నా ఇక్కడి నేతలు నోరెత్తలేదు
- చిత్తూరుకు 9వేల కోట్లు తీసుకుపోతున్నా అడ్డుచెప్పలేదు
- యాభై ఏండ్ల పాలనలో తెలంగాణను నట్టేట ముంచారు
- రాష్ట్ర కాంగ్రెస్ నేతలపై మంత్రి కేటీఆర్ నిప్పులు

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి:

యాభై ఏండ్లుగా తెలంగాణకు అన్యాయం చేసిన ద్రోహుల చరిత్ర కాంగ్రెస్‌దని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కే తారకరామారావు విమర్శించారు. వారిది అన్యాయాల పరంపర అన్నారు. నలభైమంది కాంగ్రెస్ నేతలు బస్సు వేసుకుని జనారణ్యానికి వస్తున్నారన్న కేటీఆర్.. అలీబాబా 40 దొంగల కథను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ నేతలది 'జానా'బాబా 40 దొంగల పర్యటన' అని అభివర్ణించారు. 'ఓ 40మంది కాంగ్రెస్ నాయకులు ఓ బస్సు వేసుకొని బయలుదేరారు. ఆ నలభై మందీ అక్రమార్కులే. ఒకరు ఓటుకు నోటులో దొరికిన చిల్లర దొంగ. మరొకరు గత ఎన్నికల సమయంలో కోదాడలో మూడు కోట్లతో దొరికిన దొంగ. ఇలా చెప్పూపోతే అందరూ కోర్టుల చుట్టూ తిరుగుతున్నవారే' అని కేటీఆర్ విమర్శించారు. 'ఏండ్లతరబడి ఏలిన కాం గ్రెస్ నేతలు తెలంగాణను నట్టేట ముంచారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ.. ఉద్యమనేత కేసీఆర్ సీఎం అయిన నాటినుంచి మూడున్నరేండ్లలోనే దేశానికే రోల్‌మోడల్‌గా నిలుస్తూ అన్ని రంగాల్లో ఉరుకులు పెడుతున్నది' అని చెప్పారు. బుధవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని 175 పల్లెలకు తాగునీటిని అందించే మిషన్ భగీరథ పనులు పూర్తికాగా వాటిని మంత్రి జగదీశ్‌రెడ్డి, భువనగిరి ఎంపీ బూర నర్సయ్య గౌడ్, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌లతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మద్దిరాల క్రాస్‌రోడ్డు వద్ద గాదరి కిశోర్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగసభలో ప్రసంగించారు. 2001లో గులాబీ జెండాను పైకి ఎత్తి నాటి పాలకులకు సింహస్వప్నమైన రోజునే తెలంగాణ సాధిస్తే ఏం వస్తుందో, ఏం జరుగుతుందో కేసీఆర్ చెప్పారని, అవి నేడు అక్షర సత్యాలవుతున్నాయని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో నత్తలు సిగ్గుపడే రీతిలో అభివృద్ధి పనులు జరిగాయని, దానికి నిదర్శనం శ్రీరాంసాగర్ ప్రాజెక్టేనని చెప్పారు. రాహుల్‌గాంధీ ముత్తాత అయిన నెహ్రూ హయాంలో శ్రీరాంసాగర్‌కు శంకుస్థాపన చేస్తే, 50 ఏండ్లపాటు

మిగతా 2వ పేజీలో



బుధవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో మిషన్ భగీరథ నీటిని విడుదల చేస్తున్న మంత్రులు కే తారకరామారావు, జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే గాదరి కిశోర్ కూడా ఉన్నారు.

మూడున్నరేండ్లలోనే దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ

- ఇది టీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ సాధించిన ఘనత
- రాహుల్ ముత్తాత శంకుస్థాపన చేస్తే మేం గోదావరి పారిస్తున్నం
- త్వరలో పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ ఫలాలు
- శాశ్వతంగా దూరంకానున్న ఫ్లోరిన్ రక్కసి
- తుంగతుర్తి సభలో మంత్రి కే తారకరామారావు
- 175 గ్రామాలకు భగీరథ నీరు విడుదలచేసిన మంత్రి

• స్వర్గలోకం చేరిన ఇంద్రజ!

లంబీ జుదాయి..



ముంబైలో శ్రీదేవి అంతిమయాత్ర దృశ్యం. (ఇన్‌సెట్) కంచి పట్టుచీర, ఏడువారాల నగలతో శ్రీదేవి పార్థివదేహం

సిరిమల్లె పువ్వా.. మళ్లీ రావా!!

అశ్రునయనాలతో శ్రీదేవికి అంతిమ వీడ్కోలు

సినీ వినీలాకాశంలో ఓ తార మటుమాయమయ్యింది.. 'తారల్లారా రారే విహారమే' అంటూ తిరిగిరాని తీరాలకు తరలిపోయింది! కథగా కల్పనగా ఓ దొరసాని కనిపించకుండాపోయింది! ఎదుగుతున్న సినీరంగంతోపాటే ఒదుగుతూ వందల సినిమాల్లో వేల రీళ్లలో లక్షల హావభావాలు ప్రదర్శించి.. యావద్దేశాన్ని తన నటనాకౌశలంతో కట్టిపడేసిన అతిలోకసుందరి.. ఆఖరాటను అర్థాంతరంగా ముగించుకుని అంతర్ధానమయ్యింది! బుధవారం ఉదయం ముంబై సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో అభిమానులకు ఆఖరి చూపు దక్కించిన శ్రీదేవి.. భారతీయ సినీ పరిశ్రమకు చెందిన వేల బాధాతప్త హృదయాలు పలికిన తుది వీడ్కోలు తీసుకుని.. సెలవు పలికింది! విల్లేపార్లేలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించి మహారాష్ట్ర ప్రభుత్వం నివాళులర్పించింది! ఇక శ్రీదేవి చరిత్రగా మారింది! ఇక శ్రీదేవి కనిపించదు! ఇక శ్రీదేవి మురిపించదు! ఇక శ్రీదేవి నవ్వు వినిపించదు! అల్విదా చాందినీ.

5



కైలాశ్ సత్యార్థి

చైల్డ్ ఫ్రెండ్లీ రాష్ట్రంగా తెలంగాణ

- ప్రభుత్వ సంకల్పంపై నోబెల్ బహుమతి గ్రహీత కైలాశ్‌సత్యార్థి హర్షం
- సహకారం అందిస్తామని హామీ

11

ఎంసెట్-2018

నోటిఫికేషన్ విడుదల

- మార్చి 4 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఏప్రిల్ 4 దాకా గడువు
- ఈసారి నుంచి ఉర్దూలోనూ పరీక్ష

2

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 2న యథావిధిగా ఇంటర్ సెకండియర్ పరీక్ష

6



ఎల్ ఆర్ఎస్ గడువు మార్చి 31 దాకా పొడిగింపు

2

ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో

కార్తీ చిదంబరం అరెస్ట్

5



కార్తీ చిదంబరం

- ఫెరా నిబంధనలు ఉల్లంఘించారని అభియోగం
- ఎఫ్‌డీఐల అనుమతిలో 10 లక్షలు ముడుపుల ఆరోపణలు
- చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి.. ఢిల్లీకి తరలింపు
- ఒక్కరోజు సీబీఐ కస్టడీకి పటియాలాహౌస్ కోర్టు అనుమతి
- అరెస్టు రాజకీయ కక్షసాధింపే : కాంగ్రెస్







హోలీ శుభాకాంక్షలు

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ రంగుల భరితమైనదని అది ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలపరుస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ పండుగలో చల్లుకునే రంగులు జాతీయ సమగ్రతను కాపాడుతాయన్నారు. ఈ పండుగ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మరింత ఆనందాన్ని పంచాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బుధవారం హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రంగురంగుల పండుగ హోళీని ప్రజలు సంతోషంగా, ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకోవాలని సీఎం ఆకాంక్షించారు.



ఏపీలోని విజయవాడలో తెలంగాణ సీఎం కేసీఆర్ ఫ్లెక్సీతో ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

విజయవాడలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

తెలంగాణలో ముదిరాజ్‌ల సంక్షేమానికి 5 కోట్లు కేటాయించడంపై హర్షం

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి విజయవాడలో బుధవారం ముదిరాజ్ సంఘం నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో ముదిరాజ్‌ల సంక్షేమం కోసం రూ.5 కోట్లు, ముదిరాజ్‌ల భవనం కోసం ఐదెకరాల స్థలం కేటాయించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ ప్రభుత్వం కూడా ముదిరాజ్‌ల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని కోరారు. కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి పాటుపడుతూ జనరంజక పాలనచేస్తున్నారని కొనియాడారు.

నేడు 'బోయింగ్' ఉత్పత్తి ప్రారంభం

ప్రారంభించనున్న రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్
పాల్గొననున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్, రతన్ టాటా



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మరో ప్రతిష్ఠాత్మక సంస్థ రాష్ట్రంలో తమ ఉత్పత్తులను ప్రారంభించనుంది. వైమానికరంగానికి చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ అండ్ బోయింగ్ జాయింట్ వెంచర్ ఆధ్వర్యంలో ఆదిభట్లలో ఏర్పాటుచేసిన బోయింగ్ విమాన విడిభాగాల తయారీపరిశ్రమలో గురువారం ఉత్పత్తి ప్రారంభం కానుంది. రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్యఅతిథిగా హాజరై ఉత్పత్తిని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు, టాటా సన్స్ మాజీ చైర్మన్ రతన్ టాటా, రక్షణ మంత్రిత్వశాఖ సలహాదారు సతీశ్‌రెడ్డి పాల్గొంటారు. తెలంగాణ రాష్ట్ర మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ) వైమానిక సెజ్‌లో విమాన విభాగాల తయారీ కేంద్రానికి 2016 జూన్ 18న అప్పటి రక్షణశాఖ మంత్రి మనోహర్ పారికర్, టాటా గ్రూపుల చైర్మన్ రతన్ టాటా, తెలంగాణ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, బోయింగ్ సంస్థలు కలిసి టాటా బోయింగ్ ఏరో స్పేస్ లిమిటెడ్ ఉమ్మడి సంస్థను ఏర్పాటుచేశాయి. దీని ఆధ్వర్యంలో మైమానిక సెజ్‌లో 13 ఎకరాల్లో రూ.200 కోట్లతో పరిశ్రమను నిర్మించాయి. బోయింగ్ ఏహెచ్ 64 విమానాల విడిభాగాలకుతోడు అపాచీ హెలికాప్టర్లను ఇందులో తయారుచేయనున్నారు. వీటికి అమెరికా సహా 15 దేశాల్లో బాగా డిమాండ్ ఉంది.

ముహూర్తం

సూర్యోదయం: 6.38 గంటలకు

సూర్యాస్తమయం: 6.19 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం చతుర్దశి ఉదయం 8.59 వరకు, తదుపరి పూర్ణిమ, నక్షత్రం: మఖ రాత్రి 11.48 వరకు, తదుపరి పుబ్బ, అమృతఘడియలు: రాత్రి 9.35 నుంచి 11.11 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.56 నుంచి 3.24 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.12 నుంచి సాయంత్రం 4.45 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 12.46 నుంచి 2.22 వరకు.

లోకం పోకడ



మందు పోయవయ్యా అంటే రంగు పోశాడు!

FORM IV

Statement about ownership and other particulars about newspaper NAMASTE TELANGANA to be published in the first issue every year after the last day of February

1. Place of publication : **HYDERABAD**
2. Periodicity of its publication : DAILY(M)
3. Printer's Name : **DAMODAR RAO DIVAKONDA**
   Nationality : INDIAN
   Address : Telangana Publications Pvt. Ltd., S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal , Shamirpet Mandal, Dist. Medchal-500078, Telangana State
4. Publisher's Name : **DAMODAR RAO DIVAKONDA**
   Nationality : INDIAN
   Address : Telangana Publications Pvt.Ltd., 8-2-603/1/7,8,9, Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad -500034, Telangana State
5. Editor's Name : **KATTA SHEKAR REDDY**
   Nationality : INDIAN
   Address : Telangana Publications Pvt.Ltd., 8-2-603/1/7,8,9 Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad - 500034, Telangana State
6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding more than one per cent of the total capital. : 1) Sri D. Damodar Rao, Flat No. 409, Metro Residency, Raj Bhavan Road, Hyderabad-500082, T.S.
   2) Smt K. Shailima, H.No. 8-2-220/110/1/3, Road No.14, Nandi Nagar, Banjara Hills, Hyderabad-500034, T.S.
   3) Sri K. Chandra Shekhar Rao, H.No. 8-2-220/110/1/3, Road No.14, Nandi Nagar, Banjara Hills, Hyderabad-500034, T.S.

I, **DAMODAR RAO DIVAKONDA**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date : 28.02.2018

Sd/-
DAMODAR RAO DIVAKONDA
Publisher

సాగర్‌పై మళ్లీ ఏపీ జల దౌర్జన్యం

- బోర్డు ఆదేశాలతో కుడికాల్వ గేట్లు మూసేసిన తెలంగాణ.. పోలీసు బలగాలతో గేట్లు తెరువాలని ఏపీ సీఈ ఆదేశాలు
- సభ్యకార్యదర్శి సూచనతో ఇరు రాష్ట్రాల ఈఎన్సీల సంప్రదింపులు
- ఏపీ పంటలను రక్షించేందుకు నీటి విడుదలకు తెలంగాణ అంగీకారం.. రేపు కృష్ణా బోర్డు భేటీ



నాగార్జునసాగర్ డ్యాంపై బుధవారం మోహరించిన పోలీసులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆదేశాల అమలు అంటూ తెలంగాణకు పదేపదే నీతులు చెప్పే ఆంధ్రప్రదేశ్ ఆబోర్డు ఆదేశాలకే నాగార్జునసాగర్‌లో నీళ్లొదిలింది. ఏపీకి కేటాయించిన నీటి కోటా పూర్తయిన దరిమిలా శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల నుంచి ఆ రాష్ట్రానికి నీటి విడుదల నిలిపివేయాలని మంగళవారం కృష్ణాబోర్డు జారీచేసిన ఉత్తర్వులను బుధవారం తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు అమలుచేశారు. దీనిపై ఏపీ అధికారులు దౌర్జన్యానికి తెగించారు. డ్యాంపై గతంలో మాదిరిగానే శాంతిభద్రతల సమస్య తలెత్తే పరిస్థితిని సృష్టించారు. అయితే, ఉభయ రాష్ట్రాల ఈఎన్సీలు చర్చించుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.

ఇప్పటికే ఏపీకి 2.23 టీఎంసీలు అదనంగా విడుదల

నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాల నుంచి కృష్ణాజలాల వినియోగంపై గతనెల 8న కృష్ణాబోర్డు రెండురాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించింది. నిల్వలను పరిగణనలోకి తీసుకొని ఏపీ 60 టీఎంసీలు, తెలంగాణ 50 టీఎంసీలు వాడుకునేందుకు ఒప్పందం కుదిరింది. మంగళవారంనాటికి ఈ ఒప్పందంకంటే ఏపీ 2.32 టీఎంసీలు ఎక్కువే వాడుకుంది. ఈ విషయాన్ని తెలంగాణ నీటిపారుదల శాఖ కృష్ణాబోర్డు దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే నీటి విడుదలను నిలిపివేయాల్సిందిగా బోర్డు సభ్యకార్యదర్శి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇందుకనుగుణంగా కుడి కాల్వ నుంచి రెండువేల క్యూసెక్కుల విడుదలను బుధవారం ఉదయం నిలిపివేశారు.

ఏపీ అధికారుల లెక్కలేని తనం...

బోర్డు ఆదేశాలతో తీసుకున్న నిర్ణయంపై అభ్యంతరాలుంటే బోర్డునే సంప్రదించాలి. కానీ, ఏపీ అధికారులు లెక్కలేనితనంతో వ్యవహరించారు. బుధవారం ఉదయం తెలంగాణ ఎస్ఈ సునీల్, ఏపీ ఈఎన్సీతోపాటు తన కిందిస్థాయి అధికారులకు లేఖలు రాసిన ఏపీ జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్ ఎస్ఏ జబ్బార్ కుడి కాల్వనుంచి కోటా పూర్తికాలేదని, గురువారం పూర్తవుతుందని పేర్కొన్నారు. పంటలను కాపాడుకునేందుకు రెండువేల క్యూసెక్కుల విడుదల కొనసాగాల్సిందేనని వాదించారు. అంతటితో ఆగకుండా సిబ్బందితో వెళ్లి కుడికాల్వగేట్లను ఆపరేట్‌చేయాలని, తెలంగాణ అధికారులు అడ్డుపడితే పోలీసులను వినియోగించుకోవాలని కూడా లేఖలో సూచించారు. ఏపీ ఇంజినీర్లు సిబ్బందితో డ్యాం మీదకొచ్చి తెలంగాణ అధికారులపై ఒత్తిడి పెంచారు. ఈ నేపథ్యంలో రెండురాష్ట్రాల పోలీసులు మోహరించడంతో స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది.

అప్రమత్తమైన తెలంగాణ అధికారులు...

ఏపీ దుందుడుకు వైఖరిని గమనించిన సాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సునీల్ పరిస్థితిని ఉన్నతాధికారులతోపాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ, బోర్డు సభ్య కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లారు. పోలీసులతో గేట్లను తెరిచేందుకు ఏపీ అధికారులు ప్రయత్నించేందుకు సిద్ధమవుతున్న సంకేతాలు అందడంతో నల్లగొండ జిల్లా కలెక్టర్, ఎస్పీ, నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అటు బోర్డు తదుపరి ఆదేశాలు వచ్చేదాకా కుడికాల్వ ద్వారా నీటి విడుదలను పునరుద్ధరించేదిలేదని తెలంగాణ ఇంజినీర్లు ఏపీ అధికారులకు స్పష్టం చేశారు. కాగా, ఏపీ ఇప్పటికే తన కోటాకు మించి నీటిని వాడుకోవడంతోపాటు ఇలా దౌర్జన్యంగా వ్యవహరించడంపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్పీ సీఈ సునీల్ బోర్డు సభ్య కార్యదర్శిని కోరారు.

ఈఎన్సీల మధ్య సంప్రదింపులు...

కుడి కాల్వ నీటి విడుదలపై వివాదం నేపథ్యంలో బోర్డు సభ్య కార్యదర్శి రెండు రాష్ట్రాల ఈఎన్సీలతో మాట్లాడారు. ఏపీ కోటా పూర్తయిననందున తదుపరి నీటి విడుదలపై చర్చించుకోవాలని సూచించారు. పంటలను కాపాడేందుకుగాను కుడికాల్వకు నీటి విడుదల పునరుద్ధరించాలని, ఆ మేరకు తదుపరి వాటాలో వినియోగాన్ని లెక్కించాలని ఏపీ ఈఎన్సీ కోరగా, తెలంగాణ ఈఎన్సీ మురళీధర్‌రావు అంగీకరించారు. ఇద్దరు ఈఎన్సీల నిర్ణయం మేరకు కృష్ణాబోర్డు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించేందుకు బోర్డు సభ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. ఇదిలాఉండగా, శ్రీశైలం ప్రాజెక్టు ఏపీ చేతుల్లో ఉండటంతో బుధవారం కూడా హంద్రీనీవా నుంచి నీటి విడుదలను కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

పోతిరెడ్డిపాడు వ్యత్యాసాలపై అభిప్రాయాలు చెప్పండి

శ్రీశైలం జలాశయం నుంచి పోతిరెడ్డిపాడు రికార్డుల్లో కంటే ఎక్కువ నీటిని విడుదల చేస్తున్నారనే తెలంగాణ ఫిర్యాదుపై ఆంధ్రప్రదేశ్ మౌనాన్ని వీడటం లేదు. ఈ మేరకు నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు గతంలోనే కృష్ణాబోర్డుకు లేఖ రాశారు. దీంతో ఫిర్యాదుపై అభిప్రాయాలు చెప్పాలని బోర్డు సభ్య కార్యదర్శి ఏపీ జల వనరులశాఖ ఈఎన్సీ వెంకటేశ్వర్‌రావుకు లేఖరాశారు. కానీ సమాధానం రాలేదు. దీంతో తాజాగా బుధవారం మరోసారి లేఖ పంపారు. ఈ అంశంపై అభిప్రాయాలు చెప్పాలని కోరినా స్పందించలేదని, వెంటనే పోతిరెడ్డిపాడు నీటి విడుదలలోని వ్యత్యాసంపై అభిప్రాయాలు చెప్పాలని కోరారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసుల విచారణకు ప్రత్యేక న్యాయస్థానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర పరిధిలోని పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులపై నమోదైన క్రిమినల్ కేసులను త్వరగా విచారించేందుకు ప్రత్యేక కోర్టును ఏర్పాటుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రజాప్రతినిధులైన ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలైన క్రిమినల్ కేసుల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటుచేయాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. దీన్నిఅమలుచేస్తూ రాష్ట్రానికి ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుచేస్తున్నట్టు న్యాయశాఖ కార్యదర్శి వీ నిరంజన్‌రావు తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) గడువును మరో నెల రోజులపాటు ప్రభుత్వం పొడిగించింది. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు 2018 మార్చి 31 దాకా అనుమతిస్తూ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి లోగడ ఇచ్చిన గడువు ఫిబ్రవరి 28తో ముగియడంతో ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. హైదరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, వరంగల్‌లో కుడా (కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)తో పాటు రాష్ట్రంలోని స్థానిక పట్టణ సంస్థలు ప్రాధాన్యక్రమంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలిస్తున్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ రుసుము చెల్లింపు, ఇందుకు సమర్పించాల్సిన పత్రాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు దరఖాస్తుదారులకు ఇప్పటికే అందజేశాయి. అయినా ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు. ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి మరికొంత సమయం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరించడానికి ఈ నెల 31 వరకు గడువు ఇచ్చింది.

ఎంసెట్-2018 నోటిఫికేషన్ విడుదల

- మార్చి 4 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఈసారి నుంచి ఉర్దూలోనూ ఎంసెట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఎంసెట్-2018 నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం మే 2 నుంచి 7 వరకు (ఐదు రోజులు) నిర్వహించనున్న ఆన్‌లైన్ ఎంసెట్‌కు ఈనెల 4 నుంచి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని.. ఆలస్య రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య తెలిపారు. ఆలస్యరుసుంతో దరఖాస్తులు చేసుకోవడానికి ఏప్రిల్ 28 వరకు గడువు విధించినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారి ఆన్‌లైన్ పరీక్షల నిర్వహిస్తున్న నేపథ్యంలో దరఖాస్తుల ధర రూ.800 నిర్ణయించామన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.400 రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పరీక్షల నిర్వహణ కోసం తెలంగాణలో 10, ఏపీలో నాలుగు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 2018-19 విద్యాసంవత్సరం నుంచి ఎంసెట్‌ను ఇంగ్లిష్, తెలుగు భాషలతో పాటు ఉర్దూలో కూడా నిర్వహిస్తున్నామని, దీనివల్ల రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

కాంగ్రెస్‌ది ద్రోహ చరిత్ర



బుధవారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. సభా వేదికపై ఆసీనులైన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బూరనర్సయ్యగౌడ్, జెడ్పీ చైర్మన్ బాలూనాయక్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మందుల సామేలు, బండా నరేందర్‌రెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, కంచర్ల రామకృష్ణారెడ్డి, టీఆర్ఎస్ నాయకులు నోముల నర్సింహయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు

మొదటిపేజీ తరువాయి...

పనులు కదల్లేదన్నారు. కానీ కేవలం మూడున్నరేండ్ల టీఆర్ఎస్ పాలనలో గోదావరి నీళ్లు పారబోతున్నాయని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమంపై సుదీర్ఘ ఆలోచన చేసిన కేసీఆర్ అనేక సమస్యలు, సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతుంటే యాభైఏండ్లు అధికారంలో ఉన్నవారు ఆంధ్రా పాలకుల దోపిడీని కండ్లప్పగించి చూస్తూ ఆస్తులు, ఆకారాలు పెంచుకున్నారు తప్ప ఈ ప్రాంతానికి ఒరగబెట్టింది శూన్యమన్నారు. ఈ సమయంలో సభకు హాజరైన వారిని ఉద్దేశించి అవునా? కాదా? అని కేటీఆర్ ప్రశ్నించగా.. అవును.. అంటూ పెద్దపెట్టున అంతా స్పందించడం విశేషం.

తెలంగాణకు పైసా ఇవ్వనన్నా నోరెత్తలేదు

నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ తెలంగాణకు ఒక్క పైసా ఇవ్వనన్నా తెలంగాణ ప్రాంత కాంగ్రెస్ నేతలెవ్వరూ ఎదిరించి అడిగిన పాపానపోలేదని, చీమూనెత్తురు కోల్పోయినవారిలా వ్యవహరించారని కేటీఆర్ విమర్శించారు. 'తన సొంత జిల్లా చిత్తూరుకు తాగునీటికి రూ.9వేల కోట్లు తీసుకెళుతానని కిరణ్ కుమార్‌రెడ్డి క్యాబినెట్‌లో పెడితే, ప్రస్తుతం జానాబాబా దొంగల ముఠాలో ఉన్నవారు మంత్రులుగా ఉండి, మౌనంగా సంతకం పెట్టారు తప్ప నల్లగొండలో ఫ్లోరిన్ ఉంది, ముందు మాకివ్వండి అని అడుగలేదు' అని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలకు ఎప్పుడు కాంట్రాక్టులు దక్కుతాయి? ఎలా సంపాదించుకోవాలి? అనే ఆలోచనే తప్ప ప్రజల సమస్యల పరిష్కారం పట్టదని విమర్శించారు. 'రైతుల పరిస్థితి కాంగ్రెస్ పాలనలో ఎట్లా ఉంది? ఎంత దారుణంగా ఉంది? కాల్వలు ఉన్నాయి తప్ప నీరు రాలే. బోరు బావుల మీద ఆధారపడి వ్యవసాయం చేద్దామంటే తొమ్మిది గంటలు కాదు.. ఆరు గంటలు కరంటు ఇస్తామన్నారు. అందులో కూడా పొద్దున్న రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటలు, రాత్రి రెండు గంటలు ఇచ్చారు. ఆ అర్ధరాత్రి కరంట్ కోసం బావుల వద్ద కరెంట్ షాకులతో, పాములు కుట్టి చనిపోయినవారు ఎందరో. ఇలాంటివి చెప్పుకొంటూ పోతే మాకు ప్రజలు ఇచ్చిన గడువు సరిపోదు. కేవలం అభివృద్ధి చేయాలనే కంకణం కట్టుకొని మా ప్రభు త్వం ముందుకు సాగుతున్నది' అని కేటీఆర్ చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇస్తున్న సౌకర్యాలతో నేడు దర్జాగా కాలు మీద కాలేసుకున్న కాంగ్రెస్ నాయకులు.. తిన్నది అరుగక మాట్లాడుతున్నారని మంత్రి ధ్వజమెత్తారు. రైతు ఎప్పుడంటే అప్పుడు వ్యవసాయం చేసుకునేందుకు 24గంటల కరంటు ఇస్తుంటే కాంగ్రెస్ నాయకుల కడుపుల కదులుతున్నదని అన్నారు. ఆనాటి ప్రభుత్వాలవల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోతే, మన ప్రభుత్వం వచ్చిన తర్వాత 17వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత మన ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని చెప్పారు. చరిత్రలో ఎంతో మంది ముఖ్యమంత్రులు, ప్రధానులు వచ్చినా మన ముఖ్యమంత్రి లెక్క ఎవరైనా ఆలోచించారా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందే పేదల కన్నీళ్లు తుడవటానికని కేటీఆర్ స్పష్టంచేశారు. మూడున్నరేండ్ల టీఆర్ఎస్ పాలనపై రోడ్డుకెక్కి మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు.. తమ యాభై ఏండ్ల పాలనలో గుడ్డి గుర్రాలకు పండ్లు తోమారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలు ఏది చెప్తే అది నమ్ముతారని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారని, కానీ, వారిని తుంగలో తొక్కేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ చెప్పారు.

అన్నీ పరిష్కరిస్తూ వెళుతున్నాం

మూడేండ్లక్రితం ఏర్పడిన రాష్ట్రాన్ని ఇప్పటికీ కొన్ని సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. నాగార్జునసాగర్ నుంచి ఆంధ్రాకు నీటి వాటాకు అదనంగా తీసుకుపోతుండటంతో ఈరోజు కూడా రెండురాష్ట్రాల అధికారుల మధ్య వాగ్వాదం జరిగిందని తెలిపారు. ఇలాగే కొన్ని సమస్యలుంటే వాటిని పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు.

సంక్షేమంలో తెలంగాణ టాప్

సంక్షేమరంగంలో దేశంలోనే ఏ రాష్ట్రంలో చేయనంతగా వివిధ పథకాలకు తెలంగాణలో 40 లక్షల కోట్లపైనే ఖర్చు జరుగుతున్నదని మంత్రి కేటీఆర్ వివరించారు. కాంగ్రెస్ పాలనలో ఆఖరికి పేదవారికిచ్చే బువ్వలో కూడా కోత పెట్టి, కొలతలు వేసి ఇంటికి 20 కిలోలు అని చెప్పగా, నేడు కేసీఆర్ అధికారంలోకి వచ్చి గతంలో తలా నాలుగుకిలోలు ఇచ్చిన రేషన్‌బియ్యాన్ని ఆరుకిలోలు చేసి, ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ ఆరుకిలోల చొప్పున ఇస్తున్నారని చెప్పారు. ఏ విద్యార్థి సంఘం లేదా ఎవరూ ధర్నాలు చేయకుండానే మన సున్న ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన మనుమరాలు, మనుమడు ఏ సన్నబియ్యంతో అన్నం తింటున్నారో అదే సన్నబియ్యంతో తెలంగాణ విద్యార్థులకు అన్నం పెడుతున్నారని తెలిపారు. రైతు ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో చనిపోయినా ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు తాజాగా రూ.5లక్షల ఉచిత బీమా ప్రకటించారని చెప్పారు. ఆడ కూతురికి మేనమామ కానుక ఇస్తారో లేదో తెలియదు కానీ రాష్ట్రంలో పేదింటి ఆడపిల్ల పెండ్లికి కుల, మతాలతో సంబంధం లేకుండా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరిట రూ.75,116 కేసీఆర్ ఇస్తున్నారని చెప్పారు. గర్భిణులకు ప్రసవం తర్వాత కేసీఆర్ కిట్ అందజేయడంతోపాటు.. మగపిల్లవాడు పుడితే 12 వేలు, ఆడపిల్ల పుడితే 13 వేలు ఇస్తున్నామని గుర్తుచేశారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను 40 శాతానికి పెంచిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అని అప్పట్లో పాడుకుంటే.. నేను పోతబిడ్డో సర్కారు దవాఖానకు అనే రీతిలో పరిస్థితి మారిపోయిందని చెప్పారు. సూర్యాపేట జిల్లాలోని బీడు భూములన్నింటినీ గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయబోతున్నామని కేటీఆర్ తెలిపారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చి కాంగ్రెస్‌కు మూడుచెర్ల నీళ్లు తాగించే ముచ్చట్లు ముందు ముందు ఉన్నాయని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ డిపాజిట్లు గల్లంతు : జగదీశ్‌రెడ్డి

ఎంచుకున్న లక్ష్యంతో ముందుకుసాగుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాలు జోడెడ్ల మాదిరి పరుగులు తీస్తుంటే కాంగ్రెస్ నాయకులకు నిద్రపట్టడం లేదని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. యాభై ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు, ఈ ప్రాంతానికి చేసింది శూన్యమన్నారు. నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలకు ప్రజలు సరైన బుద్ధి చెప్పి పంపిస్తే దిక్కుతోచని స్థితిలో పడ్డారని, మళ్లీ ఏడాదిన్నరలో ఎన్నికలు వస్తుండటంతో నేడు ఎక్కడైనా ఎవరైనా చనిపోయినా.. ఎవ్వరూ పిలువకున్నా వచ్చి పోతున్నారని ఎద్దేవాచేశారు. ప్రశాంతంగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇటీవల తాగి తలలు పగుల గొట్టుకొని హత్య చేసుకున్న కాంగ్రెస్ పార్టీవారు ఆ హత్యను టీఆర్ఎస్‌పైకి నెట్టే ప్రయత్నం చేసి భంగపడ్డారన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అన్నిసీట్లు టీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని, కాంగ్రెస్‌ను ప్రజలు మోరీల్లో తొక్కుతారని చెప్పారు. ఆ పార్టీకి డిపాజిట్లు కూడా రావని అన్నారు. సభలో జెడ్పీ చైర్మన్ బాలూనాయక్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మందుల సామేలు, బండా నరేందర్‌రెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, కంచర్ల రామకృష్ణారెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




తమిళనాడులోని కంచి కామకోటి పీఠంలో బుధవారం శివైక్యం చెందిన మహాస్వామి జగద్గురు శ్రీజయేంద్ర సరస్వతి పార్థివదేహం వద్ద నివాళులుల్పిస్తున్న శిష్యగణం. (ఇన్‌సెట్)లో శ్రీజయేంద్ర సరస్వతి (ఫైల్)

కంచి కామకోటి పీఠాధిపతి

జయేంద్ర సరస్వతి శివైక్యం

కొంతకాలంగా శంకరాచార్యకు అస్వస్థత • కాంచీపురంలో గుండెపోటుతో మృతి

కాంచీపురం, ఫిబ్రవరి 28: కంచికామకోటి పీఠం మహాస్వామి జగద్గురు శ్రీజయేంద్ర సరస్వతి నిర్యాణం చెందారు. అభినవ శంకరులుగా ప్రసిద్ధి చెందిన మహాస్వామి (82) శివైక్యం చెందడం అద్వైత భక్తజనాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. శ్వాసకోశ సంబంధిత సమస్యతో బాధపడుతుండగా జయేంద్ర సరస్వతిని బుధవారం మఠానికి అనుబంధంగా ఉన్న ఆది భగవత్పాద కార్డియాక్ అండ్ డయాలిసిస్ సెంటర్‌కు తరలించారు. అక్కడ ఆయన తుదిశ్వాస విడిచారు. వైద్యశాలలో మెరుగైన చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. బుధవారం ఉదయం గుండెపోటుతో ఆయన సిద్ధి పొందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మహాస్వామి కడసారి దర్శనం కోసం వేలాది మంది భక్తులు కామకోటి పీఠానికి తరలివచ్చారు. రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని మోదీ, రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సహా పలువురు ప్రముఖులు మహాస్వామికి నివాళులు అర్పించారు. కంచిమఠం వైదిక సంప్రదా యాల ప్రకారం మఠం ఆవరణలోనే జయేంద్ర సరస్వతి స్వామి బృందావన ప్రవేశం (సమాధి కార్యక్రమం) గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని మఠం అధికారిక ట్విట్టర్‌లో పేర్కొన్నారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి సమాధి స్థలం పక్కనే ఇందుకోసం ఏర్పాట్లు చేపట్టారు. భారతదేశంలో భక్తి ఉద్యమాన్ని మానవసేవవైపు మలుపుతిప్పడంలో జయేంద్ర సరస్వతి వినూత్న మార్గాన్ని నిర్దేశించారు. కంచికామకోటి విద్యావైద్యశాలలు, ఇతర సామాజిక సేవా విభాగాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో అందిస్తున్న సేవలు లెక్కలేనివి. ఆయన ఆధ్వర్యంలో కంచిపీఠం సమాజ అభ్యున్నతికి అనేక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నది. కంచిపీఠం నిర్వహణలో కొనసాగుతున్న శంకర నేత్రాలయ వైద్యశాలలు దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి.

మఠం నియమాల ప్రకారం.. జయేంద్ర సరస్వతి భౌతికకాయాన్ని కూర్చున్న భంగిమలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. చంద్రశేఖరేంద్ర సరస్వతి అనంతరం జయేంద్ర.. కంచి కామకోటి పీఠాధిపతి అయ్యారు. ఇప్పుడు ఆయన తదుపరి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి ఆ స్థానంలోకి వస్తారని పీఠం ప్రతినిధులు తెలిపారు. 1935 జూలై 18న తిరువరూర్ జిల్లా ఇరుల్‌నీకిలో జన్మించిన సుబ్రహ్మణ్య మహాదేవ.. 19వ ఏట కంచి మఠంలో చేరిన తర్వాత జయేంద్ర సరస్వతిగా మారారు. జయేంద్ర సిద్ధి వార్త తెలిసిన వెంటనే చెన్నై నగరానికి 75 కిలోమీటర్ల దూరంలోని మఠం ప్రాంతమంతటా విషాద వాతావరణం నెలకొంది. పలువురు శిష్యులు భోరున విలపించారు. స్థానిక ముస్లిములు కూడా నివాళులర్పించారు. 2500 ఏండ్ల క్రితం ఆదిశంకరాచార్యులు స్థాపించిన కంచికామకోటి పీఠానికి జయేంద్రసరస్వతి 69వ అధిపతిగా వ్యవహరించారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవ, విద్య, వైద్య రంగాల్లో మఠం పేరు ప్రఖ్యాతులను ఇనుమడింపజేసిన ఘనతను సాధించుకున్న హిందూ ఆధ్యాత్మిక గురువు అయిన జయేంద్ర సరస్వతి పలు సందర్భాల్లో వివాదాస్పదుడయ్యారు. అయోధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు 2002లో ఆయన చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మఠం మాజీ ఉద్యోగి శంకరరామన్ హత్య కేసులో 2004 నవంబర్‌లో జయేంద్ర సరస్వతిని పోలీసులు అరెస్టు చేశారు. జయేంద్రకు సుప్రీంకోర్టు బెయిలు లభించిన అనంతరం 2005 జనవరిలో విజయేంద్ర సరస్వతిని కూడా అరెస్టు చేశారు. నెల తర్వాత ఆయనకు బెయిలు వచ్చింది. 2013 నవంబర్ 27న పుదుచ్చేరి సెషన్స్ కోర్టు వారిపై నేరాభియోగాలను కొట్టివేసింది.

తదుపరి శంకరాచార్య.. విజయేంద్రసరస్వతి



కాంచీపురం: జయేంద్ర సరస్వతి అనంతరం శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి కంచి కామకోటి పీఠం 70వ అధిపతి కానున్నారు. కంచి కామకోటి పీఠాధిపతిని 'శంకరాచార్య'గా సంబోధిస్తారు. కంచి శంకరాచార్యను.. హిందూ అద్వైత వేదాంత సిద్ధాంత పరిరక్షకులలో ఒకరిగా పరిగణిస్తారు. విజయేంద్ర సరస్వతి త్వరలోనే ఒక యువకుడిని తన వారసుడిగా ప్రకటించాల్సి ఉంటుంది. విజయేంద్రను ఇప్పటివరకు తమిళ అనుయాయులు 'బాల పెరియార్'గా సంబోధించేవారు. 1969లో కాంచీపురం సమీపంలోని తాండళంలో జన్మించిన శంకరనారాయణన్ ఆరో తరగతి వరకు పాఠశాలకు వెళ్లారు. సాయంకాలం వేదవిద్యను అభ్యసించారు. ఆయన తండ్రి కృష్ణమూర్తిశాస్త్రి వేదపండితుడు. శంకరనారాయణన్ తన 14వ ఏట.. 1983లో జయేంద్ర సరస్వతి ద్వారా సన్యాసాశ్రమం స్వీకరించారు. జయేంద్ర ఆయనను తన వారసుడిగా ప్రకటించి, శంకర విజయేంద్ర సరస్వతిగా నామకరణం చేశారు. 1987లో జయేంద్ర సరస్వతి ఆకస్మికంగా కనిపించకుండా పోయినప్పుడు విజయేంద్ర 70వ పీఠాధిపతి అయ్యారు. అనూహ్యంగా జయేంద్ర తిరిగి రావడంతో అప్పుడు ముగ్గురు పీఠాధిపతులున్న అసాధారణ పరిస్థితి నెలకొంది. ఆలయాల నిర్వహణకు సంబంధించి లోకధర్మ సేవా ఫౌండేషన్ ట్రస్టును నెలకొల్పడం వెనుక విజయేంద్ర సైద్ధాంతిక ప్రోత్సాహమున్నట్లు భావిస్తారు.



జమ్ముకశ్మీర్‌లోని లడక్‌ను సందర్శించిన జగద్గురు శ్రీజయేంద్రసరస్వతితో అధికారులు (ఫైల్)




తమిళనాడులోని కంచి మఠంలో ఆది శంకర భగవత్పాదకు చెందిన పాదుకలకు పూజచేస్తున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ (ఫైల్)



కంచికామకోటి పీఠం మహాస్వామి జగద్గురు శ్రీజయేంద్రసరస్వతికి బుధవారం కాంచీపురంలో నివాళులర్పిస్తున్న ముస్లింలు

ప్రముఖుల సంతాపాలు..

జయేంద్ర సరస్వతి కాలధర్మంపై రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, పలు రాష్ట్రాల నేతలు, ఇతర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.



మన దేశం అరుదైన ఆధ్యాత్మిక నేతను, సంఘసంస్కర్తను కోల్పోయింది. ఆయన శిష్యులకు, అనుయాయులకు నా సంతాపం.

– రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



మోక్షసిద్ధి పొందిన కంచి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతికి నా నివాళి. మానవాళి సంక్షేమానికి, ఆధ్యాత్మికతను పెంపొందించడానికి ఆయన చేసిన కృషి ఇతరులకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం.

– ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



విశిష్ట ఆలోచనలు, సేవల మూలంగా ఆయన లక్షల మంది భక్తుల హృదయాల్లో జీవిస్తూనే ఉంటారు.

– ప్రధానమంత్రి నరేంద్రమోదీ



బోధనల మూలంగా శంకరాచార్య జయేంద్ర సరస్వతి ప్రపంచవ్యాప్తంగా విశ్వాసుల మన్ననలందుకున్నారు.

– కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

గవర్నర్, ముఖ్యమంత్రి సంతాపం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కంచి కామకోటి పీఠాధిపతి శ్రీజయేంద్ర సరస్వతి మరణం పట్ల గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శంకరాచార్య ఆధ్యాత్మిక సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. జయేంద్ర అంత్యక్రియల్లో రాష్ట్రం తరపున పాల్గొనాలని అధికారులను ఆదేశించారు. సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని ఆయన ప్రపంచానికి చాటారని ఎంపీ కల్వకుంట్ల కవిత కొనియాడారు. జయేంద్ర శివైక్యంపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

రజనీకాంత్, తమిళ నేతల సంతాపం

కాంచీపురం: కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి మరణంపై తమిళనాడు ముఖ్యమంత్రి, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కే పళనిస్వామి, ఉప ముఖ్యమంత్రి ఓ పన్నీర్ సెల్వం, డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. 'జయేంద్ర సరస్వతి ఆత్మ దైవలో కానికేగింది. ఆయన భక్తులకు నా సంతాపం' అని రజనీకాంత్ ట్వీట్ చేశారు. కమల్‌హాసన్ నెలకొల్పిన 'మక్కల్ నీది మయ్యం' పార్టీ కూడా ఒక ప్రకటనలో సంతాపం తెలిపింది.




భారత జట్టులో బుమ్రా కీలక బౌలర్‌గా ఎదిగిన తీరు అద్భుతం. భారత బౌలింగ్ తురుపుముక్కగా మారిన అతని సేవలను కీలక సిరీస్‌లలో ఎక్కువగా ఉపయోగించేలా తెలివిగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. అతని బౌలింగ్ యాక్షన్ పూర్తి విభిన్నంగా గాయాలపాలయ్యే తీరుగా ఉంటుంది. అందుకే అతనికి శ్రీలంక సిరీస్‌నుంచి మేం విశ్రాంతిని కల్పించాలని నిర్ణయించాం.

ఎమ్మెస్కే ప్రసాద్, టీం ఇండియా సెలక్షన్ కమిటీ చైర్మన్

రఫెల్ నాదల్ లాంటి గొప్ప ఆటగాడిని ఓడించడంతోనే నేను అత్యుత్తమ ఆటగాడిని అని భావిస్తున్నాను. కోర్టులో అతను నాకు దీటైన ప్రత్యర్థి. కోర్టు బయట నాకు ప్రాణ స్నేహితుడు. ఈ ఏడాది 'బెస్ట్ కమ్ బ్యాక్', స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్' రెండు అవార్డులు సాధించడంలో అతనే నాకు ప్రేరణ. నా ప్రత్యర్థి నాదల్‌కు ధన్యవాదాలు.

రోజర్ ఫెదరర్, టెన్నిస్ ఆటగాడు



చరిత్రలో నేడు



1963

2 లక్షల మంది ఫ్రెంచ్ గని కార్మికుల సమ్మె.

1966

సిరియా అధికారాన్ని చేజిక్కించుకున్న బాత్ పార్టీ.





1967

బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన డొమినికా & సెయింట్ లుసియా.

పాకిస్థాన్‌లో వేలాదిమంది పౌరులు అదృశ్యమైపోతూ ఉండటం ఆందోళనను కలిగిస్తున్నది. సుప్రీంకోర్టు అదృశ్యమైన వారి ఆచూకీ కనుక్కోవడంలో ప్రభుత్వం విఫలమైందని వ్యాఖ్యానిస్తూ, ఈ విషయమై సాధించిన పురోగతిపై నివేదిక సమర్పించాలని దర్యాప్తు కమిషన్‌ను ఆదేశించింది. బాధ్యులు ఎవరనే విషయమై ఆధారాలు ఏమీ దొరుకవు. కానీ బాధ్యతాయుత పాలన అనేది నాగరిక రాజ్యాలను, ఆటవిక న్యాయం నుంచి వేరుచేసి చూపుతుందని గ్రహించాలె. ఏ అధికారమూ లేని కమిషన్‌లతో మొక్కుబడి దర్యాప్తులు సాగించడం కాదు. ఈ అదృశ్యాలను నివారణ ఎట్లా అనేది ఆలోచించాలె.

డాన్

పోలీస్ రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ బ్యూరో గణాంకాల ప్రకారం- పోలీసు సిబ్బందిలో మహిళల సంఖ్య 7.28 శాతమే అని తెలుస్తున్నది. సీనియర్ అధికారులైతే ఒక శాతం కూడా లేరు. ఈ నివేదిక పోలీసు యంత్రాంగంలోని సీనియర్ అధికారులకు, విధానకర్తలకు హెచ్చరిక కావాలె. మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచడం వల్ల, పోలీసు బలగం మరింత ప్రభావవంతంగా, మానవీయంగా మారుతుందని గ్రహించాలె. ఏ సమాజాన్ని కాపాడటానికి పోలీసు బలగం ఏర్పాటైందో, ఆ సమాజానికి తగిన ప్రాతినిధ్యశక్తిగా ఉండాలె. మహిళలపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో, పోలీసు శాఖ పనితీరుపై సందేహాలు తలెత్తుతున్నాయి.

హిందుస్థాన్ టైమ్స్

బీహార్ ప్రమాదం

బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా మీనాపూర్‌లో కారు ఢీకొని తొమ్మిదిమంది బడిపిల్లలు మరణించడం అత్యంత దారుణం. ఈ దుర్ఘటనలో మరో పన్నెండు మంది పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ మొత్తం ఉదంతం రాజకీయవ్యవస్థ ఎంత మొద్దుబారిపోయి ఉన్నదో వెల్లడిస్తున్నది. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని దవాఖానకు తరలించడం వాహనం నడిపేవారి బాధ్యత. కానీ వాహనాన్ని నడుపుతున్న బీజేపీ నేత మనోజ్ బైతా ప్రమాదం సృష్టించిన బీభత్సాన్ని పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. బడిపిల్లలు ఉండేచోట వాహనాన్ని జాగ్రత్తగా నడుపాలనే కనీస అవగాహన ఉన్నా ఈ ప్రమాదం జరుగకపోయేది. ఈ ఉదంతంలో బీహార్ ప్రభుత్వం, బీజేపీ నాయకత్వం వ్యవహరించిన తీరు కూడా బాధ్యతారహితంగా ఉన్నది. తమ పార్టీ నాయకుడే ప్రమాదకారకుడని మొదటే అంగీకరించి చర్య తీసుకుంటే హుందాగా ఉండేది. కానీ మొదట్లో ప్రమాదకారకులు ఎవరో తెలువలేదు. వాహనంపై ఉన్న బీజేపీ గుర్తు మూలంగా ఆ పార్టీ నాయకుడనేది మొదట వెల్లడైంది. ఆ తరువాత ఆ వాహనం యజమాని మనోజ్ బైతా అనేది వెల్లడైంది. అయినా అతడిని పోలీసులు అరెస్టు చేయలేదు. బీజేపీ నాయకులు బైతా తమ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాదని బుకాయించారు. బైతా వాహనంలో ఉన్నాడా లేడా అనే సందిగ్ధం నెలకొన్నది. కానీ సీసీటీవీ దృశ్యాల ఆధారంగా బైతా స్వయంగా వాహనం నడుపుతున్నాడని వెల్లడైంది. ప్రజాభిప్రాయం వ్యతిరేకంగా మారుతుండటంతో బీజేపీ నాయకులు బైతాను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించక తప్పలేదు. బైతా స్వయంగా వచ్చి లొంగిపోయే వరకు పోలీసులు అతడిని అరెస్టు చేయనే లేదు. బైతా వాహనం నడుపుతున్నప్పుడు మద్యం సేవించి ఉన్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బీహార్‌లో మద్య నిషేధం అమలులో ఉన్నందున ఈ ఆరోపణలకు మరింత ప్రాధాన్యం ఏర్పడ్డది. బీహార్‌లో జేడీయూ- బీజేపీ కూటమి అధికారంలో ఉన్నందున బైతాను పోలీసులు వెంటనే అరెస్టు చేయలేదనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది.

> **బాలల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని కూడా ధరంపూర్ దుర్ఘటన సూచిస్తున్నది. మన దేశంలో ప్రతి రోజు 43 మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారనేది దిగ్భ్రాంతికరమైన విషయం. పిల్లల భద్రతకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను మన దేశంలో పాటించడమే లేదు. పిల్లలను బడికి, ఇంటికి సురక్షితంగా తరలించే విషయమై కఠిన నిబంధనలను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలె. పాఠశాల బస్సులు, డ్రైవర్లకు సంబంధించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలె. ఎక్కడ ప్రమాదాలకు అవకాశం ఉన్నదో గుర్తించి చర్యలు తీసుకోవాలె. తల్లిదండ్రులకు కూడా భద్రతా సూత్రాలను బోధించి చైతన్యపరుచాలె.**

ధరంపూర్‌లో జరిగిన ప్రమాదానికి అధికార యంత్రాంగం కూడా బాధ్యత వహించక తప్పదు. ఈ సర్కారు బడి 77వ నెంబరు జాతీయ రహదారికి యాభై మీటర్ల దూరంలోనే ఉన్నది. పిల్లలు ప్రతిరోజు బడికి వెళ్ళిరావాలంటే, ఈ రహదారి దాటాల్సిందే. దగ్గర్లోనే అతివేగంగా వాహనాలు తిరుగాడుతుంటాయి. బడిని అక్కడి నుంచి వేరే చోటికి మార్చాలని పేద తల్లిదండ్రులు ఎంతోకాలంగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కానీ అధికార యంత్రాంగం పట్టించుకోలేదు. ఏదో ఒక రోజున ఘోర ప్రమాదం జరుగవచ్చునని తల్లిదండ్రులు భయపడుతూనే ఉన్నారు. ఇప్పుడు ఆ ఘోరం జరిగిపోయింది. అందుకే ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు ఆగ్రహంతో జాతీయ రహదారిపై రాకపోకలను అడ్డుకున్నారు. ప్రమాదంలో పిల్లలు మరణించిన వెంటనే ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి నాలుగేసి లక్షల రూపాయల పరిహారాన్ని ప్రకటించింది. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించింది. కానీ ప్రభుత్వ యంత్రాంగం ముందే తల్లిదండ్రుల విజ్ఞప్తిని ఆమోదించి, బడిని వేరేచోటికి తరలించినట్టయితే పిల్లల ప్రాణాలు పోకపోయేవి. ఎంతో ఒత్తిడి వస్తే తప్ప స్పందించలేనంతగా ప్రభుత్వ యంత్రాంగం మొద్దుబారిపోయి ఉన్నది. ఇటీవలనే ఒక రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట అనేకమంది ప్రాణాలను హరించింది. పాతకాలపు ఈ ఒక్క వంతెన సరిపోవడం లేదని మరిన్ని నిర్మించాలని ఎంతోకాలంగా ప్రయాణికులు కోరుతున్నా పట్టించుకొనేవారు లేరు. ఒక దుర్ఘటన జరిగిన కొందరు బలైతే కానీ అధికార యంత్రాంగంలో చలనం రావడంలేదు. ఇది పాలనా సంస్కృతికి సంబంధించిన అంశం. ప్రభుత్వ యం త్రాంగం నిరంతరం అప్రమత్తంగా, చురుకుగా ఉంటే అనేక సమస్యలు అతి సులభంగా పరిష్కారమైపోతాయి.

బాలల భద్రతపై దృష్టి సారించాల్సిన అవసరాన్ని కూడా ధరంపూర్ దుర్ఘటన సూచిస్తున్నది. మన దేశంలో ప్రతి రోజు 43 మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారనేది దిగ్భ్రాంతికరమైన విషయం. పిల్లల భద్రతకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను మన దేశంలో పాటించడమే లేదు. పిల్లలను బడికి, ఇంటికి సురక్షితంగా తరలించే విషయమై కఠిన నిబంధనలను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలె. పాఠశాల బస్సులు, డ్రైవర్లకు సంబంధించి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలె. ఎక్కడ ప్రమాదాలకు అవకాశం ఉన్నదో గుర్తించి చర్యలు తీసుకోవాలె. తల్లిదండ్రులకు కూడా భద్రతా సూత్రాలను బోధించి చైతన్య పరుచాలె. కార్లలో తల్లిదండ్రులు తాము సీటు బెల్ట్ పెట్టుకొని పిల్లలను యథాలాపంగా పైన కూర్చుండబెట్టుకుంటారు. ద్విచక్ర వాహనాలపై పిల్లలతో వెళ్ళేవారు కనీస జాగ్రత్తలు పాటించరు. పిల్లల భద్రతకు సంబంధించి అధికార యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని ఈ దుర్ఘటన గుర్తుచేస్తున్నది. పిల్లలు కనుక పెద్దగా పట్టించుకోనవసరం లేదనే దృక్పథం మారాలె. పిల్లల భద్రత విషయమై సమాజాన్ని మరింత చైతన్యవంతం చేయడం కూడా ప్రభుత్వ బాధ్యత.

జనగళం

హర్షణీయం

ప్రభుత్వ దవాఖానల్లోని మార్చురీల నుంచి పార్థీవదేహాలను తమ స్వగృహానికి తరలించే బృహత్తరమైన పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నది. ఇప్పటికే కొన్ని వేల పార్థీవ దేహాలను రూపాయి ఖర్చులేకుండా తరలించింది. అయితే కాలం చెల్లిన పార్థీవవాహనాలతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. కొన్ని వాహనాలు మధ్యమధ్యలో మొరాయిస్తున్నాయి. కాబట్టి ఈ విషయమై దృష్టిసారించి కొత్త వాహనాలను సమకూరిస్తే పేద ప్రజలకు మేలు చేసినట్లువుతుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తూ..

- టి.మనోజ్‌గౌడ్, మలక్‌పేట్, హైదరాబాద్

జాగ్రత్తలు పాటించాలె

ఎండాకాలం ఇప్పుడిప్పుడే మొదలవుతున్నా అప్పుడే భానుడు మండిపోతున్నాడు. తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది. ప్రతీ ఎండాకాలంలో వడదెబ్బకు పదుల సంఖ్యలో జనం మృత్యువాత పడుతున్నారు. వడదెబ్బ నుంచి ఉపశమనం పొందేందుకు ఏయే సలహాలు పాటించాలో ప్రచార, ప్రసార మాధ్యమాల ద్వారా ప్రభుత్వం సూచనలు జారీ చేయాలి. ప్రధాన కూడళ్లు, రోడ్లకిరువైపులా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి. స్వచ్ఛందసంస్థలు ఈ విషయంలో ముందుండాలి.

- తోట సుజన్, మల్లాపూర్, జన్నారం, నిర్మల్ జిల్లా

చెరువులను రక్షించుకోవాలి

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని 'మిషన్ కాకతీయ' పథకం ద్వారా చెరువులను పునరుద్ధరిస్తుంటే గ్రామీణ ప్రజలు చెరువులను రక్షించుకోలేకపోతున్నారు. చెరువుల్లో వ్యర్థాలను, పశువుల కళేబరాలను వేస్తూ చెరువులను దుర్గంధంగా తయారుచేస్తున్నారు. చెరువులను రక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు ప్రజలపై కూడా ఉన్నది.

- రామరాజు హరీశ్, తాళ్లపూసపల్లి, మహబూబాబాద్ జిల్లా

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

రైతు చరిత్రను తిరగరాస్తారా?

రైతు దుఃఖాన్ని సీతమ్మ దుఃఖంతో పోల్చిన కేసీఆర్ ముసుగులో ఏమేమీ ఆలోచనలు తిరిగాయో తెలియదు గాని, ఇందులో చరిత్ర మాత్రం చాలా ఉంది. భూమి నుంచి పుట్టి 'అవనిజ' అయిన సీత జీవితమంతా కష్టాలు అనుభవించి తిరిగి అదే భూతల్లి గర్భంలో కలిసినట్లు, 'అవనిజుడు' అయిన రైతు కూడా జీవితాంతం కష్టించిన అదే మట్టిలో కలిసిపోతున్నాడు. మానవజాతి చరిత్రలో స్థిర సమాజాలు ఒకవైపు, రాజ్యాలు మరొకవైపు ఏర్పడిన క్రీ.పూ. కాలం నుంచే రైతు దుఃఖం ఒక అంతులేని చరిత్ర అయింది. ఈ వేల ఏండ్ల చరిత్రను కేసీఆర్ ఇప్పుడు తిరుగరాయ బూనుతున్నారా?

ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో జరిగిన రైతు సమన్వయ సమితుల అవగాహనా సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ చెప్పిన విషయాలను ఇంతవరకు వ్యవసాయం కోసం ప్రభుత్వం తీసుకున్న ఇతర చర్యలతో కూడా కలిపి చూసినప్పుడు, ఒక విషయం అర్థమవుతున్నది. రైతు చరిత్రను, వ్యవసాయరంగ చరిత్రనే తిరగరాయటమన్నది చాలాపెద్ద మాట అవుతుంది గాని, ఇంతకాలం గల చరిత్ర గణనీయంగా మారేందుకు అడుగులు పడుతున్నాయని మాత్రం చెప్పవచ్చు. ఆ మేరకు జరిగినా అది దేశంలో మరెక్కడా, ఎప్పుడూ జరుగని మార్పు అవుతుంది. కానీ అందుకు ఒక షరతున్నది. కేసీఆర్‌కు గల సంకల్పస్ఫూర్తి ఈ సమితులకు, మరొకవైపు అధికార యంత్రాంగానికి కూడా కలుగాలి. అది తప్పనిసరి అవసరం. ఇక్కడనే మరొక మాట చెప్పాలి. గత మూడున్నరేండ్లలో మన యంత్రాంగం వ్యవహరణ తీరు 'రౌతు కొద్దీ గుర్రం' అనే సామెత వలె అయింది. యథాతథంగా అధికార యంత్రాంగం అంతటికీ తెలంగాణ స్ఫూర్తి అనదగ్గది కలుగలేదు. బంగారు తెలంగాణ కోసం శ్రమించగలమని వారెన్ని ప్రతిజ్ఞలు చేసినా అది స్వయంగా వారి వైపు నుంచి ఆచరణలో కల్పించకపోవటమన్నది ఒక చేదు నిజం. అయితే అదే యంత్రాంగంలోని కొన్ని విభాగాలు ముఖ్యమంత్రి స్వయంగా పట్టుబట్టి దృష్టి కేంద్రీకరించి పనులను మాత్రం అద్భుతమైన రీతిలో చేస్తున్నాయి. ఉదాహరణకు ఈ సమన్వయ సమితుల సమావేశానికి ముందురోజునే ఆయన రెవెన్యూ సిబ్బందికి, భూమి రికార్డుల ప్రక్షాళనను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఒక నెల మూల వేతనాన్ని కానుకగా ప్రకటించారు. ఆయన హఠం చేసి కూర్చొన్నట్లయితే పనులు ఈ విధంగా జరిగేవా? అది కూడా పనుల తకరార్లకు పేరుమోసిన రెవెన్యూ శాఖలో? 'రౌతు కొద్దీ గుర్రం' అంటున్నది అందువల్లనే. ఇటువంటి ఉదాహరణలనే మరికొన్ని కూడా చెప్పవచ్చు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి పథకాలు మొదలైనవి. ఇంతకూ విషయం ఏమంటే, ఈ రైతు సమన్వయ సమితుల ద్వారా గాని, ఇతరత్రా వ్యవసాయరంగం కోసం చేపడుతున్న పనుల ద్వారా గాని సాధించదలచుకున్న లక్ష్యాల విషయమై కేసీఆర్ 'రౌతు కొద్దీ గుర్రం' సామెతను ఎప్పుడూ మనసులో ఉంచుకోవలసి ఉంటుంది. అప్పుడు తెలంగాణ రైతు చరిత్రలో కొత్త అధ్యాయం మొదలై తీరుతుంది.

మానవ సమాజంలో మనిషి ఎప్పుడు దొరికిన దానితో అప్పుడు కడుపు నింపుకోవడం దశ నుంచి రేపటికి మిగుల్చుకోవటం కోసం అదనపు సంపదలు సృష్టించటం సుస్థిర వ్యవసాయ సమాజాలను ఏర్పాటుచేయటంతో మొదలైంది. ఆ సమాజాలను నడిపేవారికి ఖర్చుల కోసం ఆ మిగులను సేకరించటం లేదా గుంజుకోవటం అవసరమైంది. అట్లా మొదలైన కథ రాజ్యాలు, రాజరికాలు, ఫ్యూడలిజాలు, యుద్ధాలు, వైభోగాలు పెరిగే కొద్దీ రైతు దుఃఖాన్ని పెంచివేశాయి. ఇందుకు మినహాయింపులు చాలాకొద్దీ. ఇదే కథాక్రమం మధ్యయుగాల మీదుగా బ్రిటిష్ వలస పాలనా కాలమంతా కొనసాగింది. ఫ్యూడలిజం తర్వాత పారిశ్రామిక విప్లవం, అంతర్జాతీయ మార్కెట్లు ఇందుకు కొత్త రూపాలను తీసుకొచ్చాయి. విచారకరం ఏమంటే వలసల అనంతరం భారతదేశంతో సహా వర్ధమాన దేశాలు అన్నింటా ఇందులో స్వల్పంగా మాత్రమే మార్పులు వచ్చాయి. ఆర్థిక వ్యవస్థ నిర్మాణపు తీరు, దాని ఆయువుపట్లపై బలవంతులకు గల పట్టు, రాజకీయ నాయకత్వాలు కూడా ఆ బలవంతుల పక్షం వహించటం ఇందుకు కారణాలు. పైగా ఈ రోజున ఇదంతా తెలంగాణ పరిమితమైన పరిస్థితి కాదు. చుట్టూ జాతీయ, అంతర్జాతీయ విధానాలు, ఆచరణల వలయం ఒకటి బలంగా ఆవరించుకొని ఉండటం విస్మరించలేని విషయం.

ఇటువంటి సుదీర్ఘమైన నేపథ్యం, చుట్టూ ఆవరించిన వలయాల మధ్య రైతు చిక్కుకుని అక్షరంలా విలవిలలాడుతున్నాడు గనుకనే తెలంగాణ ప్రభుత్వ నేత రైతు దుఃఖాన్ని సీతమ్మ దుఃఖంతో పోల్చి చెప్పారని ప్రత్యేకంగా అనునక్కరలేదు. ఈ దుఃఖ చరిత్ర మహారాక్షసమైనది, రైతును నిరంతర దుఃఖంలో ఉంచుతున్న వ్యవస్థ మహా బలవత్తరమైనది గనుకనే చరిత్రనే తిరుగరాయటమన్నది చాలా పెద్దమాట అవుతుందని పైన అనుకున్నాము. అదే సమయంలో ఆ పరిస్థితిని గణనీయంగా మార్చటం అసాధ్యమైంది కాదు. అందుకు కావలసింది దృఢమైన సంకల్పం, తగిన దార్శనికత, ప్రణాళికారచన, నిధుల ఏర్పాటు కార్యనిర్వహణా సామర్థ్యం. ఈ అయిదూ ఉన్నట్లయితే గణనీయమైన మార్పులు కనిపిస్తాయి. అవి రాగల సూచనలు గత మూడున్నరేండ్లుగా తొలి దశలో వివిధ రూపాల్లో కన్పిస్తూ రాగా, ఇప్పుడు రైతు సమన్వయ సమితుల ఏర్పాటుతో అవి మలిదశకు చేరుతున్నాయి.

> ఏ వ్యవసాయ కమిషన్ నివేదికను చూసినా, వ్యవసాయార్థిక శాస్త్రవేత్తలను అడిగినా, ఈ రంగం బాగుపడేందుకు చేసే సిఫార్సులు ఇంతకుమించి అంతగా కన్పించవు. ఈ విధంగా రైతు దుఃఖం పోయినప్పుడు వ్యవసాయ కూలీల దుఃఖం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడే వివిధ వృత్తులవారి దుఃఖం కూడా పోయేందుకు ఆస్కారం ఏర్పడుతుంది.

ఒక్క మాటలో చెప్పాలంటే ఈ రకరకాల చర్యలన్నీ కలిసి రైతుకు సాధికారతను కల్పిస్తాయి. పరాధీన స్థితిని పోగొడుతాయి. రైతు దుఃఖాన్ని పోగొట్టి తన చరిత్రను తిరుగరాసేందుకు తగిన ఆధారాలను సృష్టిస్తాయి. అందుకు జరుగవలసిన నిర్దిష్టమైన పనులు కొన్ని ఉన్నాయి. మొదటిది రైతుకు అవసరమైన వనరులను సమకూర్చటం. రెండవది నాణ్యమైన ఉత్పత్తిని, ఉత్పాదకతను సాధించేట్లు సహకరించటం, వీలైనంత లాభం రావటం, ఇది మొదటి నుంచి చివరివరకు కూడా మూడు విధాలుగానూ జరిగేట్లు టీఆర్‌ఎస్ ప్రభుత్వం చూడగలిగితే 'అవనిజుడు' అయిన రైతుకు ఇక దుఃఖించవలసిన పరిస్థితే లేకపోగా, ఆనందించేందుకు తగిన రోజులు వస్తాయి. సీతమ్మ దుఃఖచరిత్ర మార్చగలది కాదు గాని, రైతు దుఃఖ చరిత్ర ఇక గత చరిత్రగా మిగిలిపోతుంది.

పైన పేర్కొన్న మూడు నిర్దిష్టమైన పనులకు సంబంధించి ఏమేమి జరుగాలో, జరుగుతున్నాయో, ఇంకా జరుగవలసి ఉన్నదో చర్చలలో కనిపిస్తున్నదే అయినా ప్రస్తుత చర్చ సందర్భంగా క్లుప్తంగా పేర్కొనటం అవసరం. వాటిలో మొదటిది వివిధ వనరులు. రైతుల వద్ద భూమి అనే వనరు ఉండటం నిజమే గాని అందుకు సంబంధించిన యాజమాన్యపు రికార్డుల చిక్కులు పరిష్కరించటం ప్రభుత్వం చేసిన ఒక గొప్ప పని. ఇతర వనరులైన నీరు, విద్యుత్, ఎరువులు, మందులు, విత్తనాలు వంటివి ఇప్పటికీ కొన్ని మొదలుకాగా తక్కినవి (ముఖ్యంగా పెట్టుబడి) త్వరలో అమలుకు రానున్నాయి. నాణ్యమైన ఉత్పత్తి, అధిక ఉత్పాదనకు పైన పేర్కొన్న మేలిరకం విత్తనాల వంటివి ఉపయోగపడగా, వ్యవసాయ విస్తరణాధికారుల సంఖ్యను గణనీయంగా పెంచటం, వారి ద్వారా భూసార పరీక్షలు, సలహాలు యాంత్రీకరణ తోడ్పడనున్నాయి.

అయితే ఉత్పాదకతలో ఇతర ఆసియా దేశాలకన్నా బాగా వెనుకబడి ఉన్న భారతదేశం గాని, తెలంగాణ గాని ఈ విషయమై చేయవలసింది చాలా ఉంటుంది. ఇక చివరి కీలకం పంటను నిలువ చేయగలశక్తి, ధర పలికినప్పుడే అమ్ముకోవటం, ధరల నిర్ణయంతో భాగస్వామ్యం, మార్కెట్ శక్తుల బారిన పడకపోవటం. దీని అర్థం మార్కెట్లు మాయమవుతాయని కాదు. అవి ఇంతకాలం వలె వ్యవహారాన్ని తామే నియంత్రిస్తూ రైతులను మోసగించటం గాక న్యాయబద్ధంగా ప్రవర్తించటం జరుగాలి.

ముఖ్యమంత్రి పదేపదే అంటున్నట్లు, రైతులు సంఘటితమై సమన్వయ సమితుల నాయకత్వాన ప్రణాళికాబద్ధంగా వ్యవహరించినట్లయితే, సమితులు కూడా సమర్థవంతంగా పనిచేసినట్లయితే, నిజానికి పైమూడు విధాలైన అంశాలను (వనరులు, ఉత్పత్తి-ఉత్పాదకతలు, మార్కెటింగ్) కూడా అవి పర్యవేక్షించగలవు. పర్యవేక్షించాలి కూడా. ఏ వ్యవసాయ కమిషన్ నివేదికను చూసినా, వ్యవసాయార్థిక శాస్త్రవేత్తలను అడిగినా, ఈ రంగం బాగుపడేందుకు చేసే సిఫార్సులు ఇంతకుమించి అంతగా కన్పించవు. ఈ విధంగా రైతు దుఃఖం పోయినప్పుడు వ్యవసాయ కూలీల దుఃఖం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఆధారపడే వివిధ వృత్తులవారి దుఃఖం కూడా పోయేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. తెలంగాణ వ్యవసాయం దేశంలో ఎక్కడాలేని విధంగా నిలిచి వెలుగుతుంది.

అందరికీ నాణ్యమైన విద్యే లక్ష్యం

విద్య



మెట్టు శ్రీనివాస్

ఉమ్మడి రాష్ట్ర పాలనలో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం చేయబడింది. మౌలిక సదుపాయాలు, బోధన వసతులు, విద్యార్థులు చదువుకునే వాతావరణం లేకుండాపోయింది. సమయానికి పాఠ్య పుస్తకాలు, దుస్తులు అందేవి కావు. పరికరాలు, రసాయనాలు లేక ప్రాక్టికల్ ల్యాబ్స్ మూతబడినాయి. బాలికల చదువుల పట్ల నిర్లక్ష్యం, హాస్టల్ విద్యార్థులు దొడ్డు బియ్యం తినలేక ఖాళీ కడుపులతో కాలం వెళ్లదీయడం, పక్కా భవనాలు లేక, ఉపాధ్యాయుల కొరత, సిలబస్ పూర్తికాకపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందలేకపోయారు. ముఖ్యంగా పాఠశాల, మధ్యంతర విద్య వ్యాపారమయమైంది.

'ప్రపంచాన్ని మార్చడానికి విద్యను మించిన ఆయుధం మరొకటి లేదు.' అనే నెల్సన్ మండేలా సూక్తి అక్షరాల నిజం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నాలుగేండ్లలో ప్రభుత్వ విద్య, అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టింది. నాణ్యమైన విద్యను అందించడం ద్వారా సామాజికాభివృద్ధి పునాదులను బలోపేతం చేయడానికి కృషిచేస్తున్నది. తెలంగాణ విద్యార్థులను ప్రపంచస్థాయిలో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతుంది. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల సత్వర అభివృద్ధికి విద్య ఒక చోదకశక్తిగా పనిచేస్తుంది. అందుకే ప్రతీ పేద పిల్లవాడు చదువుకునే విధంగా, ఆ బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించే విధంగా నూతన విద్యావిధానాన్ని అవలంబిస్తున్నది. విద్యారంగం సామాజిక, శ్రేయోరంగం అక్కడ భావితరాలను వారి నైపుణ్యాలను రూపొందించడమే తప్ప లాభనష్టాల లెక్క ఉండదని భావించిన మన ముఖ్యమంత్రి దేశానికి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే అనేక పథకాలను ప్రభుత్వ విద్యారంగంలో ప్రవేశపెట్టారు. వెనుకబడిన ఆర్థిక వ్యవస్థను సంపన్నవంతం చేయడానికి, ప్రజల జీవన ప్రమాణాలను మరింత విస్తరింపజేయడానికి ప్రధానంగా మూడురకాల వనరుల మీద ఆధారపడవలసి ఉంటుంది. 1.భౌతిక వనరులు, 2.ఆర్థిక వనరులు 3.మానవ వనరులు. వీటిలో మానవ వనరులు అతి ముఖ్యమైనవి. ఎందుకంటే సమర్థవంతమైన మానవ వనరులు లేనట్లయితే మిగతా రెండింటిని గరిష్ఠస్థాయిలో ఉపయోగించడం అసాధ్యం. మానవ వనరుల అభివృద్ధి పైనే ఒక ప్రాంతంలోని అన్నిరంగాల అభివృద్ధి ఆధారపడి ఉంటుందని ఒక సామాజిక వాస్తవం. మానవ వనరుల అభివృద్ధి అంటే మానవుడిలోని దాగిఉన్న శక్తి సామర్థ్యాలను ప్రతిభా పాటవాలు, నైపుణ్యాలు, విలువలు, దృక్పథాలు మొదలైన వాటిలో మార్పు తేవడం, అభివృద్ధి పరుచడం వాటిని వ్యవస్థ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా గరిష్ఠస్థాయిలో వినియోగించడం. అదే మానవ వనరుల అభివృద్ధి.

ఒక ప్రాంతం ప్రధానమైన ఆస్తి మానవ వనరులే! మానవ వనరులను అభివృద్ధి పరుచడంలో నాణ్యమైన విద్య ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగపడుతుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యావిధానంలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కేజీ టు పీజీ ఉచిత విద్యను అందించడానికి బలమైన పునాదులు వేస్తున్నది.

ప్రైవేట్ విద్యాలయాలకు దీటుగా ప్రభుత్వ విద్యాలయాలను తయారు చేసేందుకు మౌలిక సదుపాయాలు, బోధన వసతులు, విద్యార్థులు చదువుకునే మంచి వాతావరణం ఏర్పాటుకు కృషి చేస్తున్నది. ఉదాహరణకు వరంగల్ నగరంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో 2017-18 విద్యా సంవత్సరంలో ప్రైవేట్ హాస్టల్స్, స్కూల్స్ నుంచి 70 మంది విద్యార్థులు చేరారు. 1వ తరగతి నుంచి 10 తరగతి మధ్యలో బడి మానేసే పిల్లల శాతం గణనీయంగా తగ్గింది. 2014-15 మధ్య కాలంలో డ్రాపౌట్స్37.56 శాతం ఉండగా 2016-17 విద్యా సంవత్సరంలో అది 34.7 శాతంగా తగ్గింది. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల్లో పెరుగుదల ఉన్నట్లు 2016 విద్యా నివేదిక వార్షిక స్థితి వెల్లడించింది. ఈ నివేదిక కీలకంగా కనుగొన్న విషయాలు 1.మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులో కనీసం 1వ తరగతి పాఠ్య పుస్తకాలు చదువగలిగే పిల్లల నిష్పత్తి 2014లో 40.2 శాతం నుంచి 2016లో 42.5 శాతం పెరిగింది. 2.మూడవ తరగతి పిల్లల్లో అంకగణిత సామర్థ్యాలు 5 శాతంపైగా పెరిగిన 7 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. 3.ఎనిమిదవ తరగతి పిల్ల ల్లో భాగాహారం చేసే సామర్థ్యం ఉన్నవారి సంఖ్య జాతీయస్థాయిల్లో క్రమంగా తగ్గుతుండగా తెలంగాణలో 5 శాతంపైగా పెంపొందింది. 4. 2014 నుంచి తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతిలో నమోదైన విద్యార్థుల్లో ఇంగ్లీష్ చదివే విద్యార్థుల సంఖ్య పెరిగింది. గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేయడంలో తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక మార్పును సాధించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కలిపి కేవలం 296 (259+37 జనరల్) గురుకుల పాఠశాలలు మాత్రమే ఉండేవి. కేవలం మూడేండ్లలో కొత్తగా 489 గురుకులాలు ప్రారంభించి మొత్తం గురుకులాలను 785కు తీసుకొచ్చింది. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు, వారికి అత్యంత భద్రత, సౌకర్యాలు కల్పిస్తూ సగం రెసిడెన్షియల్స్‌ను బాలికల కోసం కేటాయించారు. ఈ లెక్కన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో (డిగ్రీ గురుకులాలు మినహాయిస్తే) రాబోయే 5 సంవత్సరాల్లో 4,74,240 మందికి అవకాశం లభిస్తుంది. 2017-18 విద్యా సంవత్సరంలో ఈ గురుకుల పాఠశాలల్లో మొత్తం 2,38,948 మంది విద్యార్థులు ఉండగా వీరికి ప్రభుత్వం 1836.95 కోట్లు ఖర్చు చేస్తున్నది. ఒక్కొక్క విద్యార్థి పై ఏడాదికి సగటున 1,25,000 రూపాయలు ఖర్చుచేస్తున్నారు. వీటితో విద్యార్థులకు పౌష్టికాహారం, మానసిక వికాసం పెరుగాలనే సదుద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నది. ప్రభుత్వ, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ఉన్నత ప్రమాణాలున్న విద్యను అందించాలనే దానిలో భాగంగా జూనియర్ కాలేజీల్లో ప్రాక్టికల్స్ కచ్చితంగా నిర్వహించేటట్లు చేశారు. కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. డిగ్రీ కాలేజీలకు పక్కా భవనాల కోసం భూమి ఉండి భవనం లేని ప్రతీ కాలేజీకి 2.25 కోట్ల రూపాయలు మంజూరు చేసింది.

> ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత పిల్లలు, గిరిజనులు, స్త్రీలు, ఎంబీసీల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్నది. అక్షరాస్యత పెరుగాలంటే పేదరిక నిర్మూలన కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందాలి. సర్కారు బడులు మన బడులు అనే దృక్పథం ప్రజల్లో రావాలి. ఉపాధ్యాయులు సమర్థవంతంగా పని చేయాలి. నాణ్యమైన విద్యకోసం అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి.

పోరాడి సాధించుకున్న తెలంగాణ అన్నిరంగాల్లో ముందంజలో దూసుకెళ్తుండగా అక్షరాస్యతలో మాత్రం వెనుకబడింది. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో ఏడేండ్లు లేదా ఆ పైబడిన వయసున్నవారు 3,11,04,508 మంది ఉన్నారు. ఈ జనాభాలో 2,06,96,778 మంది అక్షరాస్యులున్నారు. అంటే రాష్ట్ర జనాభా 66.5 శాతం అక్షరాస్యత రేటు సాధించింది. ఇది 72.9 శాతంగా ఉన్న సగటు జాతీయ అక్షరాస్యత కంటే తక్కువ. ఇందుకు ప్రధాన కారణం ఉమ్మడి పాలనలో ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేయడమే. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంత పిల్లలు, గిరిజనులు, స్త్రీలు, ఎంబీసీల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్నది. అక్షరాస్యత పెరుగాలంటే పేదరిక నిర్మూలన కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా ప్రజలకు అందాలి. సర్కారు బడులు మన బడులు అనే దృక్పథం ప్రజల్లో రావాలి. ఉపాధ్యాయులు సమర్థవంతంగా పనిచేయాలి. నాణ్యమైన విద్యకోసం అందరికీ సమాన అవకాశాలు కల్పించాలి. అధ్యాపక, ఉద్యోగుల శక్తి సామర్థ్యాలను పెంపొందించాలి. అక్షరాస్యత స్థాయిలను వృద్ధిపరుచాలి. బడి మానేసేవారి శాతాన్ని తగ్గించాలి. విద్యార్థుల అభ్యాసన ఫలితాలు పెంపొందించడానికి, కేజీ టు పీజీ ఉచిత విద్య అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తున్నది. తెలంగాణ ప్రజానీకమంతా ప్రభుత్వానికి అండగా ఉండటమే మన ముందున్న కర్తవ్యం!

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

అతిలోక సుందరికి అభిమానుల అంతిమ వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన శ్రీదేవి అంత్యక్రియలు
- విలేపార్లేకు తరలివచ్చిన తారాలోకం
- ఆఖరి చూపుకోసం తపించిన జనం





అంతిమయాత్రకు తరలివచ్చిన అభిమాన జనవాహిని ; (ఇన్‌సెట్లో) శ్రీదేవి పార్థివదేహం వద్ద బోనీకపూర్ కుటుంబ సభ్యులు

చుక్కల్లో చేరిన జాబిలమ్మ



ముంబై, ఫిబ్రవరి 28:

వెండితెర వెలుగురేఖ అంతర్ధానమైంది. ప్రజల సజలనేత్రాల్లో ఆమె రూపం మసకబారుతుండగా.. 'ఇక సెలవ్' అంటూ అనంత లోకాలకు వెళ్లిపోయింది. అర్ధశతాబ్దం పాటు ఆర్క్ లైట్ల వెలుగులో విరాజిల్లిన సినీ చాందినీ.. ఇక జ్ఞాపకంగా మిగిలిపోయింది. ముంబైలోని విలేపార్లే సమాజ్ హిందూ శ్మశాన వాటికలో బుధవారం శ్రీదేవి అంత్యక్రియలు పూర్తయ్యాయి. కుటుంబ సభ్యులు, హితులు, సన్నిహితులు, చిత్ర పరిశ్రమ ప్రముఖులు, అశేష సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు అశ్రునయనాలతో శ్రీదేవికి తుది వీడ్కోలు పలికారు. తన అజరామర నటనతో అసంఖ్యాక అభిమానుల్ని సంపాదించుకున్న శ్రీదేవి మరణ వార్త ఎంతోమందిని కలిచివేసింది. గత శనివారం దుబాయ్‌లో హఠాన్మరణం చెందిన శ్రీదేవి పార్థివదేహాన్ని మంగళవారం దుబాయ్ నుంచి ప్రత్యేక విమానంలో ముంబై లోఖండ్‌వాలాలోని ఆమె నివాసానికి తీసుకువచ్చారు. బుధవారం ఉదయం 9గంటలకు అభిమానుల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌కు తరలించారు. శ్రీదేవి కుమార్తెలు జాహ్నవి, ఖుషీతోపాటు కుటుంబ సభ్యులు విషణ్ణవదనాలతో భౌతిక కాయం పక్కన నిలబడ్డారు.

కడసారి కంచిపట్టు చీరలో..

ఎప్పుడూ అందంగా కనిపించే శ్రీదేవిని చివరిక్షణాల్లోనూ అలాగే ముస్తాబు చేశారు. అభిమానుల మనసుల్లో నుంచి ఆ మనోహర రూపం చెదిరిపోకుండా ఉండేలా ఆమె కుటుంబసభ్యులు చర్యలు తీసుకున్నారు. సిరిమల్లెపూవు శ్రీదేవికి ఎంతో ఇష్టమైన తెల్లని పూలతో అంతిమయాత్ర వాహనాన్ని ముస్తాబు చేశారు. తన అంతిమయాత్ర అంతా తెలుపురంగులో జరుగాలని ఓ సందర్భంలో శ్రీదేవి తన మనసులో మాటను బయటపెట్టడంతో అంతిమ యాత్రలో అంతాటా తెలుపురంగు దర్శనమిచ్చింది. వాహనం ముందుభాగాన శ్రీదేవి భారీ చిత్రపటాన్ని ఉంచారు. ఆ చిత్రపటం చుట్టూ అందంగా అల్లిన తెల్లని పూలదండలను వేలాడదీశారు. పార్థివ దేహాన్ని శ్రీదేవికి ఎంతో ఇష్టమైన ఎరుపురంగు కంచి పట్టు చీర, ఎర్రని బొట్టు, తెల్లని పూలు, నగలతో అలంకరించారు.

ప్రభుత్వ లాంఛనాలతో..

మహారాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో శ్రీదేవి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అంతకుముందు శ్రీదేవి పార్థివ దేహంపై త్రివర్ణ పతాకాన్ని కప్పారు. అనంతరం పోలీసులు తుపాకులు గాల్లోకి పేల్చి గౌరవవందనం సమర్పించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర దాదాపు ఏడు కిలోమీటర్ల మేర సాగింది. బోనీకపూర్, ఆయన మొదటిభార్య కుమారుడు అర్జున్ కపూర్, తమ్ముళ్లు అనిల్‌కపూర్, సంజయ్‌కపూర్, మేనల్లుడు మోహిత్ మార్వా, పలువురు సినీ నటులు అంతిమ యాత్ర వాహనంలో శ్రీదేవి పార్థివ దేహం పక్కనే నిలబడ్డారు. వేలాదిగా తరలివచ్చిన జనం రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల పొడవున బారులు తీరారు. చెట్లు, భవనాలు ఎక్కి మరీ తమ అభిమాన నాయిక ఆఖరి దర్శనం కోసం తపించారు. పోటెత్తిన జనాన్ని నియంత్రించలేక పోలీసులు ఇబ్బంది పడ్డారు. అంత్యక్రియలు జరిగేందుకు సహకరించాల్సిందిగా అభ్యర్థిస్తూ అర్జున్‌కపూర్ పలుమార్లు చేతులు జోడించి వేడుకోవడం కనిపించింది. అభిమానుల అశ్రునయనాల మధ్య దారంతా కన్నీటిసంద్రాన్ని తలపించింది. సోనమ్‌కపూర్, షారుఖ్‌ఖాన్ సహా పలువురు సినీప్రముఖులు వాహనాలు దిగి నడిచారు. ఉత్తరాది, దక్షిణాది అనే తేడాలేకుండా అన్ని ప్రాంతాల నుంచీ అభిమానులు విచ్చేశారు. శ్రీదేవి చిత్రపటాలు, పూలతో వారు తుదివీడ్కోలుకు హాజరయ్యారు. కర్ణాటక, చెన్నై నుంచి కూడా ముంబైకి వచ్చిన అభిమానులతోపాటు వయసు తేడా లేకుండా యువకుల నుంచి వృద్ధుల వరకూ తరలివచ్చారు. 2012లో రాజేశ్ ఖన్నా వీడ్కోలు యాత్ర తర్వాత ముంబైలో అంతటి భారీస్థాయిలో ప్రజలు పాల్గొన్న అంతిమయాత్ర ఇదేనని స్థానికులు తెలిపారు.

శ్మశానవాటికకూ అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. సుమారు ఐదువేల మంది సినీ ప్రముఖులు అంతిమ కార్యక్రమానికి హాజరయ్యారు. రజనీకాంత్, కమల్‌హాసన్, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, హేమామాలిని, జయప్రద, సల్మాన్‌ఖాన్, సుస్మితాసేన్, ఐశ్వర్యారాయ్, విద్యాబాలన్, అనిల్ అంబానీ, అనుపమ్ ఖేర్, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. బాలీవుడ్ నటుడు షారుఖ్‌ఖాన్ శ్రీదేవి చివరి చూపుకోసం విలేపార్లే శ్మశానవాటిక వద్దకు పరుగులు తీస్తూ వచ్చారు. సాయంత్రం 5:30 గంటల ప్రాంతంలో శ్రీదేవి అంత్యక్రియలు ముగిశాయి. మహానటికి తుది వీడ్కోలు పలికేందుకు వచ్చిన అభిమానులంతా బాధాతప్త హృదయాలతో వెనుదిరిగారు.



అంత్యక్రియల్లో జయప్రద, వెంకటేశ్

ఎరుపు చీరలో శాశ్వతంగా నిద్రించింది..

శ్రీదేవి మృతిపై హేమామాలిని ట్వీట్



న్యూఢిల్లీ: ఎరుపు రంగు చీరలో ఆమె అందంగా శాశ్వతంగా నిద్రపోయిందంటూ డ్రీమ్ గర్ల్ హేమామాలిని శ్రీదేవికి నివాళులు అర్పించారు. తన కుమార్తె ఈషా డియోల్‌తో కలిసి శ్రీదేవి అంతిమ యాత్రలో పాల్గొన్న తరువాత హేమ ఈ మేరకు బుధవారం ట్వీట్ చేశారు. 'శ్రీదేవిని కడసారి వీడ్కోలు పలికాను. ఆమె మృతితో యావత్ సినీ పరిశ్రమ శోకతప్తమైంది. తనువు చాలించినా ఆమె మోము నిర్మలంగా ఉంది. పూర్తి ప్రశాంతత కనిపించింది. ఎరుపురంగు చీరలో ఆమె అందంగా శాశ్వతంగా నిద్రపోయింది' అని హేమ పోస్ట్ చేశారు.

మాకు ఏకాంతం కల్పించండి

శ్రీదేవి కుటుంబం సంయుక్త లేఖ



ముంబై: భారతీయ అందాలనటి శ్రీదేవి అకాలమరణంపై విచారం వ్యక్తం చేసుకునే ఏకాంతాన్ని తమకు కల్పించాలంటూ ఆమె కుటుంబసభ్యులు సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానుల్ని, కుటుంబసభ్యుల్ని, సహచర నటుల్ని వదిలి కానరాని దూరాలకు శ్రీదేవి తరలివెళ్లారు. అభిమానులకు, కుటుంబానికి అపూర్వమైన ఆస్తిని అందించారు. అమెపై ప్రతిఒక్కరి ప్రేమ నిస్సందేహమైంది. అయితే, ఆమె జ్ఞాపకాలు నెమరేసుకునేందుకు, విచారాన్ని వ్యక్తం చేసేందుకు మా కుటుంబానికి అవకాశమివ్వండి. దయచేసి మా ఏకాంతానికి భంగం కలుగనివ్వకండి' అని ఆ ప్రకటనలో కపూర్, అయ్యప్పన్, మార్వా కుటుంబాలు స్పష్టంచేశాయి.

ఆ మానవతామూర్తి నాకు దేవత

అంతిమయాత్రకు ఉత్తరప్రదేశ్ నుంచి ముంబై వచ్చిన అంధుడు



ముంబై: అందాలతార శ్రీదేవి అంతిమయాత్రలో పాల్గొనేందుకు ఓ అంధుడు ఉత్తరప్రదేశ్ నుంచి ముంబై వచ్చాడు. రెండు రోజులుగా ఆమె నివాసం వద్దే పడిగాపులు కాశాడు. తనకు అండగా నిలిచిన ఆ తారను కళ్లారా చూడలేకపోయినా... అంతిమయాత్రలో పాల్గొనాలని ముంబై వచ్చాడు. 'ఒక కార్యక్రమంలో శ్రీదేవిని కల్సుకునే అవకాశం వచ్చింది. తన సోదరుడు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నాడని చెప్పా. ఆమె వెంటనే చికిత్స కోసం రూ.లక్ష ఇచ్చారు. దవాఖాన బిల్లు కట్టమని మరో రూ.లక్ష కూడా అందించారు. నా తమ్ముడికి ప్రాణం పోసిన శ్రీదేవి సినిమాలు చూడలేదు. నేను ఆమె అభిమానిని కూడా కాదు. కానీ నన్ను ఆదుకున్న మానవమూర్తి ఆమె. అమెకు ఏదీ తిరిగివ్వలేనని నాకు తెలుసు. కనీసం ఆమె అంతిమయాత్రలో పాలు పంచుకుందామని ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చాను' అని గద్గదస్వరంతో అంధుడు జతిన్ వాల్మీకీ చెప్పారు.

ఎంపీల అలవెన్సులు 40వేలు పెంపు

- ఎన్ఐఏకి మానవ అక్రమ రవాణా కేసులు
- 12 సేవా రంగాలకు రూ.5వేల కోట్లతో యాక్షన్ ప్లాన్ ఫండ్
- నాఫెడ్ రుణ పూచీకత్తు రెట్టింపు
- కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ సభ్యుల నెలవారీ అలవెన్సులు రూ.40వేల వరకు పెరిగాయి. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం కేంద్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ప్రస్తుతం నియోజకవర్గం అలవెన్సు కింద ఒక్కో ఎంపీకి నెలకు రూ.45వేలు కేంద్రప్రభుత్వం అందజేస్తుండగా అది రూ.70వేలకు పెరిగింది. అలాగే కార్యాలయ అలవెన్సు కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.45వేలను రూ.60వేలకు పెంచింది. ఈ లెక్కన మొత్తం నెలకు రూ.40వేలు పెరిగాయి. ఫర్నీచర్ ఖర్చుల కింద ఎంపీలకు ఐదేండ్లకోసారి అందజేసే అలవెన్సు రూ.లక్షకు పెరిగింది. ప్రస్తుతం ఇది రూ.75వేలుగా ఉన్నది. పెరిగిన అలవెన్సులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. మానవ అక్రమ రవాణాను నిరోధించడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఇకపై ఇలాంటి కేసులను జాతీయ దర్యాప్తు బృందం(ఎన్ఐఏ) విచారించనుంది. ముసాయిదా బిల్లు ప్రకారం తరుచుగా మానవ అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తికి జీవితకాల కారాగారశిక్ష పడనుంది. 12 సేవా రంగాలకు సంబంధించి రూ.5,000 కోట్లతో ఏర్పాటు చేయనున్న యాక్షన్ ప్లాన్ ఫండ్‌కు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. బ్యాంకుల నుంచి నాఫెడ్ తీసుకునే రుణాలకు ఇచ్చే పూచీకత్తును రెట్టింపు చేయడానికి ఉద్దేశించిన ప్రతిపాదనను కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. ప్రస్తుతం రూ.9,500 కోట్ల వరకు కేంద్రం పూచీకత్తు ఇస్తున్నది. ఈ పూచీకత్తు రూ.19,000 కోట్లకు పెరుగనుంది. మైనింగ్ రంగంలో పరస్పర సహకారం కోసం జోర్డాన్ దేశంతో చేసుకున్న ఒప్పందానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

ఒడిశాలో బీజేడీ, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం



భోపాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సంబురాలు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఉపఎన్నికలో రెండు స్థానాల్ని కాంగ్రెస్ కైవసం చేసుకోగా, ఒడిశాలో జరిగిన ఒక ఉపఎన్నికలో అధికార బీజేడీ ఘన విజయం సాధించింది. ఒడిశా బీజేపూర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉపఎన్నికలో అధికార బీజేడీ గెలుపొందింది. మూడు సార్లు ఈస్థానం నుంచి గెలిచిన కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా దక్కలేదు.బీజేడీ అభ్యర్థి రీటా సాహు తన సమీప బీజేపీ అభ్యర్థి అశోక్ పాణిగ్రాహిపై 41,933 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రణయ సాహు కేవలం 10,274 ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితమయ్యారు. బీజేపూర్ నుంచి హ్యాట్రిక్ విజయం నమోదుచేసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే సుబల్ సాహు మృతితో ఉపఎన్నిక జరిగింది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ముంగౌలి స్థానానికి జరిగిన ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధించింది. సమీప బీజేపీ అభ్యర్థి భాయ్ సాబ్ యాదవ్‌పై 2,124 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి బ్రజేంద్ర సింగ్ యాదవ్ గెలవడంతో పార్టీ శ్రేణులు సంబురాల్లో మునిగితేలారు. గత ఎన్నికల్లో ఈ స్థానం నుంచి 20 వేలకు పైగా మెజార్టీ సాధించిన కాంగ్రెస్ ఈ ఉపఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో గట్టెక్కడం విశేషం. కాగా కొలారస్ స్థానం నుంచి కూడా కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. సమీప బీజేపీ అభ్యర్థి దేవేంద్ర జైన్‌పై 8 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి మహేంద్ర సింగ్ యాదవ్ గెలుపొందారు.

ఈజిప్టు రైలు ప్రమాదంలో 15 మంది మృతి

కైరో: ఈజిప్టులో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 15 మంది చనిపోగా మరో 40 మంది తీవ్రగాయాల పాలయ్యారు. ఉత్తర బెహిరా గవర్నరేట్ పరిధిలోఈ ఘటన జరిగింది. తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని దవాఖానలకు తరలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై విచారణ ప్రారంభమైంది. అతిదారుణమైన భద్రతా వ్యవస్థను కలిగివున్న ఈజిప్టులో గత ఏడాది ఏకంగా 1,249 ప్రమాదాలు జరగడం విశేషం.

ఆర్తులపాలిట ఆప్తుడు అష్రఫ్

- దుబాయ్‌లో చనిపోయిన విదేశీయుల మృతదేహాల తరలింపులో చేదోడు
- శ్రీదేవి పార్థివదేహం స్వదేశానికి వచ్చేందుకూ సహకారం
- ఇప్పటివరకు 38 దేశాలకు చెందిన 4700 మృతదేహాల తరలింపు
- దుబాయ్‌లో కేరళ సామాజిక కార్యకర్త దాతృత్వం ■ మెకానిక్ వృత్తి.. మానవసేవ ప్రవృత్తి



అజ్మన్ (యూఏఈ), ఫిబ్రవరి 28:

దుబాయ్ ఇసుక ఎడారుల్లో మానవత్వం ఇంకిపోలేదని నిరూపిస్తున్నారు ఓ భారత వాసి. ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందిస్తున్నారు. తెలియని మనిషి చనిపోతే కనీసం అటువైపు చూడకుండా మనకెందుకులే అని వెళ్లిపోతున్న ఈ రోజుల్లో మానవతా దృక్పథంతో వారి దరికి చేరుతున్నారు. ఆత్మీయులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కన్నీటిని తుడిచేందుకు తనవంతు సాయం చేస్తున్నారు. వృత్తి మెకానిక్ అయినా.. మానవసేవను ప్రవృత్తిగా మార్చుకొని ఎడారి దేశంలో ఎందరికో సాయపడుతున్నారు. బాలీవుడ్ నటి శ్రీదేవి మృతదేహాన్ని పువ్వుల్లో పెట్టి దుబాయ్ నుంచి భారత్‌కు తరలించేందుకు సాయం అందించారు సామాజిక కార్యకర్త అష్రఫ్ తామరసేరి(44). దుబాయ్‌లో నివసిస్తున్న కేరళ కోలికోడ్ జిల్లాకు చెందిన అష్రఫ్.. అజ్మన్ ప్రాంతంలో కుటుంబసభ్యులతో కలిసి జీవిస్తున్నారు.

చేతనైన సాయం

ఇతర దేశాల నుంచి వచ్చిన వారు దుబాయ్‌లో చనిపోతే వారి మృతదేహాలను స్వదేశాలకు తరలించేందుకు తామరసేరి సాయపడుతున్నారు. అధికారులతో మాట్లాడి బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 38 దేశాలకు చెందిన 4,700 మృతదేహాలను దుబాయ్ నుంచి వారి సొంతదేశాలకు పంపించేందుకు సాయం అందించారు. 'ఇది నా బాధ్యత. దుబాయ్ అధికారులకు మీరు లేదా నేను ఎవరైనా అంతా సమానమే. దవాఖాన బయట ఎవరైనా చనిపోతే, వారిని దవాఖానకు తరలిస్తారు. పోలీస్ మార్చురీ వద్ద అన్ని పరీక్షలు నిర్వహిస్తారు. మీరు పేదలా లేదా ధనికులా అన్నది ముఖ్యం కాదు' అని తామరసేరి మంగళవారం రాత్రి మీడియాకు చెప్పారు. శ్రీదేవి భౌతిక కాయం గురించి ప్రస్తావించగా, మంగళవారం బాలీవుడ్ నటి శ్రీదేవితో కలిపి మొత్తం ఐదు మృతదేహాలను స్వదేశాలకు పంపేందుకు సాయం చేశానని పేర్కొన్నారు. 'ఎవరైనా ఇక్కడ చనిపోతే.. వారిని స్వదేశాలకు ఎలా తీసుకెళ్లాలో చాలామందికి తెలియదు. ఆపదలో ఉన్నవారి ఆశీస్సులు పొందేందుకే ఈ పని చేస్తున్నా' అని ఆయన చెప్పారు.

'ఆమెది నిద్రపోతున్న దివ్యసుందరి అందం'

అతిలోకసుందరి శ్రీదేవిది నిద్రపోతున్న దివ్యసుందరి అందమని తామరసేరి అష్రఫ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి శ్రీదేవి మృతదేహాన్ని ప్రత్యక్షంగా చూసిన ఆయన.. 'ఆమె ప్రశాంతంగా నిద్రపోతున్నట్టు కనిపించారు. నిద్రపోతున్న దివ్యసుందరి అందం ఆమెది. సినిమాలు, ఫొటోల్లో నేను చూసిన బాలీవుడ్ నటి శ్రీదేవికి.. ప్రస్తుతం విగతజీవిగా మారిన ముఖానికి అంతగా తేడాలు లేవు. మీడియా పేర్కొన్నట్టు ఆమె తలపై ఎలాంటి గాయాలు లేవు' అని చెప్పారు. మార్చురీలో శ్రీదేవి మృతదేహం వద్ద తానూ ఉన్నానని పేర్కొన్నారు. 'తెల్లటి కాటన్ షీట్‌లో ఆమె భౌతికకాయాన్ని చుట్టిపెట్టారు. చెక్క శవపేటికలో ఆమెను తీసుకెళ్లారు. దాని విలువ దాదాపు రూ.32వేలు ఉంటుంది' అని చెప్పారు. చివరకు దుబాయ్ ఆరోగ్య శాఖ అధికారులు జారీచేసిన ఎంబామింగ్ ధ్రువపత్రంపై కూడా అష్రఫే సంతకం పెట్టారు.

ఆమె జ్ఞాపకాలు మర్చిపోలేని అత్తాపూర్‌వాసులు



'భక్త తుకారాం'లో బాలనటిగా శ్రీదేవి

బండ్లగూడ: అక్కినేని నాగేశ్వర్ రావు, అంజలీదేవి నటించిన 'భక్త తుకారాం' సినిమాలో వారి కూతురుగా శ్రీదేవి నటించింది. ఈసినిమా షూటింగ్ అత్తాపూర్ రాంబాగ్ శ్రీరామ చంద్రస్వామి దేవాలయం పరిసరాల్లో సుమారు నెల రోజుల పాటు కొనసాగింది. షూటింగ్ చూసేందుకు వచ్చి శ్రీదేవి ముద్దులొలికే మాటల్ని విని అక్కడివారు ముచ్చటపడేవారు. శ్రీదేవి మృతితో అత్తాపూర్‌వాసులు పలువురు అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆమె మృతి తమను ఎంతగానో కలచివేసిందని వారు విచారం వ్యక్తం చేశారు.

శ్రీదేవి మృతి విచారణపై భిన్నాభిప్రాయాలు

ముంబై: శ్రీదేవి మృతి విచారణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీదేవి మృతిపై విచారణ జరుపాల్సింది దుబాయ్ పోలీసులు కాదని, ఇక్కడి పోలీసులేనని కొందరు వాదిస్తున్నారు. శ్రీదేవి మృతి కేసు విచారణను మూసివేయడంపై వారు విభేదిస్తున్నారు. అయితే దుబాయ్ పోలీసుల విచారణ చేసిన తర్వాత భారత్ పోలీసులు విచారించాల్సిన అవసరలేదని మరికొందరు వాదిస్తున్నారు. 'శ్రీదేవి మృతిపై చాలా మందికి అనుమానాలున్నాయి. అందుకని భారత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) కింద విచారించి అనుమానాలు నివృత్తి చేయండి' అని ముంబై పోలీస్ కమిషనర్ దత్తాత్రేయ పడ్‌సాల్గికర్‌కు పంపిన ఈ మెయిల్‌లో 'ఎన్జీవో – జై హో ఫౌండేషన్'కు చెందిన న్యాయవాది ఆదిల్ ఖాత్రి విజ్ఞప్తిచేశారు. శ్రీదేవి మృతిని సుమోటోగా తీసుకుని విచారణ జరిపించాలని మరో న్యాయవాది బాలకృష్ణన్ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌కు రాసిన లేఖలో కోరారు. కాగా, శ్రీదేవి మృతి సహజంగా జరిగినందున విచారణ అవసరం లేదని మానవ హక్కుల ఉద్యమకారిణి అభా సింగ్ అంటున్నారు.

ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరం అరెస్ట్

- ఫెరా నిబంధనలు ఉల్లంఘించారని అభియోగం ■ ఎఫ్‌డీఐల అనుమతిలో రూ.10లక్షలు ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు
- చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న సీబీఐ ■ ఒక్కరోజు సీబీఐ కస్టడీకి పటియాలా కోర్టు అనుమతి

చెన్నై/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:

కేంద్ర మాజీ ఆర్థికమంత్రి పీ చిదంబరం కుమారుడు, వ్యాపారవేత్త కార్తీ చిదంబరం అరెస్టయ్యారు. ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారంలో ఫెరా నిబంధనలను ఉల్లంఘించారన్న ఆరోపణల నేపథ్యంలో సీబీఐ ఆయనను అరెస్టు చేసింది. బుధవారం ఉదయం లండన్ నుంచి చెన్నై చేరుకున్న కార్తీని ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి తరలించారు. వైద్యపరీక్షల అనంతరం సాయంత్రం పటియాలాహౌస్ కోర్టులో హాజరుపరిచారు. ఈమేరకు కార్తీకి రిమాండ్ విధించిన న్యాయమూర్తి, ఒక్కరోజు సీబీఐ కస్టడీకి అనుమతించారు.

2007లో చిదంబరం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో కార్తీ కేంద్ర ఆర్థికమంత్రిత్వశాఖలో తన అధికారాన్ని ఉపయోగించి.. ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు మారిషస్ నుంచి పెట్టుబడులకు అనుమతి లభించేలా చూశాడని, రూ.305 కోట్ల మేర విదేశీ పెట్టుబడులు ఆ సంస్థలోకి వచ్చేందుకు మార్గం సుగమం చేసి, రూ.10లక్షల వరకు ముడుపులు పొందారని అభియోగాలున్నాయి. వీటి ఆధారంగా గత ఏడాది మే15న సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. ఏడాదినుంచి సీబీఐ, ఈడీ కార్తి నివాసాలు, కార్యాలయాలపై పలుమార్లు దాడులు నిర్వహించాయి. ఆయన విదేశాలకు వెళ్లకుండా లుక్‌అవుట్ నోటీసును జారీ చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో కుమార్తె అడ్మిషన్ కోసం లండన్ వెళ్లేందుకు అనుమతించాలంటూ కార్తీ చేసిన అభ్యర్థనకు గత నవంబర్‌లో సుప్రీంకోర్టు అనుమతించింది. అయితే మనీలాండరింగ్ కేసులో విచారణకు సహకరించడం లేదని కార్తి దగ్గర చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న ఎస్ భాస్కరరామన్‌ను ఇటీవల ఈడీ అరెస్టు చేసింది.

15రోజుల కస్టడీకి అప్పగించాలని కోరిన సీబీఐ

కార్తీ చిదంబరాన్ని బుధవారం సాయంత్రం సీబీఐ అధికారులు పటియాలాహౌస్ కోర్టులో ప్రవేశపెట్టారు. అయితే న్యాయవాదులతో కార్తి చర్చించుకునేందుకు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సుమీత్ ఆనంద్ అనుమతించారు. పదినిమిషాలపాటు కోర్టు గదిలోనే వారు చర్చించారు. ఆరునెలలుగా కార్తీకి ఒక్కసారి కూడా సమన్లు జారీ చేయలేదని, ఇప్పుడే ఏకపక్షంగా అరెస్టు అంటున్నారని న్యాయవాది అభిషేక్ సింఘ్వి విచారణ సందర్భంగా కోర్టుకు తెలిపారు. ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారంలో కార్తీ దర్యాప్తునకు సహకరించడం లేదని సీబీఐ న్యాయస్థానానికి వివరించింది. చెస్ మేనేజ్‌మెంట్ సర్వీస్ సహకారంతో ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారమంతా నడిపించినట్లు విచారణ సందర్భంగా ఇంద్రాణి ముఖర్జియా చెప్పిన వివరాలను సీబీఐ కోర్టుముందుంచింది. కార్తీ సాధారణ నిందితుడు కాదని, మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయనను 15 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరింది. న్యాయస్థానం మాత్రం ఒక్కరోజు కస్టడీకి మాత్రమే అనుమతించింది. తమ కుటుంబాన్ని వేధించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, తన కుమారుడిని అరెస్టు చేస్తారని భావించిన చిదంబరం వారం రోజుల క్రితమే సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ, ఈడీ అక్రమంగా దర్యాప్తు చేస్తున్నారని, విచారణ పేరిట తమ కుటుంబాన్ని వేధిస్తున్నారని ఆయన అందులో పేర్కొన్నారు.

కార్తీ జైలుకెళ్లడం ఖాయం : సుబ్రమణ్యస్వామి

కార్తీ చిదంబరం జైలుకు వెళ్లడం ఖాయమని బీజేపీ నేత సుబ్రమణ్యస్వామి అన్నారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సీబీఐ కార్తీపై చార్జ్‌షీట్ దాఖలు చేస్తుందని, ఇదో గొప్ప విజయమని స్వామి తెలిపారు. కార్తీ వ్యవహారంలో ప్రభుత్వ జోక్యమేదీ లేదని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు.

ఇది ముమ్మాటికీ కక్షసాధింపే: కాంగ్రెస్

మనీలాండరింగ్ కేసులో కార్తీ చిదంబరంను సీబీఐ అరెస్టు చేయడం ముమ్మాటికీ కక్ష సాధింపేనని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. మోదీ సర్కార్ ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకుని సాగిస్తున్న కక్ష సాధింపు రాజకీయాలకు ఇది నిలువెత్తు నిదర్శనమని ధ్వజమెత్తింది. నీరవ్‌మోదీ, చోక్సీ, డీడీ జ్యువెలర్స్, రోటోమ్యాక్ ఇలా రోజుకొకటి బయటపడుతున్న కుంభకోణాల నుంచి దృష్టి మరల్చేందుకు మోదీ సర్కార్ సాగిస్తున్న కళాత్మక ప్రయత్నమే ఇదని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా, నేతలు కపిల్ సిబల్, అభిషేక్ సింఘ్వి విమర్శించారు. అయినా వాస్తవాలను ప్రజలముందుంచడంలో, మోదీ ప్రభుత్వ అవినీతిని బయటపెట్టడంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గబోదని అన్నారు.'గత పదిరోజుల వ్యవధిలోనే 30వేల కోట్ల కుంభకోణం బయటపడింది. అయినా 'ఇది పూర్తిగా కక్షసాధింపు రాజకీయం. చిన్న మోదీ (నీరవ్ మోదీ)' విషయంలో ప్రధాని మోదీ పెదవి విప్పలేదు. ఇవి ద్వంద్వ ప్రమాణాలు కావా? ' అని సిబల్ ప్రశ్నించారు.



ఢిల్లీలోని పటియాలాహౌస్ కోర్టు వద్ద కార్తి చిదంబరం

అభివృద్ధిలో దూసుకుపోతున్న తెలంగాణ

■ సీఎం కేసీఆర్ కృషిని అన్నిరాష్ట్రాలూ ఆదర్శంగా తీసుకోవాలి
■ రైతు పెట్టుబడి పథకం దేశంలోనే ప్రథమం
■ ఐకార్ వార్షికోత్సవంలో కేంద్రమంత్రి రాధామోహన్‌సింగ్ ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయరంగంలో అనేక పథకాలను అమలుచేస్తూ కొత్తరాష్ట్రం తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతున్నదని కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి రాధామోహన్ సింగ్ ప్రశంసించారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐకార్) 89వ వార్షిక సమావేశంలో రాధామోహన్‌సింగ్ తెలంగాణ ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సంక్షేమం కోసం చేస్తున్న కృషి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శమని పేర్కొన్నారు. రైతులకు ముందస్తు పెట్టుబడిగా ఎకరాకు రూ.4వేలు ఇవ్వడం దేశంలోనే ప్రథమమని ప్రశంసించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంచడానికి కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సహజపంటలతోపాటు వాణిజ్యపంటలైన మిర్చి, పసుపుకు మద్దతు ధరను ప్రకటించాలని కోరారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతు యూనిట్‌గా మార్పుచేయాలని సూచించారు. ఉపాధి హామీపథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలని అన్నారు.

ఉద్యానవర్సిటీకి 100 కోట్లు ఇవ్వాలి

రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమపథకాలకు కేంద్రం సహకారం అందించాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌కు రాష్ట్రమంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర మంత్రితో సమావేశమైన పోచారం నూతనంగా ఏర్పాటైన జిల్లాల్లో కృషి విజ్ఞానకేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మరో లక్ష క్వింటాళ్ల కందుల కొనుగోలుకు అనుమతివ్వాలని అన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయానికి రూ.100 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2,630 క్లస్టర్లను ఏర్పాటుచేశామని, ప్రతి క్లస్టర్‌లో రైతు సమావేశ మందిరాలను నిర్మించడానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.



ఢిల్లీలో కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాష్ట్ర మంత్రి పోచారం

మీ విద్యుత్ ప్రాజెక్టులు దేశానికే ఆదర్శం

■ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతో పీఎఫ్సీ చైర్మన్ రాజీవ్‌శర్మ
■ 10 వేల మెగావాట్లు దాటిన విద్యుత్ డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం తెలంగాణలో చాలా వేగంగా జరుగుతున్నదని, ఈ విధానం దేశానికి ఆదర్శమని విద్యుత్ ఆర్థిక కన్సల్టెన్సీ (పీఎఫ్సీ) చైర్మన్ రాజీవ్‌శర్మ అన్నారు. సీఎం కేసీఆర్, జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు కృషితో విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. రాజీవ్‌శర్మతోపాటు పీఎఫ్సీ అధికారులు బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని కలిశారు. అనంతరం విద్యుత్‌సౌధలో జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతోనూ సమావేశమయ్యారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్‌ప్లాంట్ల నిర్మాణాలపై ప్రభాకర్‌రావుతో సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ పవర్ ప్లాంట్లు, ఇతర నిర్మాణాలకు ఆర్థిక చేయూత అందించిన తాము తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకూ అవసరమైన విద్యుత్ ప్లాంట్ల నిర్మాణాలకూ నిధులిస్తామని రాజీవ్‌శర్మ హామీ ఇచ్చారు.

10,100 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్

తెలంగాణలో విద్యుత్ వినియోగం 10వేల మెగావాట్ల మైలురాయిని దాటింది. బుధవారం ఉదయం 10,100 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఈ విషయాన్ని పీఎఫ్సీ చైర్మన్ రాజీవ్‌శర్మ, ఇతర అధికారులు గుర్తించారు. ఇంత డిమాండ్ ఏర్పడినా ఎక్కడా ఒక్క నిమిషం కోత విధించకుండా విద్యుత్ సరఫరా చేయడం ప్రశంసనీయమని వారు కొనియాడారు. వ్యవసాయానికి 24 గంటల నిరంతర కరెంట్ ఇవ్వడం అసాధారణ విషయమన్నారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు, పీఎఫ్సీ డైరెక్టర్ గంగోపాధ్యాయ, ఈడీలు పీకే సింగ్, కేవీవీ సత్యనారాయణ, జీఎం రాజేశ్‌షా తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో పీఎఫ్సీ చైర్మన్ రాజీవ్‌శర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

150 సేవలతో టీయాప్ ఫోలియో

- ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్
- ప్రస్తుతం 150 సేవలు వచ్చే ఏడాదిలో వెయ్యికిపైగా..
- ఎం-గవర్నెన్స్‌లో దేశంలోనే రెండో స్థానం
- మీసేవా ఆపరేటర్లకు నష్టం రాకుండా చూస్తామని హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణలోని ప్రజానీకానికి పరిపాలనను మరింత చేరువ చేసేదిశగా ఎం-గవర్నెన్స్‌లో కీలకమైన ముందడుగు వేశామని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు తెలిపారు. 150 సేవలను ఒకే యాప్ ద్వారా అందించే టీయాప్ ఫోలియో ప్రజలకు సర్కారు సేవలను ముంజేతికి అందిస్తుందని అన్నారు. దేశంలో ఇలాంటి సేవలు అందిస్తున్న రెండోరాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాదిలోగా ఈ ఫోలియో ద్వారా వెయ్యికిపైగా సేవలు అందిస్తామని వివరించారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటైన ఓ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ టీయాప్ ఫోలియోను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యుడి జీవితంలో మార్పు తెచ్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తపిస్తుంటారని, ఇందులో భాగంగానే ప్రస్తుతం అధికసంఖ్యలో ప్రజలు ఉపయోగిస్తున్న మొబైల్ ఫోన్ ద్వారా అత్యధిక పౌరసేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇంటింటికీ సురక్షితమైన తాగునీటితో ఇంటర్నెట్ సౌకర్యాన్ని జోడించడం, 86 ఏండ్లలో ఎవరూ చేయని భూరికార్డుల ప్రక్షాళన చేపట్టడం సీఎం కేసీఆర్ విశిష్టమైన ఆలోచనాధోరణికి నిదర్శనాలన్నారు. ఇప్పుడు ఎం-గవర్నెన్స్ ద్వారా పౌరసేవలు అందించడం మరో ముందంజ అన్నారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫాంలపై, తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు వివరించారు. ప్రస్తుతం అందిస్తున్న 150 సేవలను 1000 సేవలకు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్ అందించేందుకు వేగంగా ముందుకు సాగుతున్నామని, ఇది దేశంలో తెలంగాణ ఖ్యాతిని మరింత ఇనుమడిస్తుందని మంత్రి కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

మీసేవా ఆపరేటర్ల ఉపాధిని దెబ్బతీయం

ఎం-గవర్నెన్స్ రూపంలో ప్రజలకు పౌరసేవలు మరింతగా చేరువ చేసేందుకు తెచ్చిన టీయాప్ ఫోలియో ద్వారా మీసేవా ఆపరేటర్ల భృతిని దెబ్బతీయబోమని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శిరాజేశ్వర్ తివారి మాట్లాడుతూ టెక్నాలజీని అత్యుత్తమంగా ఉపయోగించుకుంటూ 86 ఏండ్ల తర్వాత భూరికార్డుల ప్రక్షాళనకు సీఎం కేసీఆర్ సిద్ధమయ్యారని చెప్పారు. సామాన్యులకు మెరుగైన సేవలు అందించాలని సీఎం కేసీఆర్ తరచుగా చెప్తుంటారని పేర్కొన్నారు. ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ మొబైల్ ఆధారిత పౌరసేవలు ప్రజలకు అందుబాటులోకి తేవాలని మూడేండ్ల క్రితమే సీఎం కేసీఆర్ తమకు చెప్పారని వెల్లడించారు. మీసేవా కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ మీసేవా 2.0 పేరుతో ఏడాదిన్నరగా నూతన సేవల పనితీరును అధ్యయనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. సానుకూలఫలితాలు రావడంతో టీయాప్ ఫోలియోలో సేవలు అందుబాటులోకి తెస్తున్నట్టు వెల్లడించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, టెక్నాలజీ ఆధారంగా శాంతిభద్రతలు అందించేందుకు ఐటీశాఖ విశేష సహాయం అందించిందని తెలిపారు. పౌరసరఫరాల విభాగంలో టెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తున్నామని కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఈ గవర్నెన్స్ సంయుక్త కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్, టీఎస్‌టీఎస్ చైర్మన్ రాకేశ్, తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ దిలీప్ కొణతం, టీశాట్ సీఈవో ఆర్ శైలేశ్‌రెడ్డి, ఐఎంఐ మొబైల్స్ సంస్థ సీటీవో ఎస్సెస్ భట్, అధికారులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో టీయాప్ ఫోలియోను ఆవిష్కరిస్తున్న ఐటీ, పురపాలకశాఖల మంత్రి కే తారకరామారావు, ఎంపీ బూరనర్సయ్యగౌడ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్ తివారి, డీజీపీ మహేందర్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు



అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు ప్రొవిజినల్ జాబితా విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో పలు రకాల స్పెషాలిటీ విభాగాలకు సంబంధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులకు (నోటిఫికేషన్ నెంబరు-49/2017) తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఆరుగురు అభ్యర్థులను ఎంపిక చేసి ప్రొవిజినల్ జాబితాను విడుదల చేసింది. సూపర్ స్పెషాలిటీ డిపార్టుమెంటులోని పలు విభాగాలకు బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం ఆరుగురు అభ్యర్థులతో కూడిన ప్రొవిజినల్ జాబితాను రూపొందించింది. న్యూరో సర్జరీ-2, యూరాలజీ-2, ప్లాస్టిక్ సర్జరీ-1, ఎండోక్రైనాలజీ-1 చొప్పున రూపొందించిన జాబితాను పబ్లిక్ సర్వీసు కమిషన్ www.tspsc.gov.inలో అందుబాటులో ఉంచింది.

నాలుగోరోజు టీఆర్టీ ప్రశాంతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్టీ పరీక్ష నాలుగోరోజు విజయవంతంగా పూర్తయినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ బుధవారం తెలిపారు. ఉదయం సెషన్‌లో పీఈటీ (తెలుగు, ఉర్దూ, మరాఠీ, కన్నడ, హిందీ మాధ్యమాలు), మధ్యాహ్నం సెషన్‌లో స్కూల్ అసిస్టెంట్ (హిందీ, కన్నడ, తమిళ్, ఉర్దూ) లాంగ్వేజ్ పరీక్షలు నిర్వహించినట్టు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో 88 శాతం, మధ్యాహ్నం సెషన్‌లో 83.4 శాతం హాజరు నమోదైనట్టు పేర్కొన్నారు. గురువారం ఉదయం సెషన్‌లో ఎస్జీటీ (బెంగాళీ, హిందీ, కన్నడ, మరాఠీ, ఉర్దూ, తమిళ మీడియం), మధ్యాహ్నం సెషన్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

రంగస్థల కళాకారులకు ప్రమాదబీమా!

■ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగస్థల కళాకారులకు ప్రమాద బీమా కల్పించేందుకు ప్రయత్నిస్తానని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి తెలిపారు. రాష్ట్రంలో నాటకకళను నమ్ముకొని జీవిస్తున్న కళాకారులు రెండువేల మంది వరకు ఉన్నారని చెప్పారు. బుధవారం తెలంగాణ నాటక సమాజాల అడ్‌హాక్ కమిటీ సమావేశం.. ఆ కమిటీ అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే వీ రమణాచారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి కళాకారుడికి ప్రమాదబీమా కల్పించేందుకు ప్రతి ఏటా రూ. వంద కన్నా ఎక్కువగా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదని రమణాచారి అన్నారు. నాటకాలను ఆదరించేవారి సహకారంతో కళాకారులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించేలా ప్రయత్నిస్తానని స్పష్టం చేశారు. సాంస్కృతికశాఖ జారీచేస్తున్న గుర్తింపుకార్డులను ప్రతి కళాకారుడు తీసుకోవాలని కోరారు. గుర్తింపు పొందిన కళాకారుడికి ప్రమాదబీమా వర్తించేలా కృషిచేస్తానని తెలిపారు.



టాస్క్ కార్యాలయంలో నియామకపత్రాలు పొందిన విద్యార్థులు

టాస్క్ శిక్షణతో వెల్లువలా ఉద్యోగాలు

■ కొత్త రంగాల్లో కొలువులపై విద్యార్థుల హర్షం
■ హైసియాతో కలిసి ఇచ్చిన శిక్షణ ఫలవంతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న తమకు కార్పొరేట్ సంస్థల్లో పనితీరుపై అవగాహన కల్పించడమే కాకుండా ఉద్యోగాలు కూడా కల్పించిన టాస్క్‌కు పలువురు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. మేకర్ పేస్ ప్రోగ్రామ్ పేరుతో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన పలువురు అభ్యర్థులకు బుధవారం టాస్క్ కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. ఖమ్మం, మేడ్చల్, రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఇంజినీరింగ్ కాలేజీల్లో మేకర్‌స్పేస్ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులకు నైపుణ్యాలను పరీక్షించి మూడుదశలుగా శిక్షణ ఇచ్చారు. కార్పొరేట్ సంస్థలకు చెందిన నిపుణులతో పాటుగా, టాస్క్ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించిన పలుసంస్థలు విద్యార్థులను ఉద్యోగంలోకి తీసుకున్నాయి. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ అసోసియేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో టాస్క్ ఈ శిక్షణను నిర్వహించింది. టాస్క్ సీఈవో సుజీవ్ నాయర్, హైసియా అధ్యక్షుడు రంగా పోతుల ఆయా సంస్థల్లో ఎన్నికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేశారు. కాగా ఎంపికైన అభ్యర్థులు సలోని తివారీ, పృథ్వీమోహన్, హరికృష్ణన్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న సమయంలో తమకు రాబోయే కాలంలో ఉద్యోగాలు కల్పించే సంస్థలపై అవగాహన కల్పించడం, కెరీర్ శిక్షణ ఇవ్వడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. అంతేకాకుండా తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉద్యోగాలు ఇవ్వడం తమలోని ఉత్సాహాన్ని మరింత పెంచిందని చెప్పారు. ఖమ్మంలో ఉన్న తనకు హైదరాబాద్ వచ్చే ఇబ్బంది కూడా లేకుండా స్కైప్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించడం, సలహాలు ఇవ్వడంపై పృథ్వీమోహన్ హర్షం వెలిబుచ్చాడు.

టీజీబీ స్కామ్‌లో కొత్త పేర్లు

■ దర్యాప్తు ముమ్మరం చేసిన సీబీఐ
■ ఒకటి రెండు రోజుల్లో మరికొందరి అరెస్టు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రంగారెడ్డి జిల్లాలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు అజీజ్‌నగర్ బ్రాంచిలో నిధుల కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఒకటి రెండు రోజుల్లో నిందితుల జాబితాను ఖరారు చేసి ఒకటి రెండు రోజుల్లో మరి కొందరిని అరెస్టు చేసే అవకాశం ఉంది. మూడు బృందాలుగా ఏర్పడిన సీబీఐ అధికారులు స్కాంలోని అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. డాక్యుమెంట్లను పరిశీలిస్తున్నారు. ఈ స్కాంకు సంబంధించి ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న వ్యక్తులతో పాటు మరికొన్ని కొత్త పేర్లు కూడా బయటకువచ్చాయని వారిని సీబీఐ అధికారులు బుధవారం ప్రశ్నించారని తెలిసింది. 2010-2018 మధ్య కాలంలో బ్యాంకులో పనిచేసిన అధికారులు, సిబ్బందిని విచారిస్తున్నారు. ప్రస్తుతం సీబీఐ 14 మందిని విచారిస్తున్నట్టు సమాచారం. అజీజ్‌నగర్ బ్రాంచిలో 2010 - 2018 మధ్యకాలంలో రూ. 8.94 కోట్ల నిధుల గోల్‌మాల్ జరిగింది. ఈ విషయమై గత వారం బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎం రవీందర్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, సీబీఐ పది మందిపై కేసు నమోదు చేసిన సీబీఐ దర్యాప్తు చేపట్టింది. ఈ పది మందిలో ఐదుగురు మేనేజర్‌స్థాయి అధికారులు, సిబ్బంది ఉన్నారు. వారుగాకుండా ఇప్పుడు మరో నలుగురు బ్యాంకు ఉద్యోగులను కూడా విచారిస్తున్నట్లు తెలిసింది.

హౌసింగ్ సొసైటీలకు భూ కేటాయింపులపై చర్చ

■ తెలంగాణ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ శాసనసభా సంఘం భేటీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హౌసింగ్ సొసైటీలకు గతంలో జరిగిన భూ కేటాయింపుల సమయంలో నిబంధనలు పాటించారా? ఏమైనా ఉల్లంఘనలు జరిగాయా? అన్న అంశాలను పరిశీలించేందుకు ఏర్పాటైన తెలంగాణ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ శాసనసభా సంఘం బుధవారం సమావేశమైంది. కమిటీ చైర్మన్ ఆరూరి రమేశ్ అధ్యక్షతన అసెంబ్లీ కమిటీహాల్‌లో సభా సంఘం భేటీ అయింది. హైదరాబాద్‌లోని ఫిలింనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, నందగిరి హిల్స్ హౌసింగ్ సొసైటీలకు సంబంధించిన అంశాలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై కమిటీ చర్చించింది. త్వరలోనే మరోసారి సమావేశం కావాలని నిర్ణయించింది. కమిటీ సభ్యులు కర్నె ప్రభాకర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గువ్వల బాలరాజు, మాగంటి గోపీనాథ్, రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ వీరబ్రహ్మయ్య, హైదరాబాద్ కలెక్టర్ యోగితారాణ, జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ దేవేందర్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వేదాంతం నరసింహాచార్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నేడు శృంగేరీ పీఠాధిపతి రాక

■ ప్రభుత్వం తరపున స్వాగతం పలుకనున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శృంగేరీ పీఠాధిపతి శ్రీ విధుశేఖరస్వామి గురువారం రాష్ట్రానికి రానున్నారు. సాయంత్రానికి జోగుళాంబ గద్వాల జిల్లాలోని కర్ణాటక- తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో ఉన్న నందిన్నె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ ఆయనకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వాగతం పలుకనున్నారు. ప్రభుత్వ లాంఛనాలతో రాష్ట్రంలోకి ఆహ్వానిస్తారు. వేదపండితులు పూర్ణకుంభం, వేదసూక్తులతో పీఠాధిపతిని తోడ్కొని గద్వాలకు చేరుకుంటారు.



చెన్నైలో తమిళ నాడు సీఎం పళనిస్వామి నుంచి అవార్డు అందుకుంటున్న అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) అంజనీకుమార్

టీఎస్ కాప్ యాప్‌నకు ఎన్సీఆర్బీ అవార్డు

■ తమిళనాడు సీఎం నుంచి అవార్డు స్వీకరించిన అంజనీకుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎస్ కాప్ మొబైల్ యాప్‌నకు జాతీయస్థాయిలో ప్రశంసలు వస్తున్నాయి. ఈ యాప్‌నకు నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) బెస్ట్ ఐటీ ప్రాజెక్టు 'ఎంపవరింగ్ పోలీస్ విత్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' అవార్డు వచ్చింది. దీనిని బుధవారం చెన్నైలో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు కార్యక్రమంలో తమిళనాడు సీఎం పళనిస్వామి అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) అంజనీకుమార్‌కు అందజేశారు. తెలంగాణ డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి తరపున అంజనీకుమార్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు డీజీపీ టీకే రాజేంద్రన్, రాష్ట్ర ఐఎస్‌డబ్ల్యూ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ ఇచ్చి రిజిస్ట్రేషన్ బాధ్యతలు అప్పగించండి

■ సీఎస్ జోషికి తెలంగాణ తహసీల్దార్ల సంఘం వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తహసీల్దార్లకు రిజిస్ట్రేషన్లపై అవగాహన కలిగేలా శిక్షణ ఇచ్చి, అవసరమైన సిబ్బందిని ఇచ్చాకే రిజిస్ట్రేషన్ల బాధ్యతలు అప్పగించాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి, అధ్యక్షుడు కే గౌతంకుమార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి వినతిపత్రం అందజేశారు. రూరల్ మండలాల్లో మౌలిక సదుపాయాలతోపాటు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నిర్వహించడానికి కావాల్సిన స్టాఫ్‌ను ఏర్పాటుచేయాలని వారు విన్నవించారు. ముందుగా రెండుమూడు రూరల్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద అమలుచేసి.. ఆపై రాష్ట్రమంతటా తీసుకొస్తే బాగుంటుందని విజ్ఞప్తిచేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

■ తొలిరోజు 4.61 లక్షల మంది విద్యార్థులు హాజరు
■ రేపు యథావిధిగా సెకండియర్ పరీక్ష



హైదరాబాద్ శ్రీనగర్‌కాలనీలోని కాకతీయ అకాడమీ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు 4,82,360 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,61,516 మంది విద్యార్థులు హాజరయ్యారు. 4.32 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదని బోర్డు కార్యదర్శి ఏ అశోక్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. వికారాబాద్‌లో 1, కరీంనగర్‌లో 1, సూర్యాపేటలో 1 చొప్పున మొత్తం మూడు మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. ముందుగా బోర్డు విడుదల చేసిన టైంటేబుల్ ప్రకారమే ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్నామని, ఈ నెల 2న (శుక్రవారం) యథావిధిగా ఇంటర్ సెకండియర్ పరీక్ష కొనసాగుతుందని స్పష్టంచేశారు. హోలీ పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని, దీంతో పరీక్ష వాయిదా వేస్తున్నారని వచ్చిన వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని తెలిపారు. కాగా మేడ్చల్ జిల్లా బొల్లారంలోని ఐఆర్‌ఎంజీ జూనియర్ కాలేజీకి చెందిన 20 మంది విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వలేదని, వారంతా తొలిరోజు పరీక్షలకు హాజరుకాలేక పోయారని వార్తలు వచ్చాయి. యాజమాన్యం పరీక్ష ఫీజులు వసూలు చేసినా ఇంటర్ బోర్డుకు చెల్లించలేదని, దీంతో హాల్‌టిక్కెట్లు తయారు కాలేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలపై డిప్యూటీ సీఎం కడియం సమీక్ష



ఇంటర్, ఎస్సెస్సీ పరీక్షలకు మొబైల్ ఫోన్లను అనుమతించొద్దని, ఈ మేరకు క్షేత్రస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి జిల్లా విద్యాధికారులను ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై బుధవారం సచివాలయంలో ఏర్పాటుచేసిన వీడియోకాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం కడియం పాల్గొన్నారు. రాష్ట్రంలో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహిస్తున్నారనే పేరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి ఏ అశోక్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కిషన్, జిల్లా కలెక్టర్, ఎస్పీలు, జిల్లా విద్యాధికారులు, పోలీసు అధికారులు వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



నాంపల్లి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ స్వామిగౌడ్. చిత్రంలో ఎంపీ కే కేశవరావు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు, పత్రిక, న్యూస్‌చానల్ ఎడిటర్లు కే శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి ,బుద్ధవనం స్పెషలాఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, జర్నలిస్ట్ యూనియన్ నేతలు పల్లె రవి తదితరులు ఉన్నారు.

సంక్షేమ నిధి.. పాత్రికేయుల పెన్నిధి

■ 74 మంది జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కుల పంపిణీలో మండలి చైర్మన్ స్వామిగౌడ్
■ తెలంగాణ పథకాలు ప్రశంసనీయం: కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో జర్నలిస్టుల కోసం రూ.100 కోట్ల మూలధనంతో సీఎం కేసీఆర్ ఏర్పాటుచేసిన సంక్షేమ నిధి పాత్రికేయులకు పెన్నిధి అని మండలి చైర్మన్ స్వామిగౌడ్ చెప్పారు. ఇప్పటికే రూ.50 కోట్లు సంక్షేమ నిధి ఖాతాల్లో జమ చేశారన్నారు. వివిధ కారణాలతో మృతిచెందిన, అనారోగ్యం, ప్రమాదాల బారినపడిన 74 మంది జర్నలిస్టుల కుటుంబాలకు రూ.65.50 లక్షల విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నాంపల్లి తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ మండల స్థాయి విలేకరులకు వేతనాలు ఇచ్చే విషయంలో యజమాన్యాలు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు మాట్లాడుతూ జర్నలిస్టు పింఛన్ స్కీంపై అంతా కలిసి చర్చించాలని, దీనికి యజమాన్యాలను సైతం ఆహ్వానించాలని అన్నారు. జర్నలిస్టులకు బీమా ప్రీమియం కింద రూ.7 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు గత ఏడాది ఫిబ్రవరి 17న సీఎం కేసీఆర్ ఆర్థిక సాయం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. 135 మంది జర్నలిస్టుల కుటుంబాలకు సంక్షేమనిధి నుంచి రూ.1.18 కోట్లసాయం, ట్యూషన్ ఫీజుల రూపంలో అందించామన్నారు.

తెలంగాణ పథకాలు ఆదర్శనీయం: సిద్ధరాజు

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఆదర్శనీయమని కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్ధరాజు ప్రశంసించారు. రెండురోజుల పర్యటనలో ఇప్పటికే మిషన్ భగీరథతోపాటు పలు పథకాలను పరిశీలించామని, జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చాలా గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో బుద్ధవనం స్పెషలాఫీసర్ మల్లెపల్లి లక్ష్మయ్య, తెలంగాణ టుడే ఎడిటర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, టీ న్యూస్ సీఈవో నారాయణరెడ్డి, టీయూడబ్ల్యూజే నాయకులు పల్లె రవికుమార్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన టీయూడబ్ల్యూజే నాయకులు పాల్గొన్నారు.



జర్నలిస్టు కుటుంబానికి ఆర్థికసాయం చెక్కును అందజేస్తున్న స్వామిగౌడ్, అల్లం నారాయణ

నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 1 మార్చి 2018
WWW. NTNEWS.COM



అయినా ధైర్యంగా అడవిలో..

ఒకవైపు క్రూరమృగాలు, మరోవైపు అడవి దొంగలు.. పగలు, రాత్రి తేడాలేకుండా ఉద్యోగం చేయాలి. మగవాళ్లు కూడా రిస్క్‌గా భావించే ఆ ఉద్యోగంలో వీళ్లు ధైర్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కేరళలోని మరయూర్ అటవీ ప్రాంతం దాదాపు 600 హెక్టార్లు ఉంటుంది. ఈ అడవిలో ఎంతో విలువైన చందనం చెట్లు ఉన్నాయి. ఇక్కడ మనుషులపై దాడి చేసే క్రూరమృగాలు, చందనపు చెట్ల కోసం ఎదురుదాడి చేసే దొంగలూ ఉన్నారు. అలాంటి ఈ అటవీప్రాంతంలో ఎలాంటి భయం లేకుండా బీట్ ఫారెస్ట్ ఆఫీసర్లు (బీఎఫ్ఓ)గా ఈ ఇద్దరు మహిళలు విధులు నిర్వర్తిస్తున్నారు. కేరళకు చెందిన అతిర పి.విజయన్, పీఎస్ శ్రీదేవీ మొదటి మహిళా బీట్ ఫారెస్ట్ అధికారులుగా నియమితులయి ఇక్కడ ఉద్యోగం చేస్తున్నారు. అతిర, శ్రీదేవి ఇద్దరిదీ ఇంజినీరింగ్ బ్యాగ్రౌండ్. కడుకత్తర డివిజన్‌లోని నచివాయల్ ఫారెస్ట్ స్టేషన్‌లో మగవాళ్లకు కూడా కష్టతరమైన ఫారెస్ట్ ఉద్యోగంలో వీళ్లు పగలు, రాత్రి తేడా లేకుండా ఉద్యోగం చేస్తున్నారు. 'జీవితంలో సవాళ్లను అధిగమించకపోతే ఎలా' అని చెబుతున్నారీ నారీమణులు.


మొబైల్ క్యాంటీన్‌లపై అన్నపూర్ణలు..

కర్ణాటకలో సవి రుచి మొబైల్ క్యాంటీన్‌లు ప్రారంభించారు. మహిళలకు ఉపాధి కల్పిస్తూ సాధికారత సాధించడమే కాదు.. ఇంకా చాలా చేస్తున్నారు. అదేంటంటే..

ఒక్కో మొబైల్ క్యాంటీన్ కోసం పదిహేను మంది మహిళలు పనిచేస్తారు. ఇది స్త్రీ శక్తి గ్రూప్స్ ఆధ్వర్యంలో నడుస్తాయి. ఈ మొబైల్ క్యాంటీన్ల ద్వారా కర్ణాటకలోని 30 జిల్లాల్లో ఉదయం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం పెట్టనున్నారు. 'సవి రుచి సంచారి మొబైల్ క్యాంటీన్ పథకాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈపథకంలో భాగంగా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ మహిళ సంక్షేమ శాఖ ఒక్కో వాహనానికి పది లక్షల రూపాయలు అందించారు. ఈ రుణాలకు వడ్డీ ఉండదు. ఈ పథకం మహిళల్లో సాధికారత పెంచడం కోసం దోహదపడుతుంది. ముందు జిల్లా హెడ్ క్వార్టర్స్‌ల్లో ప్రారంభించారు. వీటికి వచ్చే స్పందనను బట్టి మరింత విస్తరించేందుకు ప్రణాళికలు చేశారు.



జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi



శివరాత్రికే 'శివ..శివ' అంటూ చల్లి వెళ్లిపోయింది..
అప్పడే భానుడు ప్రకోపంతో ఊగిపోతున్నాడు..
చెమటలు కక్కే ఎండలో.. గొంతులోకి చల్లగా ఏమైనా వెళితే.. అబ్బా..
తలుచుకుంటేనే మనసు పులకరిస్తున్నది కదా! మీ మనసు తెలుసు కాబట్టే చల్లటి పానీయాలు తీసుకొచ్చాం..
అలసిన మిమ్మల్ని చల్లబరిచేందుకే ఈ కూల్ కూల్ డ్రింక్స్..

రండా రండా.. కూల్ కూల్!



స్ట్రాబెర్రీ అనార్ జ్యూస్

కావాల్సినవి :

స్ట్రాబెర్రీలు : 5, **దానిమ్మ :** 1,
చక్కెర : 2 టీస్పూన్స్, **పాలు :** ఒక లీటరు

తయారీ :

స్ట్రాబెర్రీ మిక్సీలో వేసుకొని తగినన్ని పాలు, చక్కెర వేసి మిక్సీ పట్టాలి. మరో మిక్సీజార్‌లో కొన్ని దానిమ్మ గింజలు వేసి మిక్సీ ఆడించాలి. ఆ తర్వాత గ్లాసులోకి ముందుగా స్ట్రాబెరీ జ్యూస్, ఆ పైన దానిమ్మ జ్యూస్ పోసుకోవాలి. పైనుంచి దానిమ్మ గింజలతో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవచ్చు. కావాలనుకుంటే రెండింటినీ ఫ్రిడ్జ్‌లో పెట్టి చల్లబడిన తర్వాత సర్వ్ చేసుకోవచ్చు.



పైనాపిల్ మలుద

కావాల్సినవి :

పైనాపిల్ : 1
పుదీనా : ఒక కట్ట
సబ్జా గింజలు : ఒక టీస్పూన్
చక్కెర : 2 టీస్పూన్స్
పాలు : ఒక లీటరు

తయారీ :

సబ్జా గింజలను గంటసేపు నానబెట్టాలి. పుదీనా కడిగి మెత్తటి పేస్ట్ చేసి పక్కన పెట్టాలి. పైనాపిల్ చెక్కు తీసి ముక్కలుగా కట్ చేసుకోవాలి. వీటిని మిక్సీలో వేయాలి. దీంట్లోనే చక్కెర, పాలు పోసి మిక్సీ పట్టాలి. ఆ తర్వాత ఇందులోనే మిక్సీ పట్టిన పుదీనా వేసి మరొకసారి గ్రైండ్ చేయాలి. ఇప్పుడు గ్లాసులోకి ఈ జ్యూస్ పోసి పై నుంచి సబ్జా గింజలు వేసి అందించొచ్చు. రుచికరమైన పైనాపిల్ మలుదా మీ ముందుంటుంది.



చాకో మిల్క్ షేక్

కావాల్సినవి :

చాకో సిరప్ : 40 మి.లీ.
పాలు : అర లీటరు
చక్కెర : ఒక టీస్పూన్

తయారీ :

మిక్సీలో చాకో సిరప్, పాలు, చక్కెర వేసి మిక్సీ పట్టాలి. ఇలా మిక్సీ పట్టిన మిశ్రమాన్ని ఒక అరగంట పాటు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఆ తర్వాత చల్లగా అందిస్తే ఆ టేస్టే వేరు. ఒకవేళ మీకు చిక్కని షేక్ కావాలనుకుంటే పాలు ఎక్కువ కలుపుకోవచ్చు.



జి.యాదగిరి
కార్పొరేట్ చెఫ్
వివాహభోజనంబు రెస్టారెంట్
జూబ్లీహిల్స్, హైదరాబాద్
పార్క్‌లైన్, సికింద్రాబాద్



కీరా బటర్ మిల్క్

కావాల్సినవి :

కీరా : 1
పెరుగు : 200 గ్రా.
ఉప్పు : తగినంత

తయారీ :

కీరాను చెక్కు తీసి చిన్నచిన్న ముక్కలుగా కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో పెరుగు, ఉప్పు వేసి గిలక్కొట్టాలి. ఇందులో చల్లని నీళ్లు పోసి కలుపుకోవాలి. ఆ తర్వాత కీరా ముక్కలు వేసి గ్లాసుల్లో పోసి చల్లగా సర్వ్ చేయాలి. ఈ మజ్జిగ చిక్కగా కాకుండా పలుచగా ఉండేట్లు చేసుకోవాల్సి ఉంటుంది.



మింట్ ఫలుద

కావాల్సినవి :

పుదీనా : ఒక కట్ట
సబ్జా గింజలు : ఒక టీస్పూన్
నిమ్మకాయ : 1
చక్కెర : 100 గ్రా.

తయారీ :

సబ్జా గింజలను గంటపాటు నానబెట్టి ఉంచుకోవాలి. పుదీనా బాగా కడిగి మెత్తగా పేస్ట్ చేసుకోవాలి. ఇప్పుడు ఒక గిన్నెలో ఈ పుదీనా పేస్ట్ వేయాలి. దీంట్లో చక్కెర, నిమ్మరసం, చల్లని నీళ్లు పోసి బాగా కలుపుకోవాలి. పైన సబ్జా గింజలు వేసుకొని చల్లగా సర్వ్ చేసుకోవాలి.

ట్యూమర్ అంటే కష్టమేనా?





డాక్టర్ టీవీఆర్‌కే మూర్తి
కన్సల్టెంట్ న్యూరోసర్జన్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్

మా నాన్నగారి వయసు 53 సంవత్సరాలు. గత 3 నెలల నుంచి తలనొప్పి, మాట్లాడడంలో ఇబ్బంది, కొద్దిగా వినికిడి సరిగ్గా లేకపోవడం అప్పడపుడు వాంతులు అవుతుంటే డాక్టర్‌ను సంప్రదించాం. వారి సలహా మేరకు ఎంఆర్ఐ స్కాన్ చేయించాం. మెదడులో ట్యూమర్లు ఉన్నట్టుగా రిపోర్టులు వచ్చాయి. ఈ సమస్యకు సంబంధించిన చికిత్స ఇతర వివరాలు తెలుపగలరు.
- విజయ్, బోధన్

బ్రెయిన్ ట్యూమర్లు రెండు రకాలు. మాలిగ్నెంట్ ట్యూమర్లు, క్యాన్సర్ ట్యూమర్లు. క్యాన్సర్ ట్యూమర్లు రెండు రకాలుగా ఉంటాయి. కొన్ని ట్యూమర్లు మెదడులోనే ప్రారంభమవుతాయి. రెండో రకం ట్యూమర్లు శరీరంలోని ఇతర భాగాల్లో క్యాన్సర్ ఏర్పడి అది మెదడుకు వ్యాపించడం వల్ల వస్తాయి. సాధారణంగా మెదడులో ట్యూమర్ ఏర్పడినపుడు ఫిట్స్ రావడం, కంటి చూపులో తేడా రావడం, వాంతులు, మానసికమైన మార్పులు, నడకలో మాటలో తేడా రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ట్యూమర్లను నిర్ధారించడానికి భౌతిక పరీక్షలతో పాటు పీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ వంటి పరీక్షలు కూడా అవసరమవుతాయి. వీటి చికిత్సకు సర్జరీతో పాటు కీమోథెరపీ, రేడియోథెరపీ అవసరమవుతాయి. కొన్ని రకాల ట్యూమర్లు చాలా నెమ్మదిగా పెరుగుతాయి. అలాంటి వాటికి సాధారణంగా సర్జరీ అవసరం ఉండదు. ట్యూమర్ ఏ రకమైనది, అది ఎంత త్వరగా పెరుగుతున్నది అన్న దాని మీద సర్జరీ ఫలితాలు ఆధారపడి ఉంటాయి. పరిమాణంలో పెద్దగా ఉండే ట్యూమర్లకు సర్జరీ తప్పదు. ఇలాంటి సందర్భాల్లో అవయవాలకు చెందిన నాడులు ట్యూమర్‌కు దగ్గరగా ఉన్నపుడు ట్యూమర్‌ను తొలిగించడం సాధ్యపడదు. ట్యూమర్‌లో కొంత భాగం తొలిగించి మిగతా ట్యూమర్‌కు స్టిరియోటాక్టిక్ రేడియో సర్జరీ చికిత్స ద్వారా నయం చెయ్యవచ్చు. ఇప్పుడు శాస్త్ర పరిజ్ఞానం చాలా అభివృద్ధి చెందింది. 3 సెంటీ మీటర్ల పరిమాణానికి వచ్చిన తర్వాత ఎస్ఆర్ఎస్ ద్వారా చికిత్స అందించవచ్చు. మీ నాన్న ట్యూమర్ ఏ రకమైంది, పెరుగుదల ఎలా ఉంది వంటి చాలా అంశాలను పరిగణనలోకి తీసుకొని చికిత్స అందించాల్సి ఉంటుంది. మీకు దగ్గరలో ఉన్న న్యూరోసర్జన్‌ను సంప్రదించి సరైన చికిత్స తీసుకోండి.

బిట్స్ కార్నర్

సోలార్ వెలుగులు నింపింది..!



చాలామంది వారి, పిల్లల భవిష్యత్ బాగుండాలని పల్లెల నుంచి పట్టణాలకు వలస వెళ్తుంటారు. అయితే ఉన్నత చదువులు చదివిన ఈమె మాత్రం పట్టణం నుంచి పల్లెకు పయనమైంది. ఎందుకో తెలుసా?

ఢిల్లీకి చెందిన పాలక్ అగర్వాల్.. 2011లో టీఈఆర్ఐ యూనివర్సిటీలో పీజీ చేసింది. ఆ సమయంలో 'పునరుత్పాదక శక్తిపై సామాజిక, ఆర్థిక అవగాహన-ప్రభావం' అనే అంశంపై ఫీల్డ్ వర్క్‌కు ఒడిశాలోని కలహండి గ్రామానికి వెళ్లింది. కలహండి చుట్టుపక్కల కనీసం కరెంట్ సౌకర్యం కూడా లేని గ్రామాలను, ఉదయం, రాత్రిళ్లు వారు పడుతున్న ఇబ్బందులను చూసి చలించింది. పాస్‌ఫొటో దిగాలంటేనే 30 కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితిపై జాలి పడింది. ఎలాగైనా వారి జీవితాల్లో వెలుగులు నింపాలని నిర్ణయం తీసుకున్నది. 2013లో ఢిల్లీని వదిలిని మారుమూల కలహండి ప్రాంతానికి ప్రయాణమైంది పాలక్ అగర్వాల్. అక్కడికెళ్లి సోలార్ విద్యుత్ గురించి గ్రామస్తులతో మాట్లాడి.. వారి సహకారంతో సోలార్ వెలుగులు తెచ్చింది. ప్రతి ఇంటిలోనూ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయించింది. సంతల్లో సరుకులు అమ్ముకునేవారికి ఎల్ఈడీతో బల్బ్‌తో కూడిన చిన్న సోలార్ లైట్లను ఇప్పించింది. సోలార్ వెలుగులు రావడంతో ఆ గ్రామంలోని ప్రజల జీవన స్థితిగతులు మారాయి. రైస్ మిల్లులు, ఫొటో స్టూడియోలు, దుకాణాలు, టీవీలు, ఎలక్ట్రిక్ మిషీన్లు, సేవా కేంద్రాలు వెలిశాయి. అయితే రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది పాలక్. ఇలా మారుమూల గ్రామాల ప్రజలకు టెక్నాలజీని పరిచయం చేసి.. వారి జీవన ప్రమాణాలు పెంచడంలో విజయం సాధించింది పాలక్ అగర్వాల్.

వృద్ధాప్య లక్షణాలకు చెక్ !



వయసు పెరుగుతున్నా కొద్దీ సహజసిద్ధంగా వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తుంటాయి. అయితే కొంత మంది వయసులో ఉండగానే ఈ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు ఇంట్లోనే ఈ ఏజింగ్ లక్షణాలకు చెక్ చెప్పొచ్చు.

- కొద్దిగా నిమ్మరసాన్ని తీసుకొని ముఖంపై ఏజింగ్ లక్షణాలు కనిపిస్తున్న దగ్గర రాయాలి. కొద్దిసేపటి తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఈ చిట్కా పాటిస్తున్నప్పుడు ఎండకు వెళ్లకూడదు.
- ఆపిల్ సైడర్ వెనిగర్‌లో కొద్దిగా తేనె కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి పట్టించాలి. ఏజ్ స్పాట్స్ వద్ద కొంచెం ఎక్కువగా రాయాలి. 15 నిమిషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి.
- ఏజింగ్ లక్షణాలను తగ్గించడానికి ఆముదం మంచిగా పనిచేస్తుంది. కొద్దిగా ఆముదాన్ని ముఖానికి రాసి, మర్దనా చేయాలి. తర్వాత రోజూ వాడే సబ్బుతో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి.
- పాలను ముఖానికి పట్టించి, మర్దన చేస్తే.. సున్నితంగా మారుతుంది. మృతకణాలను తొలిగించడంలో పాలు మేలు చేస్తాయి. పాలలో ఉండే లాక్టిక్ యాసిడ్ చర్మ రక్షణకు ఉపయోగపడుతుంది.
- తాజా టమోట ముక్కలతో ముఖాన్ని మర్దన చేయాలి. రసం ముఖానికి పట్టేంత వరకూ ఆగాలి. తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి.
- పసుపులో కొద్దిగా రోజ్‌వాటర్ కలిపి.. ఆ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. ఇలా ప్రతి రోజూ చేస్తుంటే ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.

నమస్తే తెలంగాణ

విందు

[హైదరాబాద్]
గురువారం 1 మార్చి 2018
హైదరాబాద్
బుధవారం 6 డిసెంబర్
2017



ఎండాకాలం వచ్చేసింది. నిన్న మొన్నటి వరకు వేడి వేడి పానీయాల కోసం వెతికిన వారంతా ఇక శీతల పానీయాల వైపు చూస్తుంటారు. పై నుంచి సూర్యుడు స్ట్రా వేసుకొని ఒంట్లోని సత్తువంతా పీల్చేస్తుంటాడు. మరి ఈ సమ్మర్‌ని కూల్ కూల్‌గా గడిపేయాలంటే తినే తిండిలో, తాగే డ్రింక్స్‌లో ఈ టిప్స్ పాటించండి.

ఎండాకాలం జాగ్రత్తలు

- ఎండాకాలం వేడి తీవ్రత వల్ల బాడీ డీహైడ్రేషన్‌కి గురవుతుంది. అలా కాకుండా ఉండాలంటే ఎక్కువ నీళ్లు తాగుతూ ఉండాలి.
- ఇలా చేస్తే శరీరం చల్లగా ఉండడంతో పాటు, ఒంటికి కావాల్సిన సత్తువ లభిస్తుంది. పైగా చర్మం జీవం కోల్పోకుండా ఉంటుంది.



డాక్టర్
మయూరి ఆవుల
న్యూట్రిషియనిస్ట్
mayuri.trudiet
@gmail.com

- ఈ సీజన్‌లో వచ్చే పండ్లు, కూరగాయలను ఎట్టి పరిస్థితుల్లో మిస్ కాకండి. సీజనల్ ఫుడ్స్ ఆ సీజన్‌లో వచ్చే వ్యాధులను తట్టుకునే శక్తినిస్తాయి.
- శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచితే మెదడు చురుగ్గా ఉంటుంది.
- పుచ్చకాయలో 92శాతం నీరు ఉంటుంది. సమ్మర్‌లో రెగ్యులర్‌గా పుచ్చకాయ తింటే శరీరానికి కావాల్సిన నీటిశాతం అందడంతో పాటు.. శక్తి కూడా లభిస్తుంది.
- జ్యూసీగా ఉండే స్ట్రాబెర్రీల్లో ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవి భయంకరమైన రోగకారక క్రిములతో పోరాడుతాయి.
- ఇవి శరీరంలో రక్తప్రవాహాన్ని మెరుగుపరుస్తాయి. చర్మం నిగనిగలాడేలా చేస్తాయి.
- నిమ్మరసం, కొబ్బరినీళ్లు, చిక్కటి మజ్జిగ ఎండాకాలంలో నిత్యం తాగుతూ ఉండాలి. ఇవి బాడీని డిహైడ్రేషట్ కాకుండా చూసుకుంటాయి.
- ఈ సీజన్‌లో వచ్చే మామిడి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో ఉండే సి విటమిన్, మెగ్నీషియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్స్, ఐరన్‌లు రక్తహీనతతో బాధపడుతున్న వారికి బాగా ఉపకరిస్తాయి.
- సమ్మర్‌లో కార్బొనేటెడ్ బేవరేజెస్, ఆల్కహాలిక్ బేవరేజెస్‌కి దూరంగా ఉండాలి.
- ఎక్కువ చక్కెర ఉన్న పానీయాలు, బాగా చల్లగా ఉన్న డ్రింక్స్ కూడా తీసుకోకూడదు.
- సమోసా, వడలు, చిప్స్ లాంటి మసాలా ఫుడ్‌కి వీలైనంత దూరంగా ఉండండి.

అల్పాహారం.. అదరహో!




ఉదయం తినే టిఫిన్ టేస్టీగా ఉంటే రోజంతా హాయిగా గడుపుతాం. అందుకే ఈ చిట్కాలను పాటిస్తే రుచికరమైన అల్పాహారాన్ని అదరహో అని ఆరగించేయొచ్చు.

- ముదిరిపోయిన ఆనప గింజల్ని బియ్యంతో కలిపి నానబెట్టి రుబ్బాలి. వాటిని దోశల్లాగా పోసుకుంటే రుచిగా ఉంటాయి.
- పూరీలు చేసేందుకు పిండి కలిపేటప్పుడు కొంచెం చక్కెర కలిపితే చాలాసేపటి వరకు తాజాగా ఉంటాయి.
- అరకిలో చపాతీ పిండిలో రెండు మగ్గిన అరటి పండ్లు, కొద్దిగా పెరుగు కలిపితే చపాతీలు మెత్తగా ఉంటాయి.
- ఇడ్లీలు దూదిలా మెత్తగా ఉండాలంటే.. పిండి రుబ్బేటప్పుడు రెండు ఆముదం చుక్కలు వేయాలి.



సముద్రంలో ఒక రెస్టారెంట్





చుట్టూ నీలిరంగులో మెరిసే సముద్రం, ఆ సముద్రంలో రంగురంగుల చేపలు, అందరినీ ఆకట్టుకునే సముద్రపు జీవులు, వాటి మధ్య విందు. వినడానికే థ్రిల్‌గా ఉంది కదా? నిజంగా అలాంటి విందు సాధ్యమేనా అనిపిస్తుంది కదూ! నూటికి నూరు శాతం సాధ్యమే. ఇలాంటి అనుభూతిని పొందాలంటే ఇప్పుడు ఏ దేశమో వెళ్లనవసరం లేదు మనదేశంలోనే అలాంటి రెస్టారెంట్ అందరికీ స్వాగతం పలుకుతున్నది. నీలిసంద్రపు నీడలో కుటుంబమంతా కలసి ఆనందంగా గడుపుతూ విందారగించేలా సముద్రపు లోతుల్లో ఈ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్‌లోని బోపాల్ ప్రాంతంలో రియల్ పోసీడాన్ పేరుతో ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. సముద్ర దేవుణ్ని గ్రీకులు పోసీడాన్‌గా పిలుస్తారు. సముద్రంలో నిర్మించిన రెస్టారెంట్ కనుక ఈ హోటల్‌కు అదే పేరు పెట్టారు.

రియల్ పోసీడాన్ గ్రీకుల సముద్రదేవుడు అని అర్థం. ఒడెస్సెస్ అనే యుద్ధ నావికున్ని ముప్పుతిప్పలు పెట్టిన ఈ దేవుడు గ్రీకు పురాణాల్లో మనకు కనిపిస్తాడు. పోసీడాన్ అని పేరు పెట్టినందుకు ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది కదా. చుట్టూ నీళ్ళతో నిండి సముద్రగర్భం లో ఉన్న అనుభూతిని కలిగించే ఈ రెస్టారెంట్ కి ఆ సముద్రం పేరే పెట్టారన్నమాట. గ్రౌండ్ లెవెల్‌కు 20 అడుగుల లోతున ఈ రెస్టారెంటును ఏర్పాటు చేశారు. 3000 చదరపు అడుగుల్లో నిర్మించిన ఈ హోటల్లో 32 మంది ఒకేసారి కుర్చో వచ్చు. 4 వేల రకాల చేపలున్న అక్వేరియం, వీటితో పాటు మరిన్ని సముద్రపు జీవులను కలిగి ఉన్న ఈ రెస్టారెంట్‌ను లక్షా 50 వేల లీటర్ల నీటితో ఏర్పాటు చేశారు. ఈ అక్వేరియం మధ్యలో గాజు గది నిర్మించి అందులో పోసీడాన్ రెస్టారెంటును ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాల్లో నిర్మించిన ఈ హోటల్ కోసం అయిన ఖర్చెంతో తెలుసా..? అక్షరాల 2 కోట్ల రూపాయలు. భూతలానికి 20 అడుగుల లోతులో ఉన్న ఈ నిర్మాణం లోపలి గోడలన్నీ గాజుతో చేసినవే కావడం విశేషం. దాదాపు 4 వేల రకాల జలచరాలు నీళ్లలో సందడి చేస్తుండగా, వాటిని చూస్తూ ఎంచక్కా భోజనం చేసే ఏర్పాట్లున్నాయక్కడ. ఈ రెస్టారెంట్లో పంజాబీ, థాయ్, మెక్సికన్, చైనీస్ వంటకాలన్నీ ఉంటాయి. రుచికరమైన వంటకాలతో వినియోగదారుల చవులూరించేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే ఇక్కడో ప్రత్యేకత ఏటంటే చుట్టూ చేపలున్నా మీ ప్లేట్లో చేప కనిపించే అవకాశమే లేదు ఎందుకంటే ఇది పక్కా వెజిటేరియన్ హోటల్. అవును ఇది పూర్తిగా శాఖాహార రెస్టారెంటే అని చెబుతున్నారు రియల్ పోసిడోన్ నిర్వాహకులు భరత్ భట్.

> **అండర్ వాటర్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. కానీ మంచి డిజైన్, కాన్సెప్ట్ కోసం ఇంతకాలం ఎదురు చూశా. ఈ రెస్టారెంట్ భారతీయులందరికీ ఒక కొత్త అనుభూతినిస్తుంది. భవిష్యత్తులో లైవ్ ఆర్కెస్ట్రాతో కస్టమర్స్‌ని అలరిస్తాం.. అని పోసీడాన్ రెస్టారెంట్ యజమాని భరత్ భాయ్ భట్ అంటున్నారు.**
> **ఆసియాలో థాయిలాండ్, మలేసియా, సింగపూర్, చైనా లాంటి కొన్ని దేశాల్లో మాత్రమే పర్యాటకులను ఆహ్లాదపరుస్తోన్న అండర్ వాటర్ రెస్టారెంట్లకు మన దేశంలో నాంది పలికింది రియల్ పోసిడోన్.**



పోసీడాన్ మన దేశంలో మాత్రమే మొదటి అండర్ వాటర్ రెస్టారెంట్, అక్వేరియం హోటల్. ప్రపంచంలో ఇప్పటికే ఎన్నో అండర్ వాటర్ రెస్టారెంట్స్ ఉన్నాయి. అయితే నెదర్లాండ్‌లోని క్యాప్సుల్ హోటల్ మాత్రం మరింత భిన్నమైంది. ముత్యపు చిప్ప ఆకారంలో ఒక బోట్ ని తయారు చేసి దీనిలో అన్ని హంగులను సమకూర్చారు. ఆ రెస్టారెంట్‌లో టేబుల్స్ ఉండవు ఇక అన్నీ ఇలాంటి ముత్యపు చిప్ప బోట్లే అన్న మాట. సముద్రంలో తిరుగుతూనే ఉంటుందీ బోట్ హోటల్ అయితే ఇందులో ఒకసారికి ఇద్దరికంటే ప్రవేశం లేదు ఎందుకంటే ఈ హోటల్ సైజు ఏడడుగులే. అయినా ఈ కాన్సెప్ట్‌తో బాగానే లాభాలార్జిస్తోందీ హోటల్. స్వీడన్‌లోని సాలా సిల్వర్‌మైన మరో భిన్నమైన రెస్టారెంట్. వరల్ డీపెస్ట్ హోటల్ ఇదే. భూ ఉపరితలం నుంచి దాదాపు 155 మీటర్ల లోతులో ఉంది. ఇక్కడి వాతావరణాన్ని తట్టుకోవడానికి ప్రత్యేకమైన దుస్తులు ధరించాలి. ఈ రెస్టారెంట్ పక్కనే ఓ అందమైన సరస్సు కూడా ఉంది.





పిజ్జాని వదిలేశా!

బాలీవుడ్‌లో ప్రియాంక చోప్రా చెల్లిగా పరిచయమైంది. ప్రత్యేక నటనతో తనకంటూ ఒక గుర్తింపు సంపాదించుకున్నది పరిణితి చోప్రా. బొద్దుగుమ్మలా ఉన్న ఈ అమ్మడు ఇప్పుడు ముద్దుగుమ్మలా మారిపోయింది. మరి ఈమె ఇష్టాయిష్టాలెంటో తెలుసా?

పరిణితికి సినిమాల్లోకి రావాలని అస్సలు ఉండక పోయేదట. ఏదో ఒక ఎమ్ఎన్‌సీ కంపెనీలో పని చేయాలని అనుకుంది. సినిమాల్లోకి వచ్చే ఆలోచన లేదు కాబట్టి కంటికి కనిపించిన ఫుడ్‌ని లాగించేసేది.

రుచికరమైన ఫుడ్ ముందు కనిపిస్తే ఆమె ముఖం మీద చిరునవ్వు వచ్చేసేది. బెండకాయ కూర, రాజ్మా చావల్, కడాయి చికెన్, పిజ్జా, మార్గరిటా, చాక్‌లెట్స్ అంటే తెగ ఇష్టంగా తినేది. దాంతో బరువు పెరిగింది.

అప్పుడే అనుకోకుండా సినిమా ఆఫర్ వచ్చింది. ఇంట్లో వాళ్లందరూ సినిమా చేయమని అడిగేసరికి కాదనలేకపోయింది. పైగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ నుంచి వచ్చిన ఆఫర్‌ని వదులుకోవాలని ఎవరు చూస్తారు. కాకపోతే వాళ్లు పరిణితీని బరువు తగ్గాల్సిందిగా కండీషన్ పెట్టారు.

సినిమా ప్రారంభమయ్యే నాటికి వర్కవుట్లు చేసి 20 కేజీలు తగ్గింది. కానీ మళ్లీ లావు ఎక్కడం ప్రారంభమైంది. దానికి కారణం ఆమె మెటబాలిజం సరిగా లేకపోవడం.

సినిమా ఛాన్స్ వచ్చినప్పటి నుంచి డైట్‌ని ఫాలో అవుతున్నది. ఈ డైట్ కారణంగా తనకు ఎంతో ఇష్టమైన పిజ్జాని వదిలేసింది. ఎక్కువ మంచి నీళ్లు తాగతుంది. ఉదయం చక్కెర లేని పాలు, బటర్, ఉడికించిన కోడిగుడ్డులోని తెల్లసొన తింటుంది. మధ్యాహ్నం.. సలాడ్, బ్రౌన్ రైస్, పప్పు, కూరగాయలతో లంచ్ అయిపోతుంది. రాత్రి తక్కువ ఆయిల్‌తో చేసిన భోజనం తింటుంది. చక్కెర లేని పాలతో డిన్నర్ ముగించేస్తుంది. అయితే రాత్రి 7 నుంచి 8లోపు డిన్నర్ కావాల్సిందే! వంట చేయడం అస్సలు ఇష్టం ఉండదట.

ఏం తింటే పడుతుందో, లేదో తెలియదు. అందుకోసం ఆస్ట్రేలియన్ హెల్త్ కేర్ సెంటర్‌లో తనకు ఎలాంటి ఫుడ్ వల్ల ఎలర్జీ వస్తున్నాదో టెస్ట్ చేయించుకుంది.



పోపుల పెట్టె

ఔషధ ఓమ!

ఓమా.. వాము ఏ పేరుతో పిలిచినా దీనిలో ఔషధ గుణాలు మెండుగా ఉన్నాయి. ఇవి ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా కాపాడుతాయి.

- ఓమలో విటమిన్లు, ఖనిజాలు, పీచు పదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. తలనొప్పి, జలుబు, అలసట, మైగ్రెయిన్ వంటి వాటికి ఓమా మందులా పనిచేస్తుంది.
- గర్భిణుల్లో ఆకలి పెంచి గర్భాశయం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఓమ కడుపునొప్పి నుంచి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.
- ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో ఒక చెంచా ఓమ కలిపి తాగితే అజీర్తి తగ్గి, ఆకలి పెంచుతుంది.
- గ్యాస్ సంబంధిత సమస్యలు దూరం అవుతాయి. ఓమ నుంచి తీసిన నూనె కీళ్ల నొప్పుల్ని తగ్గిస్తుంది.
- ఓమ నూరి పలుచని బట్టలో కట్టి వాసన చూస్తే ముక్కు దిబ్బడ తగ్గితుంది.
- గ్లాసు నీళ్లల్లో ఓమ వేసి మరిగించి, గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగితే దగ్గు, జలుబు సమస్యలు తగ్గుముఖం పడుతాయి.
- ఓమ నీళ్లని పుక్కిలిస్తే పంటి నొప్పి తగ్గుతుంది.
- ఓమని తేనెతో కలిపి వరుసగా పది రోజులు తీసుకుంటే మూత్రపిండాల్లో రాళ్లు కరుగుతాయి.
- వీటివల్ల ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మలబద్ధకం ఉండదు. ఊపిరితిత్తుల్లో చేరిన కఫం పోతుంది.
- శరీరంలో అధికంగా పేరుకుపోయిన కొవ్వు కరుగుతుంది. ఫలితంగా బరువు తగ్గుతారు.

సుడోకు

డైలీ సుడోకు 141 సమాధానం

1	6	2	7	5	4	3	9	8
8	4	3	6	9	2	7	1	5
9	5	7	3	8	1	2	4	6
2	1	6	9	4	7	8	5	3
4	7	9	8	3	5	6	2	1
5	3	8	2	1	6	9	7	4
6	8	1	4	7	9	5	3	2
3	9	4	5	2	8	1	6	7
7	2	5	1	6	3	4	8	9

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో


డైలీ సుడోకు -142

			9					6
5								9
	4					1		
		6		3	1	9		8
2			5		9			7
8		3	7	4		2		
		8					5	
9								4
6					5			

ట్వీట్



ఇంట్లో కాఫీ కూడా బాగుంటుంది.



విరాట్ కోహ్లీ
@imVkohli

విరాట్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

23,271,482

కామన్‌మ్యాన్ వాయిస్

సర్కారు తాయిలాలు ఇస్తుందా? ఆదుకుంటుందా ప్రజలు, రైతులు నిర్ణయిస్తారు. ప్రభుత్వం ఇచ్చే పంటకు పెట్టుబడులు మేము తీసుకోం. మా నేతలు, కార్యకర్తలు ముట్టుకోరు అని చెప్పే దమ్మున్న కాంగ్రెస్ నేతలు ఉన్నారా?
–SandeepReddy Kothapally

జీవితాన్ని ఆనందంగా అనుభవించాలంటే అజ్ఞానాన్ని మించిన వరం ఇంకోటి లేదు. మనలో జ్ఞాన సాంద్రత ఎంత పెరిగితే జీవితం అంత బాధామయం అవుతుంది. అందుకే జ్ఞానులు ఎప్పుడూ ప్రపంచం గురించి, పక్కవాళ్ల గురించి ఆలోచిస్తూ బతికినంతకాలం బాధే జీవితంగా బతుకుతారు.
–కొనకంచి లక్ష్మి నరసింహారావు

వైరల్ వీడియో



నిన్న అనేది ఎప్పుడో చనిపోయింది. రేపు అనేది ఇంకా పుట్టలేదు. ఒకే ఒక వాస్తవం ఉంది. అదే ఈ క్షణం. టైమ్ మేనేజ్‌మెంట్‌పై చేసిన ఈ వీడియో చూడండి.

Time Management Skills | How to Finish Your Work on Time | Motivational Tips| VikramAditya

Total views : 147,315+

Published on Feb 26, 2018



హైదరాబాద్ మహేంద్రహిల్స్‌లోని ఆశ్రమంలో మాతా అమృతానందమయి ఆశీర్వాదం తీసుకుంటున్న మంత్రి హరీశ్‌రావు

రైతులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

కాళేశ్వరం, మిషన్ కాకతీయ, భగీరథ వంటి పథకాలు భేష్

అభినందించిన మాతా అమృతానందమయి • మహేంద్రాహిల్స్‌లోని ఆశ్రమంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మ

ఆశీర్వాదం తీసుకున్న మంత్రి హరీశ్‌రావు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి వేణుగోపాలాచారి

మారేడ్‌పల్లి: రైతుకు అవసరమైన వసతులను సమకూర్చే బాధ్యతను తెలంగాణ ప్రభుత్వం గొప్పగా నెరవేరుస్తూ అండగా నిలుస్తున్నదని మాతా అమృతానందమయి ప్రశంసించారు. భారత దేశ యాత్రలో భాగంగా హైదరాబాద్ నగరానికి వచ్చిన ఆమె బుధవారం మహేంద్రాహిల్స్‌లోని మాతా అమ్మ తానందమయి మఠంలో భక్తులకు దర్శనమిచ్చారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి వేణుగోపాలాచారి మఠానికి వెళ్లి అమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపడుతున్న నీటి పారుదల ప్రాజెక్టుల గురించి అమ్మ మంత్రి హరీశ్‌రావును అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాలతోపాటు మిషన్ కాకతీయ వంటి పథకాలు, వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి వివరించారు. అనంతరం అమ్మ మాట్లాడుతూ.. సముద్రం పాలవుతున్న నీటిని కాళేశ్వరం వంటి ప్రాజెక్టు ద్వారా పంట పొలాలకు తరలించడం, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షిత నీటిని అందించడం మంచి ప్రయత్నమని అభినందించారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరుగడం బాధాకరమని, బాధిత కుటుంబాలకు తాము ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. త్వరలో రాష్ట్రంలో 20 గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీసుకొని రాష్ట్రం ఓడీఎఫ్‌గా మారాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజానికి కావల్సింది శాంతి మార్గం, సత్య మార్గమని, ఈ సన్మార్గాన్ని అందిస్తున్నందున్న మాతా అమృతానందమయిని దేశమంతా అమ్మగా పిలుస్తున్నదని వివరించారు. అమ్మ చేసిన సేవ, చూపిస్తున్న ప్రేమ మానవ జాతికి మంచి సందేశమన్నారు.

నేటినుంచి స్వచ్ఛ సర్వేక్షణపై ప్రజాస్పందన సర్వే

ఈ ఏడాదంతా స్వచ్ఛ కార్యక్రమాలు: గ్రేటర్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగరంలో నిత్యం వెలువడుతున్న వ్యర్థాలను 4,600 టన్నులనుంచి 5 వేల టన్నులకు పెంచేందుకు ఈ ఏడాదంతా స్వచ్ఛ సర్వేక్షణ పాటిస్తున్నట్టు జీహెచ్‌ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి ప్రకటించారు. స్వచ్ఛ సర్వేక్షణ-2018 సన్నాహాల్లో భాగంగా నగరంలో చేపట్టిన స్వచ్ఛ కార్యక్రమాలపై రూపొందించిన డాక్యుమెంట్లను స్వచ్ఛ భారత్ మిషన్‌కు చెందిన కార్వీ కన్సల్టెన్సీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇంటింటికీ డస్ట్‌బిన్‌ల పంపిణీ, రెండువేల ఆటో టిప్పర్ల ద్వారా రోజూ రవాణా చేసే వ్యర్థాలు 3,500 టన్నులనుంచి 4,600 టన్నులకు పెరిగినట్టు గుర్తుచేశారు. నగరంలో రెండుచోట్ల భవన నిర్మాణ వ్యర్థాల ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నందున మరో 400 టన్నుల వ్యర్థాల సేకరణ పెరుగుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ-2018 సర్వేకుగాను కార్వీ కన్సల్టెన్సీ ప్రతినిధులు డాక్యుమెంట్ల ఆధారంగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేశారని, నేటినుంచి నగరవాసులనుంచి స్వచ్ఛ కార్యక్రమాలపై నేరుగా ప్రజా స్పందనను సేకరిస్తామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణలో మూడు అంశాలపై నిర్వహించే సర్వేకు 4 వేల మార్కులను నిర్ణయించగా, ఇందులో 1,400 (35శాతం) మార్కులు జీహెచ్‌ఎంసీ అందిస్తున్న సేవల ఆధారంగా, మరో 1,200(30శాతం) క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా కేటాయిస్తారని, ఈ రెండు ప్రక్రియలూ ప్రస్తుతానికి పూర్తయినట్టు చెప్పారు. మిగిలిన 1,400(35శాతం) మార్కులు ప్రజాస్పందనకు కేటాయించగా, అది గురువారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇందులో భాగంగా నగరంలో స్వచ్ఛతపై ఐదు ప్రశ్నలను స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధులు అడగనున్నారని, వీటన్నింటికీ అవుననే సమాధానం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయి ప్రజాస్పందన సర్వేపై ఇప్పటికే నగరంలోని 11 లక్షల మందికి ఎస్‌ఎంఎస్‌ల ద్వారా, స్వచ్ఛదూతల ద్వారా ప్రచారం నిర్వహించినట్టు కమిషనర్ వివరించారు.



పాడి పశువుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంచార పశువైద్యశాలలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. రైతులు టోల్‌ఫ్రీ నంబర్ '1962'కు ఫోన్ చేసి సమస్యను వివరించగానే సంచార వాహనం వారి వద్దకు వస్తున్నది. అందులో ఉన్న వైద్యులు పశువులను పరీక్షించి అక్కడికక్కడే తగిన చికిత్సను అందిస్తున్నారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుట్ట మండలం మల్లాపురంలో ఓ రైతు సంచార పశువైద్యశాల సేవలను వినియోగించుకుంటున్న దృశ్యం.

- ఫొటో: గడసంతల శ్రీనివాస్

మాజీ సైనికుల కుటుంబాలకు ఆర్థికసాయం పెంపు

స్టేట్ మేనేజింగ్ కమిటీ ఆమోదం

ఖైరతాబాద్: రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక నిధి ద్వారా మాజీ సైనికులకు, వారి కుటుంబసభ్యులకు ఇస్తున్న వివిధ రకాల ఆర్థిక సహాయం పెంపుదలకు గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఆధ్వర్యంలో జరిగిన స్టేట్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆమోదముద్ర పడింది. పెంచిన ఆర్థిక సాయం ప్రకారం 1 నుంచి 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ డిప్లమా, డిగ్రీ చదువుతున్న వారికి రూ.10వేలు, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల విద్యార్థులకు రూ.15వేలు, హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్న వారికి రూ.10వేలు ప్రతి సంవత్సరం అందజేస్తారు. మాజీ సైనికుడి బిడ్డ పెండ్లికి రూ.30 వేలు, మరణించిన సైనికుల అంత్యక్రియల ఖర్చులకు రూ.10 వేలు, 60 ఏండ్లు పైబడిన వారికి నెలకు రూ.2 వేలు, మాజీ సైనికుల అనాథ పిల్లలకు ప్రతినెల రూ.2 వేలు, పెన్షన్ లేని వితంతువులకు అడహక్ గ్రాంట్ (ప్రత్యేక ఆర్థిక సాయం) రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తారు. ఆర్థిక సాయం కోసం అర్హులైన వారు www.telanganasainik.org వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ కల్నల్ రమేశ్‌కుమార్ తెలిపారు.

మే లోనే మెట్రో-1 పూర్తి!

యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న ఎల్బీనగర్- అమీర్‌పేట కారిడార్ పనులు

- గడువులోపే పూర్తవుతాయంటున్న అధికారులు
- కారిడార్-2,3లోనూ శరవేగంగా పనులు
- చకచకా సిగ్నలింగ్, ఎలక్ట్రిఫికేషన్



కారిడార్-1లో పనులను పరిశీలిస్తున్న మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మెట్రోరైలు కారిడార్-1లో ఎల్బీనగర్ నుంచి అమీర్‌పేట మార్గం పనులు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. గడువుకు ముందే పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూన్ చివరినాటికి కారిడార్-1తోపాటు కారిడార్-3ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని గతంలోనే నిర్ణయించారు. అయితే మే నాటికే పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. ఇందులో అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ పనులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తున్నారు. ఎల్బీనగర్‌కు మొదటగా మెట్రోరైలును అనుసంధానించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించడంతో మెట్రోరైలు అధికారులు ఈ మార్గంపై దృష్టి కేంద్రీకరించారు. ప్రస్తుతం ఎలక్ట్రికల్, సిగ్నలింగ్ పనులు కొనసాగుతున్నాయి. మరో రెండు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని అధికారులు చెప్తున్నారు. దీనినిబట్టి గడువుకన్నా ముందే ఎల్బీనగర్-అమీర్‌పేట మార్గం అందుబాటులోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. దీనికితోడు కారిడార్-3లోని అమీర్‌పేట-హైటెక్‌సిటీ మార్గంలోనూ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. మొత్తంగా ఏప్రిల్ చివరినాటికి ఈ రెండు మార్గాలు కమర్షియల్ ఆపరేషన్స్‌కు సిద్ధంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

చివరిదశకు చేరిన పనులు

కారిడార్-1కు సంబంధించిన పనులను స్టేజ్-5, స్టేజ్-2గా విభజించి చేపట్టారు. స్టేజ్-2 కింద చేపట్టిన మియాపూర్ నుంచి ఎస్సార్‌నగర్ వరకు మార్గం పనులను ఇప్పటికే పూర్తి చేసి కారిడార్-3కి అనుసంధానించారు. ఫలితంగా నాగోల్ నుంచి మియాపూర్ వరకు 30 కిలోమీటర్ల మేర కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభం అయ్యాయి. స్టేజ్-5 కింద చేపట్టిన అమీర్‌పేట నుంచి ఎల్బీనగర్ మార్గంలోని పనులు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే మూసారంబాగ్ వరకు ఎలక్ట్రిఫికేషన్, సిగ్నలింగ్ పనులు పూర్తిచేసి అనుమతులు కూడా మంజూరు చేశారు. దిల్‌సుఖ్‌నగర్ నుంచి ఎల్బీనగర్ వరకు పూర్తిచేసి క్లియరెన్స్ వస్తే ఈ కారిడార్ పనులు పూర్తయినట్టేనని హైదరాబాద్ మెట్రోరైలు అధికారులు చెప్తున్నారు. ఈ మార్గంలో కీలక సమస్యగా ఉన్న మలక్‌పేట ఆర్వోబీ, లక్డీకాపూల్ బ్రిడ్జి నిర్మాణం ఇప్పటికే పూర్తికావడంతో మేజర్ కనెక్టివిటీకి అవరోధం లేకుండా మారింది. విద్యుత్ సరఫరా కోసం రిసీవింగ్ సబ్‌స్టేషన్లు కూడా సిద్ధం కావడంతో ఎలక్ట్రిఫికేషన్ పనులు పూర్తయితే దాదాపు పనులు పూర్తయినట్టేనని అధికారులు చెప్తున్నారు. జూన్ చివరినాటికి కారిడార్-1కు సంబంధించి అమీర్‌పేట-ఎల్బీనగర్ (16 కి.మీ), కారిడార్-3లోని అమీర్‌పేట-హైటెక్ సిటీ(10 కి.మీ), కారిడార్-2కు సంబంధించి జేబీఎస్-ఎంజీబీఎస్(9 కి.మీ) మార్గాలను పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అన్ని మార్గాల పనులను సమాంతరంగా చేపడుతున్నారు.



విద్యార్థులను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

పోలీస్ వాహనంలో పరీక్ష కేంద్రానికి..

మారేడ్‌పల్లి: ఇంటర్ పరీక్షకు హాజరుకావాల్సిన విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు మార్గంమధ్యలో నిలిచిపోవడంతో అటుగా వెళ్తున్న పోలీసు అధికారి వారిని తన వాహనంలో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ ఘటన హైదరాబాద్ వెస్ట్‌మారేడ్‌పల్లిలో బుధవారం జరిగింది. ఎనిమిది మంది ఇంటర్ విద్యార్థులు మారేడ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు సికింద్రాబాద్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కారు. పరీక్ష కేంద్రం రెండు కిలోమీటర్ల దూరం ఉండగానే వెస్ట్ మారేడ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద బస్సు సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. అదేసమయంలో స్టేషన్‌కు వెళ్తున్న మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు విషయం తెలుసుకున్నారు. వెంటనే ఆ విద్యార్థులను తన వాహనంలో తీసుకెళ్లి పరీక్ష కేంద్రం వద్ద దింపారు. దీంతో విద్యార్థులు ఇన్‌స్పెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ఔటర్ రింగ్‌రోడ్‌పై పల్టీలు కొట్టి కాలిపోతున్న కారు

ఔటర్‌పై కారు బోల్తా.. డ్రైవర్ మృతి

మంటలు చెలరేగడంతో దగ్ధమైన కారు

ఘట్‌కేసర్: వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌తోపాటు స్తంభాన్ని ఢీకొట్టి రోడ్డుపై మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందగా, మంటలు చెలరేగి కారు పూర్తిగా దగ్ధమైన ఘటన మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్‌పై బుధవారం జరిగింది. ఘట్‌కేసర్ మండలం యాంనంపేట్ పరిధిలోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఔటర్ రింగ్‌రోడ్డుపై శామీర్‌పేట నుంచి పెద్ద అంబర్‌పేట్ వైపు అతివేగంగా వెళ్తున్న బెంజ్ కారు డివైడర్‌ను, స్తంభాన్ని ఢీకొట్టి మూడు పల్టీలు కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకోగా, అప్పటికే కారులో మెల్లగా మంటలు చెలరేగాయి. పోలీసులు అతికష్టం మీద కారు డోర్లు తెరిచి డ్రైవర్‌ను బయటకు తీశారు. అప్పటికే డ్రైవర్ అపస్మారక స్థితికి చేరుకోగా, ఈసీఐఎల్‌లోని తులసి దవాఖానకు తరలించగా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పగా, అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. మృతుడు ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సూర్యనారాయణపురం వంశీకృష్ణనగర్‌కు చెందిన వీ శ్రీరామరాజుగా పోలీసులు గుర్తించారు.

ఎగ్జిబిటర్లు, డిజిటల్ ప్రొవైడర్ల వివాదాన్ని పరిష్కరిస్తాం

సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సినిమా ఎగ్జిబిటర్లకు ధరల చెల్లింపు విషయంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. బుధవారం ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్మోహన్‌రావు, సౌత్‌ఇండియా, తెలుగు ఫిలించాంబర్ల ప్రతినిధులతో మంత్రి తలసాని చర్చలు జరిపారు. ప్రస్తుతం సినిమాలను ప్రదర్శిస్తున్న క్యూబ్, యూఎఫ్‌వో సంస్థలు అధిక ధరలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం నుంచి దక్షిణ భారతదేశంలో సినిమాల ప్రదర్శనలను నిలిపివేయనున్నట్టు వారు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సినిమా ఎగ్జిబిటర్లు హాలీవుడ్ సినిమాల పట్ల ఒకరకంగా, హిందీ సినిమాల విషయంలో మరో విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇరుపక్షాలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తలసాని వారికి తెలిపారు.



ఎగ్జిబిటర్లు, డిజిటల్ ప్రొవైడర్ల వివాదంపై చర్చిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్, ఎఫ్‌డీసీ చైర్మన్ రామ్మోహన్‌రావు, ఫిలించాంబర్ ప్రతినిధులు



స్వాధీనం చేసుకున్న రూ.పది నోట్ల కట్టలను పరిశీలిస్తున్న పోలీసులు

ఆటోలో కొత్త రూ.పది నోట్ల కట్టలు

విలువ 12 లక్షలు

తరలిస్తుండగా పట్టుకున్న ఆసిఫ్‌నగర్ ఎస్‌ఐ

సుల్తాన్‌బజార్: పాతబస్తీ నింబోలి అడ్డా సమీపంలో ఓ ఆటోలో పెద్ద పెద్ద సంచులు, అందులో ప్రయాణిస్తున్న వారి ముఖంలో ఆందోళనను గమనించిన ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు అనుమానం కలిగింది. వెంటనే ఆటోను ఆపి తనిఖీ చేయగా ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన పది రూపాయల నోట్లు పెద్ద మొత్తంలో బయటపడ్డాయి. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, రోడ్డుపై వెళ్తున్న ఓ పౌరుడి సాయంతో ఆటోలోని నోట్లను సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు ఎస్‌ఐ వెంకటేశ్వర్లును అభినందించారు. బుధవారం ఉదయం నగరంలో సంచలనం సృష్టించిన ఈ ఘటన వివరాలను సుల్తాన్‌బజార్ ఏసీపీ చక్రవర్తి వెల్లడించారు. కర్మన్‌ఘాట్ పద్మనగర్‌కాలనీకి చెందిన నేలంటి ప్రకాశ్ బుధవారం ఉదయం 10:30 గంటల సమయంలో నింబోలిఅడ్డాలో ఆనంద్, మూసా అనే వ్యక్తుల నుంచి రూ.12 లక్షలు విలువ చేసే కొత్త పది రూపాయల నోట్ల కట్టలను తీసుకొని బ్యాగుల్లో పెట్టుకున్నాడు. వాటిని అఫ్జల్‌గంజ్‌కు తరలించేందుకు ఆటోలో బయలుదేరాడు. ఆసిఫ్‌నగర్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అదే సమయంలో నింబోలి అడ్డా మీదుగా వెళ్తుండగా ఆటోలోని వ్యక్తులు, బ్యాగులు అనుమానాస్పదంగా కనిపించడంతో గుట్కా తరలిస్తున్నట్టు భావించి తనిఖీ చేశారు. నోట్ల కట్టలు బయటపడటంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న సుల్తాన్‌బజార్ పీఎస్ ట్రాఫిక్ కానిస్టేబుల్ రాజు, పాండు అనే పౌరుడి సహాయంతో ఆటోను సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించగా ఏసీపీ జీ చక్రవర్తి, ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రాజు చేరుకొని నోట్ల రవాణాపై విచారణ జరిపారు. నోట్లను అఫ్జల్‌గంజ్ తీసుకెళ్తున్నానని, వ్యాపారుల నుంచి కమీషన్ పద్ధతిన పెద్ద నోట్లకు ఈ రూ.పది నోట్లు ఇచ్చేందుకు తీసుకువెళ్తున్నట్టు ప్రకాశ్ తెలిపాడు. అయితే నోట్లకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకొని ఆదాయపన్ను శాఖ అధికారులకు సమాచారం అందించారు. పట్టుబడిన నోట్లన్నీ సీరియల్ నంబర్ ప్రకారం ఉండటంతో వాటిని ఏ బ్యాంక్ నుంచి డ్రా చేశారో విచారణ జరుపుతున్నారు.

నగరంలోని చారిత్రక సెవన్‌టూంబ్స్‌ను భారత్‌లో అమెరికా రాయబారి కెన్నెత్ ఐ జస్టర్ బుధవారం సందర్శించారు. ఆగాఖాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టూంబ్స్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ జనరల్ కేథరిన్ హడ్డా, ఆగాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ప్రతినిధులు, రాష్ట్ర పురావస్తుశాఖ అధికారులు పర్యటనలో ఆయన వెంట ఉన్నారు.



అజీజ్‌నగర్ టీజీ బ్యాంకు వద్ద ఆందోళన

అధికారుల భరోసాతో శాంతించిన ఖాతాదారులు

మొయినాబాద్: రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులోని తమ ఖాతాల్లో నుంచి మాయమైన డబ్బులు చెల్లించే వరకు కార్యకలాపాలు కొనసాగనివ్వమని ఖాతాదారులు బుధవారం ఆందోళనకు దిగారు. బ్యాంకులోని తమ ఖాతాల నుంచి మాయమైన రూ.9 కోట్లు ఇస్తామని ఎవరూ చెప్పడం లేదని వార్డు సభ్యులు నర్సింగ్‌రావు, రవి, శ్రీధర్ ఖాతాదారులతో కలిసి బ్యాంకుకు తాళం చేసి ఆందోళనకు దిగారు. తమ డబ్బులు ఎప్పుడు ఇస్తారో చెప్పే వరకు బ్యాంకును తెరువనివ్వమని బైఠాయించారు. కాయకష్టం చేసి, తమకున్న వ్యవసాయ భూములు అమ్మగా వచ్చిన డబ్బులు బ్యాంకులో దాచుకుంటే తమ ఖాతాల్లో నుంచి డబ్బులు మాయం చేసి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. 4 గంటలపాటు ఆందోళన చేయడంతో బ్యాంకు మేనేజర్ రామ్మోహన్‌రావు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో బ్యాంకు విజిలెన్స్ అధికారి కేబీఎస్ రాజు, రీజినల్ మేనేజర్ ఎం రవీందర్‌రెడ్డి అజీజ్‌నగర్‌కు వచ్చి ఖాతాదారులతో మాట్లాడారు. ఈ కేసు సీబీఐ పరిధిలో ఉన్నదని, నిందితులు ఎవరనేది తేలిన తర్వాత వారి నుంచి డబ్బులు తిరిగి రాబట్టి ఇస్తామని భరోసా ఇచ్చారు. డబ్బులు ఎక్కడికీ పోవని, ఖాతాదారులు ఆందోళన చెందవద్దని కోరారు. ఇందుకు నెల సమయం పడుతుందని అప్పటి వరకు ఓపిగ్గా సహకరించాలని సూచించారు. దీంతో ఖాతాదారులు ఆందోళన విరమించారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి


చట్టబద్ధత కల్పించపోతే కాంగ్రెస్, బీజేపీని బొందపెడుతం


మాదిగ యూత్ జేఏసీ సదస్సులో పిడమర్తి రవి


చిక్కడపల్లి: ఈ పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్ట బద్ధత కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగ యూత్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం తెలంగాణ మాదిగ యువజన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ దశబ్దాల పోరాటంలో నిరాక్ష్యరాసుడి, మోసగాని చేతిలో మాదిగ జాతి మోసపోయిందని మంద కృష్ణ మాదిగను ఉద్దేశించి విమర్శించారు. వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలోనే ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు. మరి రాష్ట్ర ప్రభుత్వంపై ధర్మయుద్ధాలు, కురుక్షేత్రాలు ఎందుకని ప్రశ్నించారు. మంద కృష్ణ మాదిగ 24 ఏండ్ల ఉద్యమంలో ఆయన స్వార్థంతో ఆర్థికంగా స్థిరపడ్డారని, ఆయన మాదిగలకు చేసిందేమీ లేదన్నారు. శత్రువులతో పోరాటం చేయాల్సింది పోయి, వారితో భోజనాలు చేస్తున్నారని మంద కృష్ణ మాదిగపై మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే ప్రధాని నరేంద్ర మోదీ ఉద్దేశపూర్వంగానే సమయం ఇవ్వడం లేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రయత్నాలు చేస్తుంటే మంద కృష్ణ మాదిగ, బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ నెల 5 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు జరుగనున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకపోతే ఏప్రిల్ 7 నుంచి రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్, బీజేపీకి వ్యతిరేకంగా కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని 20 ఏండ్లుగా మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చేప్తామన్నారు. మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ వడ్డె ఎల్లన్న మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి కృష్ణ మాదిగ, నాయకులు కిరణ్, జయరాజ్, చిరుమర్తి రాజు, వీరబాబు, మంద సురేశ్, వీరేందర్, దిరన్, సుందర్, గాదె వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
గురువారం 1 మార్చి 2018


రాకేష్‌రోషన్


సంజయ్‌లీలాభన్సాలీ


సోనమ్‌కపూర్


ఐశ్వర్యరాయ్


వెంకటేష్


సుస్మితాసేన్


దీపికాపదుకునే


చిరంజీవి


టబు


కాజోల్, అజయ్‌దేవ్‌గన్



జగదేకసుందరికి సినీరంగం అశ్రునివాళి

అశ్రునయనాల మధ్య అతిలోక సుందరి శ్రీదేవికి యావత్ సినీలోకం నివాళులు అర్పించింది. శ్రీదేవితో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకుంటూ ప్రతి ఒక్కరూ కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె దూరమయ్యారనే వార్తను జీర్ణించుకోలేకపోతున్నామంటూ బాధతప్త హృదయాల మధ్య శ్రీదేవికి వీడ్కోలు పలికారు. షారుఖ్ ఖాన్, చిరంజీవి, అజయ్‌దేవ్‌గణ్, వెంకటేష్, జయాబచ్చన్, ఐశ్వర్యరాయ్, రవీనాటండన్, షాహిద్‌కపూర్, దీపికాపదుకునే, ఫరాఖాన్, సోనమ్‌కపూర్, టబు, హేమామాలిని, సుస్మితాసేన్, వెంకటేష్, జాన్ అబ్రహమ్, సంజయ్‌లీలాభన్సాలీ, హిమేష్ రేష్మియా, రవీనా టండన్,విద్యాబాలన్, సిద్ధార్థ్‌రాయ్‌కపూర్, మాధురీ దీక్షిత్, సుభాష్‌ఘాయ్, ఇషా డియోల్, వివేక్ ఒబేరాయ్, రాకేష్‌రోషన్‌తో పాటు హిందీ, తమిళ, తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు సినీ ప్రముఖులు శ్రీదేవి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.


హిమేష్ రేష్మియా


విద్యాబాలన్, సిద్ధార్థరాయ్‌కపూర్


మాధురీ దీక్షిత్, శ్రీరామ్


ప్రకాష్‌రాజ్



జాన్ అబ్రహమ్


శ్రీదేవి భౌతికకాయంతో కుటుంబ సభ్యులు...

రేపటి నుంచి థియేటర్లు బంద్

రేపటి (మార్చి 2) నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శనను నిలిపివేస్తున్నట్లు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటించింది. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వసూలు చేస్తున్న అధిక ధరలకు సంబంధించి ఇటీవలే దక్షిణభారత సినీ పరిశ్రమల జాయింట్ యాక్షన్ కమిటీ వారితో జరిపిన చర్చలు విఫలమవ్వడంతో థియేటర్లను బంద్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో తెలుగు ఫిలింఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ 'గత కొన్ని సంవత్సరాలు సినీ పరిశ్రమ సమిష్టిగా పోరాటం చేసినా డిజిటల్ యాజమాన్యాలు దిగిరాలేదు. మా పోరాటానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని థియేటర్ల యాజమాన్యాలు సంపూర్ణ మద్దతునిచ్చాయి. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, పంపిణీదారులు అందరు ఒకేతాటిపైకి వచ్చి చేసున్న ఈ పోరాటానికి ప్రేక్షకులు సహకరించాలని కోరుకుంటున్నాం. సినిమాల ప్రదర్శన నిలిపివేత ఎన్ని రోజులు కొనసాగుతుందో చెప్పలేము' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యాల రామదాసు, దామోదర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





చైల్డ్ ఫ్రెండ్లీ రాష్ట్రంగా తెలంగాణ

- ప్రభుత్వ సంకల్పంపై కైలాశ్ సత్యార్థి హర్షం
- సహకారం అందిస్తామని హామీ
- కరీంనగర్‌లో బాలమిత్ర సదస్సుకు హాజరు
- బాలలు, విద్యార్థుల కోసం ఎన్నో పథకాలను తెచ్చాం: మంత్రి ఈటల
- సత్యార్థిని స్ఫూర్తిగా తీసుకుందాం: ఎంపీ వినోద్



బుధవారం కరీంనగర్‌లో బాలమిత్ర సదస్సులో విద్యార్థినికి బహుమతి ప్రదానంచేస్తున్న కైలాశ్ సత్యార్థి. చిత్రంలో మంత్రి ఈటల, ఎంపీ వినోద్, ఎమ్మెల్యే గంగుల తదితరులు



రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో కైలాశ్ సత్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న శ్రీహిందు ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వెంకట్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు పాపారావు, వేదకుమార్ ఉన్నారు.

కరీంనగర్ కార్పొరేషన్, ఆదిబట్ల, నమస్తే తెలంగాణ: రాష్ట్రాన్ని చైల్డ్ ఫ్రెండ్లీ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించి తెలంగాణ ప్రభుత్వం దేశంలో నూతన అధ్యాయానికి నాంది పలికిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో ఎంపీ వినోద్ అధ్యక్షతన బుధవారం 'బాలమిత్ర' సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా కైలాశ్ సత్యార్థి హాజరై ప్రసంగించారు. సమాజాన్ని చైల్డ్ ఫ్రెండ్లీగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమాజంలోని పెద్దలు పిల్లల్ని స్నేహితులుగా చూడాలని, చిన్నారులు కూడా పెద్దలను తమ మిత్రులుగా భావించాలని అన్నారు. తాము ఇప్పటికే దేశంలో 600 గ్రామాలను చైల్డ్ ఫ్రెండ్లీ గ్రామాలుగా మార్చామని పేర్కొన్నారు. చైల్డ్ ఫ్రెండ్లీ తెలంగాణ కోసం తమ ఫౌండేషన్ల ద్వారా పూర్తి సహకారం అందిస్తామని, ఉపాధ్యాయులు, పోలీసులు తదితరులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా చిన్నారులు, విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను తీసుకువచ్చిందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కేంద్రం నిధులు తగ్గించినా తాము బడిపిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నామని చెప్పారు. ఎంపీ వినోద్ మాట్లాడుతూ, పిల్లలందరూ కైలాశ్ సత్యార్థిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణను చైల్డ్ ఫ్రెండ్లీ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.రాష్ట్రంలోని15 వేల ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్‌కు ఒక్కరి చొప్పున అనాథ పిల్లలకు ఉచితంగా విద్య అందించాలని నిర్ణయించినట్లు ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి శేఖర్‌రావు తెలిపారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ కార్యదర్శి జగదీశ్వర్, కరీంనగర్ జడ్పీ అధ్యక్షురాలు తుల ఉమ, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, కలెక్టర్ సర్ఫ్‌రాజ్ అహ్మద్, నగర కమిషనర్ శశాంక, ట్రైనీ కలెక్టర్ ప్రావీణ్య, తెలంగాణ ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రమేశ్, కార్పొరేటర్లు, టీఆర్‌ఎస్ నాయకులు, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షిద్దాం: సత్యార్థి

ఇబ్రహీంపట్నం మండలంలోని శ్రీఇందు ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం చైల్డ్ ఫ్రెండ్లీ అంశంపై నిర్వహించిన సెమినార్‌లోనూ కైలాశ్ సత్యార్థి ప్రసంగించారు. బాలలహక్కుల పరిరక్షణకు, బాలకార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. బాలలపై ఎవరూ వేధింపులకు పాల్పడకుండా స్నేహితుల్లా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఇందు కళాశాల చైర్మన్ వెంకట్‌రావు, ప్రభుత్వ సలహాదారు పాపారావు, బాలల ఫిల్మ్ సొసైటీ తెలంగాణ చైర్మన్ వేదకుమార్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నమెంట్ డైరెక్టర్ దేవీప్రసాద్, మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ భరత్‌కుమార్, తెలంగాణ ఆదర్శరైతు మొద్దు అంజిరెడ్డి, జెట్పీటీసీ రమేశ్‌గౌడ్, నేతలు దేవరంపల్లి శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌రెడ్డి, అల్వాల్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం హైదరాబాబాద్ బీఎం బిర్లా సైన్స్‌సెంటర్‌లో సైన్స్‌లో నూతన ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి జోగు రామన్న

హరిత హారంతో వృక్ష సంపద విస్తరణ

- 23 నుంచి 33 శాతానికి పెరిగింది : మంత్రి జోగురామన్న

తెలుగు యూనివర్సిటీ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరిత హారం కార్యక్రమం సత్ఫలితాలిచ్చిందని, రాష్ట్రంలో వృక్ష సంపద 23 శాతం నుంచి 33 శాతానికి పెరిగిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న చెప్పారు. వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా చూసుకోవాలని, కాలుష్యాన్ని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, చెట్లను నరుకవద్దని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీఎం బిర్లా సైన్స్‌సెంటర్‌లో బుధవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమానికి మంత్రి జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో నూతన ఆవిష్కరణలతో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను అందజేసి అభినందించారు. సైన్స్‌లో తొలి నోబెల్ బహుమతి గ్రహీత సీవీ రామన్‌తోపాటు నాటితరం శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకొని పరిశోధనలను విస్తృతం చేయాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించడం కోసం టీఎస్‌కాస్ట్ ద్వారా గణితం, సైన్స్ విభాగాలలో 8 మందికి ఉత్తమ పరిశోధకుల అవార్డుల కింద ఒక్కొక్కరికి రూ.25 వేలను ఆయన బహూకరించారు. భూమిలోని తేమను పసిగట్టి సూచనలను వెలువరించే సెన్సార్ ఆధారిత పరికరాన్ని కనుగొన్న సిరిసిల్లకు చెందిన యువ శాస్త్రవేత్త బీ మల్లేష్, గాలిలోని తేమను సేకరించి నీరుగా మార్చే డ్యూడ్రాప్ పరికరం కనుగొన్న హైదరాబాద్‌కు చెందిన విద్యార్థిని జవ్వాద్ పటేల్‌ను, ఎన్‌సీసీలో ఎంపికైన మహేందర్‌రెడ్డి, అరీబా అయ్మెన్‌లకు మెడల్స్ అందజేశారు. ఐఏఎస్ అధికారి బీ కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ సైన్స్‌ను సమాజ సుస్థిర అభివృద్ధికి దోహదపడేలా వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం మెడికల్ సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ డాక్టర్ గీత వేముగంటి, అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతికతశాఖ సంయుక్త కార్యదర్శి జీ కృష్ణవేణితోపాటు టీఎస్‌కాస్ట్, ఎన్జీసీ సిబ్బంది, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

హజ్ కోటా మరో వెయ్యి పెంచండి

- కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీకి రాష్ట్ర హజ్‌కమిటీ విజ్ఞప్తి



కేంద్రమంత్రి నఖ్వీకి జ్ఞాపికను అందజేస్తున్న టీఎస్‌హెచ్‌సీ చైర్మన్ మహ్మద్ మసీవుల్లాఖాన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ(టీఎస్‌హెచ్‌సీ) ద్వారా హజ్‌కు వెళ్లే యాత్రికుల కోటాను కనీసం మరో వెయ్యి దాకా పెంచాలని టీఎస్‌హెచ్‌సీ చైర్మన్ మహ్మద్ మసీవుల్లాఖాన్ కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. తెలంగాణ నుంచి హజ్ యాత్రికుల ఎంపిక పూర్తయినప్పటికీ ఇంకా సుమారు 13 వేల మందికి పైగా యాత్రికులు వెయిటింగ్ లిస్టులో ఉన్నారని తెలిపారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నఖ్వీతో మసీవుల్లాఖాన్ భేటీ అయ్యారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం మహమూద్ అలీ హజ్ కోటాపై కేంద్రానికి రాసిన లేఖను ఆయన ఈ సందర్భంగా నఖ్వీకి అందజేశారు. ఈసారి టీఎస్‌హెచ్‌సీకి కేంద్రం 4066 సీట్లు కోటా కేటాయించగా, 17,130 మంది హజ్‌యాత్రకు వెళ్లడానికి దరఖాస్తు చేసుకున్నారని ఆయన ముఖ్తార్ అబ్బాస్‌కు వివరించారు. వివిధ క్యాటగిరీలలో మొత్తం 4066 మందిని ఎంపిక చేయగా, ఇంకా 13,064 మంది యాత్రికులు వెయిటింగ్ జాబితాలో ఉన్నారని చెప్పారు. దీనిపై నఖ్వీ సానుకూలంగా స్పందించినట్టు మసీవుల్లా తెలిపారు.

ఢిల్లీకి చేరిన 9వ షెడ్యూల్ విభజన సమస్యలు

- ముగిసిన షిలాబిడే కమిటీ రెండ్రోజుల చర్చలు
- హాజరైన వివిధ కార్పొరేషన్ ఎండీలు, ఉద్యోగసంఘాల నేతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తొమ్మిదో షెడ్యూల్ సంస్థల విభజన సమస్యలు ఢిల్లీకి చేరాయి. ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల విభజన కోసం ఏర్పాటైన షీలాబిడే కమిటీ మంగళ, బుధవారాల్లో వివిధ కార్పొరేషన్ల ఎండీలు, ఉద్యోగసంఘాల నాయకులతో చర్చలు జరిపింది. ఈ సంస్థల విభజన సమస్యలను ఢిల్లీ పెద్దలకు వెల్లడిస్తామని షీలాబిడే వివరించారు. బుధవారంతో షీలాబిడే కమిటీ గడువు ముగిసింది. వివిధ సంస్థల్లో వాదోపవాదాలు ఉన్నందున కమిటీ గడువును పొడిగిస్తారా? లేదా? అనే అంశాన్ని కేంద్రప్రభుత్వం తేల్చనున్నది. దాదాపు 72 సంస్థలకు సంబంధించిన నివేదికలను కేంద్రానికి కమిటీ అందజేయనున్నట్టు తెలిసింది. తెలంగాణ పబ్లిక్‌సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వాదనలను షీలాబిడేతోపాటు ఇతర కమిటీ సభ్యులు సాధుసుందరం తదితరులు విన్నారు. పౌరసరఫరాల కార్పొరేషన్, ట్రేడింగ్ కార్పొరేషన్, ఆగ్రోస్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తోపాటు 35 కార్పొరేషన్లపై ఉద్యోగసంఘాల నాయకులు తమ వైఖరిని కమిటీకి తెలిపారు.

దళిత, గిరిజనుల ప్రగతిలో కొత్తవెలుగులు

వినూత్న శైలిలో పథకాల అమలు

- ఎస్సీ, ఎస్టీ కమిషన్‌పై ఎంతో బాధ్యత
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి
- బాధ్యతలు స్వీకరించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్
- మంత్రులు, పలువురు ప్రముఖుల అభినందన



బుధవారం రవీంద్రభారతిలో ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంత్రి హరీశ్‌రావును ఆలింగనం చేసుకుంటున్న ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో డిప్యూటీ సీఎం కడియం, మంత్రులు నాయిని, జగదీశ్‌రెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, కమిషన్ సభ్యుడు సుంకపాక దేవయ్య ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దళిత, గిరిజనుల సామాజిక, ఆర్థిక, విద్యా ప్రగతికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్ బుధవారం పదవీ స్వీకారం చేపట్టారు. ముందుగా తెలంగాణ భవన్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం అమరవీరుల స్థూపంవద్దకు వెళ్లి తెలంగాణ త్యాగధనులకు నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్ర చేస్తూ రవీంద్రభారతికి చేరుకున్నారు. రవీంద్రభారతిలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, డిప్యూటీసీఎం కడియం శ్రీహరి, మంత్రులు టీ హరీశ్‌రావు, నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీలు ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ చిన్నవయసులోనే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. దేశంలోనే మొట్టమొదటగా సీఎం కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేకంగా మైనార్టీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులకోసం గురుకుల విద్యాలయాలను నెలకొల్పి నాణ్యమైన విద్యను అందిస్తున్నారని చెప్పారు.

సీఎం కేసీఆర్ స్ఫూర్తిగా పనిచేద్దాం

ఉద్యమస్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలోని దళిత, గిరిజనుల అభ్యుదయానికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర మార్కెటింగ్, భారీ నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తిగా అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి సీఎం కేసీఆర్ ఒకరి తర్వాత ఒకరికి సరైన గుర్తింపు కల్పిస్తున్నారని చెప్పారు. దశాబ్దకాలంపాటు టీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని, విద్యార్థి విభాగం నుంచి సేవలందించిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు తగిన గౌరవం దక్కిందని మంత్రి హరీశ్ అన్నారు. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఎర్రోళ్ల శ్రీనివాస్‌కు దళిత, గిరిజనులకు నిజమైన సేవచేసే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు నియంత్రించాలని, నమోదవుతున్న అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని శ్రీనివాస్‌కు మంత్రి సూచించారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తా: ఎర్రోళ్ల

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి బాధ్యతాయుతంగా పనిచేస్తానని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ చెప్పారు. తనకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి అప్పగించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తర్వాత సభ్యులుగా బోయుళ్ల విద్యాసాగర్, రాంబల్‌నాయక్, కుస్రం నీలాదేవి, సుంకపాక దేవయ్య, చిలకమర్రి నర్సింహ్మ ప్రమాణ స్వీకారం చేశారు.

ఉత్తమ్‌వి ఉత్తరకుమార ప్రగల్భాలు

- బస్సుయాత్ర పేరుతో కాంగ్రెస్‌లో కుర్చీల కొట్లాట
- ఉత్తమ్, జానాలు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చూసిరండి: విప్ పాతూరి
- రైతులకు ఉత్తమ్ క్షమాపణ చెప్పాలి: విప్ బి.వెంకటేశ్వర్లు



బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో మీడియాతో మాట్లాడుతున్న చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి. చిత్రంలో మండలి విప్ బీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, భూపాల్ రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తరకుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నారని, సీఎం కేసీఆర్‌పై సంస్కారహీనంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే ప్రజలు తిరగబడుతారని శాసనమండలిలో ప్రభుత్వ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మండలిలో విప్ బీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బస్సుయాత్రలో ప్రస్తావిస్తున్న సమస్యల్లో కొత్తగా పుట్టుకొచ్చినవి ఏమిటని, వాటి విషయంలో ఇన్నాళ్లు అధికారంలో ఉండి ఏమి చేశారో చెప్పాలని కాంగ్రెస్ నాయకులను పాతూరి ప్రశ్నించారు. బస్సుయాత్ర పేరుతో కాంగ్రెస్‌లో కుర్చీల కొట్లాట నడుస్తున్నదని చెప్పారు. రైతులకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీరందించడానికి 24 గంటల పాటూ పనులు జరుగుతున్నాయని, ఉత్తమ్, జానాలు ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును పరిశీలించి రావాలని పాతూరి సూచించారు. ప్రభుత్వ విప్ బీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతుల ఓట్లను కొనుగోలు చేయడానికి పంట పెట్టుబడి పథకమంటూ చేసిన వ్యాఖ్యలను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామంటూ కాంగ్రెస్ చెప్తే ఒప్పు.. పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ.4వేలు ఇస్తానని టీఆర్‌ఎస్ చెప్తే తప్పా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షుడు బస్సుయాత్ర పేరుతో తుపాకీ రాముడి మాటలు, పిట్టల దొర కథలు చెప్తున్నారని విమర్శించారు.కేసీఆర్ నాయకత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి రూ.40వేల కోట్లు ఖర్చుచేస్తున్నదని చెప్పారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేసేలా మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులపై 420 సెక్షన్ కింద కేసు పెట్టాలన్నారు.

బస్సుయాత్రకు ప్రజాస్పందన లేదు

- రైతును అవమానపర్చడం కాంగ్రెస్‌కు అలవాటే
- సీఎం కేసీఆర్ వ్యక్తిగత విమర్శలు చేయలేదు
- ఎన్డీఏ ప్రభుత్వం రైతాంగానికి చేసిందేమీలేదు
- దేశానికి దిక్సూచిగా తెలంగాణ
- ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రైతులను అవమానపర్చడం కాంగ్రెస్ నాయకులకు ఎప్పుడూ అలవాటైన పనేనని, ఓట్లకోసమే పెట్టుబడి పథకమంటూ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన విమర్శలు రైతులను అవమానపర్చడమేనని శాసనమండలిలో ప్రభుత్వవిప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల్లో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని స్వయంగా రాహుల్‌గాంధీ ప్రకటించినా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మలేదన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు గుర్తించాలన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు రూ.17వేల కోట్ల రుణాలను మాఫీ చేసిందని, వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్‌ను అందిస్తున్నదని చెప్పారు. విత్తనాలు, ఎరువులను పోలీస్ స్టేషన్లలో పెట్టి అమ్మించిన చరిత్ర కాంగ్రెస్‌ది కాదా అంటూ ప్రశ్నించారు. 'ఇవ్వలేనిది మీరు.. ఇవ్వగలిగింది మేము' అని పల్లా పేర్కొన్నారు. పెట్టుబడి కోసం రైతులకు త్వరలో ఎకరానికి రూ.4 వేలు ఇవ్వబోతున్నామని, దీనికోసం ఇప్పటికే 72 లక్షల మంది రైతుల 142 లక్షల ఎకరాల భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయిందన్నారు. పెట్టుబడి పథకానికి బడ్జెట్‌లో రూ.12 వేల కోట్లు కేటాయించనున్నట్టు సీఎం కేసీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. రైతు సమన్వయసమితులు రౌడీలకు రౌడీ సమితుల్లాగానే కనపడుతాయని మండిపడ్డారు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కన్పిస్తారని, ఆ పార్టీ చేపడుతున్న బస్సుయాత్ర పాత కాలపు రాజకీయాలను గుర్తు చేస్తున్నదని విమర్శించారు.

కల్లు తాగిన కోతుల్లా బీజేపీ నేతలు...

బీజేపీ రాష్ట్ర నాయకులు కల్లు తాగిన కోతుల్లా ఇష్టమొచ్చినట్టుగా మాట్లాడుతున్నారని పల్లా విమర్శించారు. పంటలకు మద్దతు ధర పదేండ్ల క్రితం ఎంతుందో ఇప్పుడూ అంతే ఉందని, దీనినే సీఎం కేసీఆర్ విమర్శించారని, ఆయన ఎవరిపైనా వ్యక్తిగతంగా విమర్శలు చేయలేదని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తున్న ఏకైకరాష్ట్రం తెలంగాణ అని పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. దేశానికి తెలంగాణ రాష్ట్రం దిక్సూచిగా మారిందన్నారు. వ్యవసాయరంగ నిపుణులైన స్వామినాథన్, రాజేంద్రసింగ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారని గుర్తుచేశారు.

మహిళాదినోత్సవం ఘనంగా జరుపాలి

జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో భారీగా ఏర్పాట్లు • అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశం



బుధవారం సచివాలయంలో మహిళా దినోత్సవ నిర్వాహక కమిటీ సభ్యులతో సమావేశమైన మంత్రి తుమ్మల. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి, మామిడి హరికృష్ణ

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: వచ్చేనెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం రాష్ట్రంలోని ప్రతీ జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టాలని మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని అధికారులకు సూచించారు. మార్చి 8న నిర్వహించే ప్రపంచ మహిళా దినోత్సవాల ఏర్పాట్లపై సచివాలయంలో బుధవారం మంత్రి తుమ్మల అధ్యక్షతన నిర్వాహక కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ప్రపంచ మహిళా దినోత్సవాల వేదికను ఎంపికచేయాలని, గత ఏడాది నిర్వహించిన లలితకళా తోరణాన్ని మరోసారి పరిశీలించాలని అధికారులకు మంత్రి తుమ్మల సూచించారు.వివిధరంగాల్లో కృషిచేసిన మహిళలను పురస్కారాలకు ఎంపిక చేసే బాధ్యతను రమణాచారి, రసమయి బాలకిషన్, మామిడి హరికృష్ణకు మంత్రి అప్పగించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు రమణాచారి, దేశపతి శ్రీనివాస్, సాంస్కృతిక సారథి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సువర్చల, సురభివాణి, రేవతి, అఖిలేశ్వరి, సూర్య ధనుంజయ పాల్గొన్నారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి రూ.547 కోట్లు

- తొలి విడుతగా కేంద్రం నుంచి రూ.136.47 కోట్లు విడుదల
- ఆర్‌అండ్‌బీ అధికారుల సమీక్షలో మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి రూ.547 కోట్ల నిధులను మంజూరు చేసినట్టు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. శాఖాపరంగా చేపట్టిన కలెక్టరేట్లు, ఎమ్మెల్యేల నివాస, కార్యాలయాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. బుధవారం ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లోని కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 452 కిలోమీటర్ల నిడివితో 20 రోడ్లు, 18 వంతెనలను కేంద్రం మంజూరు చేసిందని చెప్పారు. మొదటి విడుతగా కేంద్ర వాటా కింద రూ.136.47 కోట్లను విడుదల చేసిందని చెప్పారు. ఎమ్మెల్యేల నివాస, కార్యాలయ భవనాలపై మంత్రి చర్చించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ సునీల్‌శర్మ, ఈఎన్సీలు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, ఇంజినీర్లు పాల్గొన్నారు.


ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులకు 8 ట్రోఫీలు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: చెన్నైలో జరిగిన ఆలిండియా పోలీసు డ్యూటీ మీట్‌లో వివిధ విభాగాల్లో తెలంగాణ పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఉత్తమ ఐటీ ప్రాజెక్టు 2017కుగాను నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) ట్రోఫీని తమిళనాడు సీఎం పళనిస్వామి నుంచి అందుకున్నారు. రెండు వెండి, ఆరు కాంస్య పతకాలతోపాటు ఒక విన్నర్ ట్రోఫీని సాధించారు.

పేరు	హోదా	పనిచేస్తున్నస్థలం	క్యాటగిరీ	మెడల్స్
కే శ్రీనివాస్	కానిస్టేబుల్	క్లూస్, కరీంనగర్	ఫొటోగ్రఫీ	వెండి అండ్ విన్నర్ ట్రోఫీ
టీ మురళీమోహన్	కానిస్టేబుల్	సీసీఎస్, హైదరాబాద్	వీడియోగ్రఫీ	వెండి
ఎస్ అనిల్‌కుమార్	సబ్‌ఇన్‌స్పెక్టర్	రాచకొండ	ఇన్వెస్టిగేటింగ్ ఫొటోగ్రఫీ	వెండి
బీ లక్ష్మీనారాయణరెడ్డి	ఇన్‌స్పెక్టర్	హైదరాబాద్	హ్యాండ్లింగ్, లిఫ్టింగ్, ప్యాకింగ్ ఈవెంట్	కాంస్యం
ఎండీ జావేద్‌పాషా	కానిస్టేబుల్	హైదరాబాద్	పరిశీలన విభాగం	కాంస్యం
జీ గణేశ్	కానిస్టేబుల్	హైదరాబాద్	కంప్యూటర్ అవగాహన	
పీ సంజీవరావు	హెడ్‌కానిస్టేబుల్	సీఐడీ	ఈవెంట్	కాంస్యం
అంజయ్య	కానిస్టేబుల్	మహబూబాబాద్	యాంటీ సబోటేజ్ రూమ్‌సెర్చ్	కాంస్యం
బీ లక్ష్మీనారాయణరెడ్డి	ఇన్‌స్పెక్టర్	హైదరాబాద్	ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్ష	కాంస్యం

ప్రతి జిల్లాలో డయాగ్నస్టిక్ హబ్

- ఉచితంగా 58 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- త్వరలో ఐపీఎంలో ట్రయల్‌రన్ ప్రారంభం
- అన్ని జిల్లా కేంద్ర దవాఖానల్లో ఏర్పాటుకు వైద్య, ఆరోగ్యశాఖ కసరత్తు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ జిల్లా కేంద్ర దవాఖానలో డయాగ్నస్టిక్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కసరత్తు చేస్తున్నది. ప్రతి జిల్లా కేంద్ర దవాఖానలో పేదలకు 58 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. తొలుత ట్రయల్‌రన్‌లో భాగంగా హైదరాబాద్ నారాయణగూడలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)లో మోడల్ డయాగ్నస్టిక్ హబ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నది. ఇక్కడ ఎదురయ్యే అనుభవాలను దృష్టిలోపెట్టుకొని అన్ని జిల్లా కేంద్ర దవాఖానల్లో వీటిని ఏర్పాటుచేస్తారు. డయాగ్నస్టిక్ హబ్‌లో.. టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా జ్వరాల నిర్ధరాణ, కాలేయం, మూత్రపిండాలు, థైరాయిడ్, కొలెస్ట్రాల్, రక్తంలో మూడు నెలల సగటు షుగర్ స్థాయిని నిర్ధారించడం తదితర 58 రకాల ఖరీదైన వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఉచితంగానే నిర్వహిస్తారు. ఇలా ప్రభుత్వ దవాఖానల్లో ఇన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించే విధానం దేశంలో ఇంతవరకు ఎక్కడా లేదు. ప్రజారోగ్యాన్ని దృష్టిలోపెట్టుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా సర్కార్ దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా సర్కారు దవాఖానల్లో అధునాతన వైద్య పరికరాల ఏర్పాటు, వాటి నిర్వహణను జాతీయ ఆరోగ్య మిషన్ విధివిధానాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌళిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎమ్మెస్ఐడీసీ) పర్యవేక్షిస్తున్నది. గత మూడేండ్లలో టీఎస్ఎమ్మెస్ఐడీసీ ద్వారా రూ.180 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన అధునాతన వైద్య పరీక్ష యంత్రాల నిర్వహణ బాధ్యతను ఫాబ్రె సింధూరి సంస్థకు అప్పగించారు.

నాణ్యమైన యంత్ర పరికరాల కొనుగోలు: ఆర్ వేణుగోపాల్‌రావు, టీఎస్ఎమ్మెస్ఐడీసీ ఎండీ

సర్కారు దవాఖానలకు అవసరమైన యంత్ర పరికరాలను నాణ్యతాప్రమాణాలతో కొనుగోలు చేశాం. గత మూడేండ్లలో రూ.180 కోట్లు విలువచేసే వైద్య పరికరాలను సమకూర్చాం. అన్ని వైద్య పరికరాలు మూడేండ్ల వారంటీతో కొనుగోలు చేసి, ఐదేండ్లపాటు వాటి నిర్వహణను ఫాబ్రె సింధూరి సంస్థ ద్వారా చేపడుతున్నాం. నేషనల్ హెల్త్ మిషన్ విధి విధానాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ దవాఖానల్లో వైద్య పరికరాల ఏర్పాటు.. నిర్వహణ కొనసాగిస్తున్నాం.

గోల్కొండను అభివృద్ధి చేయండి

- **ఆగాఖాన్‌ను కోరిన డిప్యూటీ సీఎం మహమూద్ అలీ**
- **సానుకూలంగా స్పందించిన ప్రిన్స్ ఆగాఖాన్**
- **గోల్కొండ కోట అభివృద్ధికి 400 కోట్ల వ్యయం!**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చార్ సౌ సాల్ (నాలుగు వందల సంవత్సరాల) కా షహర్ హైదరాబాద్‌లోని చారిత్రాత్మక గోల్కొండ కోట అభివృద్ధి చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్య మంత్రి మహమూద్ అలీ నగర పర్యటనకు వచ్చిన ప్రిన్స్ ఆగాఖాన్‌కు విజ్ఞప్తిచేశారు. ఇప్పటికే గోల్కొండ కోట సమీపంలో ఉన్న కులీ కుతుబ్‌షాహీ సమాధుల ప్రాంతాన్ని ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ (ఏకేడీఎన్) అభివృద్ధిచేస్తున్నది. అదే పద్ధతిలో గోల్కొండ కోటను కూడా అభివృద్ధిచేసే బాధ్యతలుతీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆయనకు సూచించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని మహమూద్ అలీ తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ తాజ్ హోటల్‌లో మంగళవారం రాత్రి డిప్యూటీ సీఎం మహమూద్ అలీ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో వెళ్లి ప్రిన్స్ ఆగాఖాన్‌ను కలిశారు. ప్రిన్స్ కరీం ఆగాఖాన్ నేతృత్వంలోని ఏకేడీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా ఖర్చుతో కుతుబ్‌షాహీ సమాధుల ప్రాంతాన్ని అద్భుత పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఐదేండ్లుగా ఈ పనులు సాగుతున్నాయని, మరో రెండేండ్లలో పూర్తవుతాయని పేర్కొన్నారు. దీనితోపాటే సెవన్‌టూంబ్స్‌ను ఆనుకుని ఉన్న చారిత్రాత్మక గోల్కొండ కోటను కూడా అభివృద్ధి చేయాలని ఆగాఖాన్‌ను డిప్యూటీ సీఎం కోరారు. టూంబ్స్‌కు వచ్చే పర్యాటకులు గోల్కొండ కోటను, అలాగే గోల్కొండకు వచ్చే పర్యాటకులు టూంబ్స్‌ను సందర్శించకుండా వెళ్లరని ఆగాఖాన్‌కు వివరించారు. గోల్కొండ కోట అభివృద్ధికి సుమారు రూ.400 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశాల్నుయని మహమూద్ అలీ చెప్పారు. ఇరాన్ అధ్యక్షుడు హుస్సేన్ రౌహానీ ఇటీవల హైదరాబాద్ పర్యటనకు వచ్చినప్పుడు కుతుబ్‌షాహీ టూంబ్స్‌ను సందర్శించారని తెలిపారు. ఏకేడీఎన్ తరఫున ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నారని రౌహానీకి తాము వివరించామని చెప్పారు. సానుకూలంగా స్పందించిన ఆగాఖాన్.. ఏకేడీఎన్ బృందాన్ని గోల్కొండ కోటకు పంపించి, అక్కడ చేపట్టాల్సిన పనులపై ప్రాథమిక నివేదిక తెప్పించుకుంటామని డిప్యూటీ సీఎంకు హామీ ఇచ్చారు. నగరంలో ఆగాఖాన్ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న, చేపట్టాల్సి ఉన్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపైనా వారు చర్చించారు. డిప్యూటీ సీఎం వెంట ఆగాఖాన్‌ను కలిసినవారిలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, జీహెచ్‌ఎంసీ అధికారులు ఉన్నారు.

లండన్‌కు బయలుదేరి వెళ్లిన ప్రిన్స్ ఆగాఖాన్

మూడ్రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చిన ముస్లింలలోని షియా ఇస్మాయిలీ తెగకు చెందిన ఆధ్యాత్మిక నేత, ప్రిన్స్ కరీం ఆగాఖాన్ బుధవారం లండన్‌కు తిరిగి వెళ్లారు. మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో బేగంపేట విమానాశ్రయంలో ఆయనకు ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ వీడ్కోలు పలికారు. చార్మినార్ నమూనా జ్ఞాపికను ఆయనకు అందజేశారు.



బుధవారం బేగంపేట ఎయిర్‌పోర్టులో ఆగాఖాన్‌కు జ్ఞాపికను బహూకరించి వీడ్కోలు పలుకుతున్న ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ

సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

- **యువ ఐపీఎస్‌లకు ఉప రాష్ట్రపతి దిశానిర్దేశం**



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ తీవ్రవాదమేనని, దీన్ని అణచివేసేందుకు సిద్ధం కావాలని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు యువ ఐపీఎస్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన హైదరాబాద్ శివరాంపల్లిలోని సర్దార్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. దేశ అంతర్గత భద్రతలో పోలీసుల పాత్ర కీలకమైందని చెప్పారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల విషయంలో మరింత సానుభూతితో స్పందించాలని సూచించారు.

గ్రూప్-2 ఓఎంఆర్ షీట్ల పరిశీలనకు న్యాయవాదుల కమిటీ

- **వైట్‌నర్ ఆరోపణల నేపథ్యంలో ఏర్పాటు చేసిన హైకోర్టు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గ్రూప్-2 పరీక్షల్లో వైట్‌నర్ ఉపయోగంపై తలెత్తిన వివాదంలో బుధవారం ఉమ్మడి హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీచేసింది. గ్రూప్-2 రాత పరీక్షల్లో మొదటి 5 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. పరిశీలన కోసం హైకోర్టుకు చెందిన ముగ్గురు న్యాయవాదులతో కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని న్యాయవాదుల కమిటీని జస్టిస్ పొనుగోటి నవీన్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. కమిటీ పరిశీలన కోసం రికార్డులను, షీట్లను అందుబాటులో ఉంచాలని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కి ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది.

మహిళలపై నేరాలకు అడ్డుకట్ట వేయాలి



మహిళా కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రామకృష్ణారావు

- **త్వరలో పోలీసుశాఖలో మరో భారీ నోటిఫికేషన్**
- **ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కే రామకృష్ణారావు**
- **ఘనంగా మహిళా కానిస్టేబుళ్ల పాసింగ్‌ఔట్ పరేడ్**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహిళలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేయడంలో మహిళా పోలీసులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు పేర్కొన్నారు. పోలీస్‌శాఖకు సంబంధించి త్వరలోనే మరో భారీ నోటిఫికేషన్ రానున్నట్టు ఆయన వెల్లడించారు. రాజేంద్రనగర్‌లోని ఆర్బీవీఆర్‌ఆర్ తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో నిర్వహించిన పాసింగ్‌ఔట్ పరేడ్‌కు రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై.. 224 మంది మహిళా కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి చొరవతోనే కానిస్టేబుళ్ల నియామకంలో 33శాతం మహిళా అభ్యర్థులకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కానిస్టేబుళ్లకు ట్రోఫీలను అందజేశారు.

అశ్లీల వెబ్‌సైట్ నిర్వాహకుడి అరెస్టు

- **సినీతారల ఫొటోలు మార్ఫింగ్‌చేసి అప్‌లోడ్**
- **'మా' ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన సీఐడీ పోలీసులు**
- **గతంలో ఐదుగురి అరెస్టు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సినీతారల ఫొటోలు మార్ఫింగ్ చేసి, అశ్లీల రాతలతో వెబ్‌సైట్ నిర్వహిస్తున్న ఓ యువకుడ్ని బుధవారం సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(మా) ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసిన పోలీసులు 'ది కామపిశాచి.బ్లాగ్‌స్పాట్.ఇన్' వెబ్‌సైట్ నిర్వహిస్తున్న రుద్రవరపు రఘువరన్‌ను అరెస్టు చేశారు. ఇదే కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్టు చేశామని, రఘువరన్‌తో ఆ సంఖ్య ఆరుకు పెరిగిందని సీఐడీ అడిషనల్ డీజీ గోవింద్‌సింగ్ తెలిపారు. బోడుప్పల్ ప్రాంతానికి చెందిన రఘువరన్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తెలుగు హీరోయిన్ల ఫొటోలను మార్ఫింగ్ చేసి వారిపై అశ్లీల రాతలతో వెబ్‌సైట్‌లో పోస్టు చేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో తన పోస్టులకు ఎక్కువ హిట్స్ వస్తే ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఉద్దేశంతో ఈవిధంగా చేస్తున్నట్టు నిందితుడు అంగీకరించాడని సీఐడీ పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి ఒక ల్యాప్‌టాప్, ఒక సెల్‌ఫోన్, రెండు సిమ్‌కార్డులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సినీతారల ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా పలు వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలంటూ 'మా' ప్రతినిధులు 2017 సెప్టెంబర్ 21న ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై దర్యాప్తు చేపట్టిన సీఐడీ పోలీసులు 21 అశ్లీలవెబ్‌సైట్లను గుర్తించారు. 2017 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు బెంగళూరు అహ్మదాబాద్, ఉత్తర్‌ప్రదేశ్‌లో వాటి నిర్వాహకులు ఐదుగుర్ని అరెస్టుచేశారు. తాజాగా, బుధవారం మేడ్చల్ జిల్లా బోడుప్పల్ నివాసి రుద్రవరపు రఘువరన్ (26)ను అరెస్టు చేశారు.



రుద్రవరపు రఘువరన్ (ఫైల్)

రెండు తలలపాముకు రూ.4 కోట్లు!

- **ఆన్‌లైన్‌లో విద్యార్థులు, ఉద్యోగులకు వల**
- **మాయమాటలు నమ్మి 50 వేలు డిపాజిట్**
- **ఇద్దరిని అరెస్ట్‌చేసిన అటవీ అధికారులు**

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రెండుతలలపాము శరీరంలో ఉండే ఇరేడియంలో అతీత శక్తులున్నాయని.. ఆ పాములు భూగర్భంలో గుప్తనిధులను పసిగడుతాయని నమ్మిన కొందరు వాటిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తుండగా.. వారి అమాయకత్వాన్ని ఆసరగా మలుచుకొంటున్న ముఠాలు వాటితో కోట్లు సంపాదించొచ్చని చెప్తూ బురిడీకొట్టిస్తున్నాయి. రెండు తలలపాములను కొంటామని ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలుచేస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇటీవల రెండుతలల పామును వేటాడుతున్న నాలుగు ముఠాలు పట్టుబడగా తాజాగా మరో ముఠాను అటవీశాఖ అధికారులు బుధవారం పట్టుకొని వారి నుంచి పాములను స్వాధీనం చేసుకున్నారు. తమ వద్ద రెండు తలల పాములున్నాయని, వాటిని అమ్ముతామని వికారాబాద్ జిల్లా తాండూరు మండలం శాంతినగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్, రమేశ్ ఆన్‌లైన్‌లో పోస్టుపెట్టారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి రాజారమణారెడ్డి బృందం రంగంలోకి దిగి పాము కొంటామని బేరం పెట్టారు. శంషాబాద్‌లోని ఒక లాడ్జికి రమ్మని చెప్పి ముఠాసభ్యులను పట్టుకొని పాములను స్వాధీనం చేసుకున్నారు. రెండు తలల పాముల వల్ల కాసులు కురుస్తాయన్న ఆశతో విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు కూడా వాటి కోసం వేటాడుతున్నారు. నాలుగున్నర కిలోల రెండు తలల పామును కొనడానికి సిద్ధంగా ఉన్నామని కొందరు ఆన్‌లైన్‌లో చెప్తారు. ఓఎల్‌ఎక్స్ డాట్ కామ్, రైస్‌పుల్లర్ డాట్ కామ్ వంటి వేదికల్లో 'డబుల్ ఇంజిన్' అనే కోడ్ నేమ్‌తో ప్రచారం చేస్తారు. పాము ఉందని ఫోన్ చేస్తే వారి వద్దకు తమ ఏజెంట్లను ముఠా నాయకులు పంపిస్తారు. పరీక్షల కోసం కొన్ని యంత్రాలను తీసుకొని విమానంలో రావాల్సి ఉంటుందని, దానికి కొంత ఖర్చవుతుందంటారు. తమ ఖాతాలో రూ.50 వేలు జమచేస్తే తాము పరీక్షలు జరుపుతామంటారు. నాలుగు కిలోలకుపైగా తూగితే రూ.నాలుగు కోట్లకు కొనుగోలు చేసే అవకాశం ఉన్నదని ఆశ చూపుతారు. దీంతో ఆ వ్యక్తి అడిగిన మొత్తాన్ని డిపాజిట్ చేస్తారు. తీరా బరువు పెరుగలేదని, పెరిగితే ఫోన్ చేయాలని చెప్పి వెళ్లిపోతారు. ఆ పాము మూడున్నర కిలోల కంటే బరువు పెరుగదు.



ఆన్‌లైన్‌లో రెండుతలల పామును అమ్మకానికి పెట్టి పోలీసులకు చిక్కిన నిందితులు

ముగిసిన పురుషోత్తంరెడ్డి ఏసీబీ కస్టడీ

- **మరోవారం కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరిన ఏసీబీ**
- **శ్రీనివాస్‌రెడ్డిని వారం కస్టడీ కోరుతూ పిటిషన్**
- **రెండు పిటిషన్లపై నేడు వాదనలు**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో 'హెచ్‌ఎండీఏ' పురుషోత్తంరెడ్డి ఆరురోజుల ఏసీబీ కస్టడీ బుధవారంతో ముగిసింది. అతడిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. విచారణకు పురుషోత్తంరెడ్డి సహకరించలేదని, మరో వారంరోజుల కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు మరోసారి బుధవారం కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దీనిపై గురువారం వాదనలు జరుగనున్నాయి. ఈ కేసులో బినామీ చట్టం కింద అరెస్టయి జైలులో ఉన్న శ్రీనివాస్‌రెడ్డి ఏసీబీ కస్టడీ పిటిషన్‌పై కూడా గురువారం వాదనలు జరుగనున్నాయి. ఏసీబీ అధికారులు కేసు నమోదుచేసిన విషయాన్ని సోదాలకు ముందుగానే పసిగట్టిన పురుషోత్తంరెడ్డి అన్ని జాగ్రత్తలు తీసుకొని పథకం ప్రకారం ఇండ్లు, బ్యాంకు లాకర్లు జనవరిలోనే ఖాళీ చేసినట్టు తెలిసింది. పురుషోత్తంరెడ్డి కుటుంబసభ్యుల బ్యాంకు లాకర్లు పరిశీలించినా లాభం లేకపోయింది. నిందితులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నట్టు అధికారులు గుర్తించి, తమ వద్ద ఉన్న ఆధారాలతో కూపీ లాగే ప్రయత్నం చేస్తున్నారు.

యూనక్‌చట్టం 1329ఎఫ్‌పై పునరాలోచించండి

- **వందేండ్ల పూర్వంనాటి చట్టంపై ఉమ్మడి హైకోర్టు**
- **పూర్తి వివరాలు తెలుపాలని ప్రభుత్వానికి ఆదేశం**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భారత రాజ్యాంగం ఏర్పడక ముందే 1919లో అమల్లోకి వచ్చిన తెలంగాణ రాష్ట్ర యూనక్‌చట్టం 1329 ఎఫ్‌పై పునరాలోచన చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు సూచించింది. హిజ్రాలను అసాంఘికశక్తులుగా చూపుతున్న ఈ చట్టంలోని కొన్ని సెక్షన్లు అభ్యంతరకరంగా ఉన్న నేపథ్యంలో చట్టం అమలు విషయంపై ఆలోచించి తమకు వివరాలు తెలియజేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ విజయలక్ష్మి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఆదేశాలు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలంటూ రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హిజ్రాల వివరాల రిజిస్ట్రేషన్‌తోపాటు, బహిరంగప్రదేశాల్లో నాట్యంచేసినా, కౌమార, యవ్వనదశలో ఉన్న బాలురను తమ సమక్షంలో ఉంచుకున్నా హిజ్రాల అరెస్ట్‌కు అవకాశం కల్పిస్తూ యూనక్‌చట్టంలో ఉన్న నిబంధనలను సవాల్ చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. రాజ్యాంగం అమల్లోకి రాకముందు నుంచి కొనసాగుతున్న ఈ చట్టానికి రాజ్యాంగ బద్ధత లేదని సవాల్ చేస్తూ హిజ్రాల సామాజిక హక్కులకోసం పోరాటం చేస్తున్న వీ వసంత మోగ్లీతోపాటు మరోఇద్దరు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

5 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- **ఏపీ శాసనసభాపతి కోడెల వెల్లడి**

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ అసెంబ్లీ సమావేశాలు మార్చి 5 నుంచి జరుగుతాయని ఏపీ శాసనసభాపతి కోడెల శివప్రసాదరావు తెలిపారు. అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం ఆయన భద్రతా ఏర్పాట్లపై మండలి చైర్మన్ ఫరూక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని వైసీపీ ఎమ్మెల్యేలను కోరానని స్పీకర్ తెలిపారు. వైసీపీ ఎమ్మెల్యేలు ఈ సమావేశాలకు వస్తారనుకుంటున్నానని చెప్పారు. అయితే ఇప్పటివరకు వైసీపీ నేతలు అసెంబ్లీకి హాజరు అంశంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

సెన్సెక్స్	నిఫ్టీ
34,184	10,492
↘ 162	↘ 61

ముడి చమురు (బ్రెంట్) ↘ 65.57 డాలర్లు

బంగారం ధరలు

ముంబై (రూ.లలో)	
24 క్యారెట్లు	30,535
22 క్యారెట్లు	30,385
వెండి (కిలో)	38,210

విదేశీ మారకం

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలర్	59.22	68.67
బహ్రెయిన్ దినార్	160.37	183.78
కువైట్ దినార్	179.61	223.69
సౌదీ రియాల్	15.74	18.67
యూఏఈ దిర్హామ్	16.12	18.84

చికెన్ ధరలు

	(రూ.లలో)
ఫారం ధర	72.00
రిటైల్ లైవ్	94.00
డ్రెస్డ్	136.00
స్కిన్‌లెస్	155.00

నెక్ (వంద గుడ్లకు)

	(రూ.లలో)
హైదరాబాద్	345-00
రంగారెడ్డి	345-00
మెదక్	345-00
కరీంనగర్	347-00
వరంగల్	347-00
రిటైల్ ప్రైస్	4-05

ఇదీ.. 'ఐఎన్‌ఎక్స్' కేసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: ఐఎన్‌ఎక్స్ మీడియా వ్యవహారం మరోసారి వార్తల్లోకెక్కింది. మాజీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పీ చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని బుధవారం సీబీఐ అరెస్టు చేసింది. లండన్ నుంచి ఉదయం చెన్నై చేరుకున్న ఆయన్ను ఈ మనీ లాండరింగ్ కేసు దర్యాప్తునకు సహకరించడం లేదన్న దానిపై కేంద్ర దర్యాప్తు సంస్థ విమానాశ్రయంలోనే అదుపులోకి తీసుకున్నది. ఎయిర్‌పోర్టులోనే కార్తీని ప్రశ్నించిన అధికారులు.. అక్కడి నుంచి ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయానికి తీసుకువచ్చారు.

ఏమిటీ కేసు?

కార్తీతో సంబంధమున్న కొన్ని సంస్థలు ఐఎన్‌ఎక్స్ మీడియాలో రూ.305 కోట్ల అక్రమ పెట్టుబడుల కోసం ఎఫ్‌ఐపీబీపై ఒత్తిడి తీసుకువచ్చాయన్నది సీబీఐ ఆరోపణ. దీంతో కార్తీతోపాటు ఐఎన్‌ఎక్స్ మీడియా, మరో ఎనిమిది మందిని, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కొందరు అధికారులపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. 2007లో ఇది జరుగగా, ఆ సమయంలో కార్తీ తండ్రి చిదంబరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నారు.



ఎఫ్‌ఐపీబీ అంటే?

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే ఓ జాతీయ సంస్థే విదేశీ పెట్టుబడుల ప్రగతి విభాగం (ఎఫ్‌ఐపీబీ). కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం పరిధిలో ఇది పనిచేస్తుంది. దేశంలోకి ఆటోమేటిక్ మార్గంలో కాకుండా వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రతిపాదనల్ని పరిశీలించి, ప్రధాన మంత్రి నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్‌కు సిఫార్సు చేస్తుంది. క్యాబినెట్ ఆమోదిస్తే ఆ ఎఫ్‌డీఐకి ఇక మార్గం సుగమమైనట్లే.


అసలేం జరిగింది?

పెట్టుబడులకు సంబంధించి ఎఫ్‌ఐపీబీ ఆమోదం కోసం ఐఎన్‌ఎక్స్ మీడియా నుంచి ఓ దరఖాస్తును 2007 మార్చి 15న కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అందుకున్నది. ఈ క్రమంలోనే అదే ఏడాది మే 18న జరిగిన ఎఫ్‌ఐపీబీ సమావేశంలో ఐఎన్‌ఎక్స్ మీడియా ప్రతిపాదన పరిశీలనకు వచ్చింది. అయినప్పటికీ ఐఎన్‌ఎక్స్ న్యూస్‌లో ఐఎన్‌ఎక్స్ మీడియా పరోక్ష విదేశీ పెట్టుబడి ప్రతిపాదనను ఎఫ్‌ఐపీబీ అంగీకరించలేదు. అయితే ఇందులో ఉన్న రూ.4.62 కోట్ల ఎఫ్‌డీఐని మాత్రమే అనుమతించింది. విదేశీ మదుపరులకు ఒక్కో షేర్‌ను రూ.800లకుపైగా ధరకు జారీ చేసుకోవచ్చని సూచించింది. కానీ సీబీఐ ఎఫ్‌ఐఆర్ ప్రకారం ఎఫ్‌ఐపీబీ ఆమోదానికి విరుద్ధంగా ఐఎన్‌ఎక్స్ మీడియా ముందుకెళ్లింది. ఉద్దేశపూర్వకంగానే నిబంధనల్ని ఉల్లంఘిస్తూ.. ఐఎన్‌ఎక్స్ న్యూస్‌లో 26 శాతం దాకా పరోక్ష విదేశీ పెట్టుబడుల్ని స్వీకరించింది. దీంతో ఐఎన్‌ఎక్స్ మీడియాకు రూ.305 కోట్లకుపైగా నిధులు అందాయి. దీనంతటికీ కారణం కార్తీ పలుకుబడి కారణంగా కొందరు అధికారులు నిబంధనల్ని ఉల్లంఘించి పనిచేయడమేనని సీబీఐ ఆరోపిస్తున్నది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయాలన్న రెవిన్యూ శాఖ విజ్ఞప్తినీ సదరు అధికారులు పట్టించుకోలేదని సీబీఐ చెబుతున్నది.

కార్తీ పాత్రేమిటి?

సీబీఐ వివరాల ప్రకారం చెస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రమోటరైన కార్తీతో కలిసి ఐఎన్‌ఎక్స్ మీడియా నేరపూరిత కుట్ర చేసింది. అప్పటి కేంద్ర ఆర్థిక మంత్రి చిదంబరం.. కార్తీ తండ్రి కావడంతో ఎఫ్‌ఐపీబీ, ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులను లోబర్చుకుని, తమకు కావాల్సిన ప్రయోజనాన్ని పొందింది. ఇందుకు ప్రతిఫలంగా క్విడ్ ప్రోకో (నీకిది-నాకది) ఆధారంగా కార్తీకి ఐఎన్‌ఎక్స్ మీడియా చెల్లింపులు జరిపింది. చెస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లు వేదికగా ఐఎన్‌ఎక్స్ గ్రూప్‌నకు, కార్తీకి మధ్య లావాదేవీలు జరిగాయి. వీటికి ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుకూలంగా పావులు కదిపింది. దీంతో అప్పటి ఆర్థిక మంత్రి చిదంబరంపైనా సీబీఐ దృష్టి పెట్టింది.

మరో రుణ ఎగవేత!



చేతులెత్తేసిన శ్రీ లక్ష్మి కోట్సిన్

16 బ్యాంకులకు రూ.3,972 కోట్ల బకాయి

లక్నో, ఫిబ్రవరి 28 : దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఓవైపు మోసాలు, మరోవైపు రుణాల ఎగవేతలు వరుసగా వెలుగుచూస్తున్నాయి. కాన్పూర్‌కు చెందిన రొటోమాక్ పెన్స్ కుంభకోణం మరువకముందే.. అక్కడికే చెందిన మరో సంస్థ 16 బ్యాంకులకు ఏకంగా రూ.3,972 కోట్ల రుణాలను ఎగవేసిన వ్యవహారం తెరపైకి వచ్చింది. శ్రీ లక్ష్మి కోట్సిన్ ప్రైవేట్ లిమిటెడ్.. సెంట్రల్ బ్యాంక్ నేతృత్వంలోని 16 బ్యాంకుల కూటమి వద్ద ఈ రుణాలను తీసుకోగా, వీటి ఎగవేతకు పాల్పడిందన్న ఆరోపణలను ఆ సంస్థ ఎదుర్కొంటున్నది. కాన్పూర్‌లోని జీటీ రోడ్డులోగల కృష్ణాపురం వద్ద శ్రీ లక్ష్మి కోట్సిన్ ప్రధాన కార్యాలయం ఉన్నది. ఈ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎంపీ అగర్వాల్. టెక్స్‌టైల్స్‌తోపాటు ఆటోమొబైల్ బ్లాస్ట్ ప్రూఫ్‌లనూ ఈ కంపెనీ తయారు చేస్తుంది. కాగా, రుణాల వసూళ్లలో భాగంగా సదరు సంస్థ ఆస్తుల వేలాన్ని సెంట్రల్ బ్యాంక్ ఇప్పటికే ప్రారంభించింది. అయితే బ్యాలెన్స్ షీట్ ప్రకారం సంస్థ ఆస్తులు రూ.1,495 కోట్లుగానే ఉన్నాయి. వివిధ బ్యాంకుల్లో సంస్థ డిపాజిట్లు రూ.2.54 కోట్లకే పరిమితమయ్యాయి. సంస్థ నిర్వహణ వ్యయం రూ.577 కోట్లుగా, ఆదాయం రూ.311 కోట్లుగా ఉన్నది. అయినప్పటికీ పాత బకాయిల్ని తీర్చడం కోసం కొత్త రుణాల్ని ఇచ్చిన బ్యాంకులకు.. శ్రీ లక్ష్మి కోట్సిన్ చివరకు అప్పుల కుప్పగానే మిగిలింది. ఈ సంస్థ దాదాపు రూ.1,646.12 కోట్ల నష్టాల్లో ఉన్నట్లు సమాచారం. ఫలితంగా బ్యాంకులకిప్పుడు తమ బకాయిల వసూలు తలకు మించిన భారంగా పరిణమించింది. శ్రీ లక్ష్మి కోట్సిన్ దీర్ఘకాలిక రుణం రూ.2,406 కోట్లుగా, స్వల్పకాలిక రుణం దాదాపు రూ.937 కోట్లుగా ఉన్నది. వడ్డీతో కలిపి మొత్తం రుణాల విలువ రూ.3,972 కోట్లకు చేరగా, వీటి వసూలుకు కంపెనీకి చెందిన నాలుగు యూనిట్లను బ్యాంకులు అమ్మేశాయి కూడా. అవి కూడా మూతబడి ఉన్నవే కావడం గమనార్హం. ఇదిలావుంటే ఈ సంస్థపై తొలుత సెంట్రల్ బ్యాంక్.. డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డీఆర్‌టీ)ను ఆశ్రయించగా, ఖాయిలా పరిశ్రమగా రాజీ పరిశీలన కోసం 2016 నవంబర్ 30న ఈ కేసు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు బదిలీ కావడం గమనార్హం. శ్రీ లక్ష్మి కోట్సిన్‌కు రుణాలిచ్చిన బ్యాంకుల్లో సెంట్రల్ బ్యాంక్‌తోపాటు సిండికేట్, యూనియన్ బ్యాంక్, కెనరా, బ్యాంక్ ఆఫ్ బరోడా, పీఎన్‌బీ, ఇండియన్ బ్యాంక్, ఎస్‌బీఐ, ఎగ్జిమ్ బ్యాంక్, ఓబీసీ, ఐడీబీఐ, విజయా, కార్పొరేషన్, సారస్వత్, ఆంధ్రా బ్యాంకులున్నాయి. ఎడిల్‌వీస్ ఎస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కూడా శ్రీ లక్ష్మి కోట్సిన్‌కు రుణమిచ్చింది.

కార్పొరేషన్ బ్యాంకుకు ఆటో డీలర్ బురిడి

మరో ప్రభుత్వరంగ బ్యాంకును బురిడి కొట్టించి రుణం తీసుకున్న తాజా సంఘటన వెలుగులోకి వచ్చింది. జంషెడ్‌పూర్‌కు చెందిన ఆటో డీలర్ రూ.6.77 కోట్ల మోసం చేసినట్లు ప్రభుత్వ రంగ సంస్థ కార్పొరేషన్ బ్యాంకు గుర్తించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ ధర్యాప్తు సంస్థ సీబీఐకి సమాచారం అందించింది. దీంతో రంగంలోకి దిగిన సీబీఐ..రామ్‌నందీ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డీలర్, కంపెనీ డైరెక్టర్లు అఖౌరీ గోపాల్, సంజీతా, నిషాంత్, నితేష్‌లపై బుధవారం సీబీఐ కేసును దాఖలు చేసింది. 2014లో పాట్నాలో షోరూం, ఇతర సేవలు అందించడానికి బ్యాంక్ జోనల్ కార్యాలయం నుంచి రూ.10 కోట్ల మేర రుణాన్ని తీసుకున్నది.

కెనరా బ్యాంక్‌కు 515కోట్ల టోకరా

- ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్‌పై సీబీఐకి బ్యాంకు ఫిర్యాదు
- నిందితుల్లో బెంగాల్ సీఎం మమతా సన్నిహితుడు



శివాజీ పంజ

కోల్‌కతా: పీఎన్‌బీ కుంభకోణం నేపథ్యంలో కోల్‌కతాకు చెందిన ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్‌పై రూ.515.15 కోట్ల మోసం కేసు నమోదైంది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ కెనరా బ్యాంక్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసును సీబీఐ నమోదు చేయగా, నిందితుల్లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సన్నిహితుడు కూడా ఉండటం గమనార్హం. ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉనికినే మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) ప్రశ్నార్థకం చేస్తున్న నేపథ్యంలో రూ.50 కోట్లు అంతకంటే ఎక్కువ బకాయిలపై విచారణ జరిపి, మోసాలుంటే సీబీఐ వద్దకు వెళ్లాలని అన్ని బ్యాంకర్లకు ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టమైన సూచనలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్‌పై కెనరా బ్యాంక్.. సీబీఐ వద్దకు వెళ్లింది. బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డీవీ ప్రసాద్ రావు ఫిబ్రవరి 26న ఫిర్యాదు చేశారు. సంస్థ డైరెక్టర్లు శివాజీ పంజ, కౌస్తవ్ రే, వినయ్ బఫ్నాలతోపాటు ఆర్థిక విభాగం ఉపాధ్యక్షుడు దేబ్‌నాథ్ పాల్ పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో సీబీఐ పేర్కొన్నది. వీరంతా కెనరా, మరో 9 ఇతర బ్యాంకుల కూటమిని రూ.515.15 కోట్ల మేర మోసం చేశారని ప్రసాద్ రావు సీబీఐకి చెప్పారు. ఇందులో కోల్‌కతా వ్యాపారి శివాజీ పంజాకు.. బెంగాల్ సీఎం మమతాతో సన్నిహిత సంబంధాలున్నాయి. కొందరు బ్యాంక్ అధికారులతో కుమ్మక్కై ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్ నేరపూరిత కుట్రకు పాల్పడిందని సీబీఐకి చేసిన ఫిర్యాదులో కెనరా పేర్కొన్నది. లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ)ల సాయంతో మోసం చేశారన్నది. కాగా, ఈ కేసులో బుధవారం కోల్‌కతాలోని ఆరుచోట్ల సీబీఐ సోదాలను కూడా నిర్వహించింది. ఐడీబీఐ బ్యాంక్‌ను మోసం చేసిన కేసులో 2015లోనే ఆర్‌పీ ఇన్ఫోసిస్టమ్స్‌పై సీబీఐ కేసు నమోదు చేయడం గమనార్హం.

సీబీఐ విచారణకు నీరవ్ ససేమిరా

పీఎన్‌బీ కుంభకోణం కేసులో సీబీఐ దర్యాప్తునకు సహకరించేందుకు నీరవ్ మోదీ ససేమిరా అంటున్నాడు. వచ్చే వారం విచారణకు హాజరు కావాలంటూ బుధవారం ఓ ఈ-మెయిల్ ద్వారా నీరవ్‌కు సీబీఐ సమన్లు జారీ చేసింది. దీంతో తనకు విదేశాల్లో వ్యాపార కార్యకలాపాలున్నాయని, అందులో తలమునకలై ఉన్నందున రాలేనంటూ నీరవ్ సమాధానమిచ్చినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఈ కేసుతో సంబంధమున్న పీఎన్‌బీ ఇంటర్నల్ చీఫ్ ఆడిటర్ ఎంకే శర్మను సీబీఐ అరెస్టు చేసింది. బ్యాంక్ ఆడిటర్లను అరెస్టు చేయడం ఈ కేసులో ఇదే తొలిసారి. మరోవైపు ఆదాయం పన్ను శాఖ నీరవ్ మోదీ, ఆయన మేనమామ మెహుల్ చోక్సీలపై లుక్ అవుట్ నోటీసును జారీ చేసింది. నీరవ్‌కు చెందిన రూ.70 కోట్ల విలువైన నాలుగు ఆస్తులనూ జప్తు చేసింది.

ఎస్‌బీఐ డిపాజిట్లపై వడ్డీరేట్ల పెంపు

ముంబై, ఫిబ్రవరి 28: బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)..బుధవారం నుంచి అమలులోకి వచ్చేలా రిటైల్, బల్క్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 0.75 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కోటి రూపాయల లోపు రిటైల్ డిపాజిట్లపై వడ్డీరేటు అరశాతం వరకు పెంచింది. అలాగే ఏడాది నుంచి రెండేండ్లలోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును 0.15 శాతం పెంచడంతో 6.40 శాతానికి చేరుకుంది. 2-10 ఏండ్లలోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీని అరశాతం పెంచడంతో ఆరు శాతం నుంచి 6.50 శాతానికి చేరుకున్నట్లు బ్యాంక్ వెల్లడించింది. వీటితోపాటు రూ.1 కోటి నుంచి రూ.10 కోట్ల లోపు బల్క్‌డిపాజిట్లపై చెల్లించే వడ్డీరేటును సైతం 6.25 శాతం నుంచి 6.75 శాతానికి సవరించింది.

హైదరాబాద్ నుంచి మరిన్ని ఇండిగో సేవలు

ముంబై, ఫిబ్రవరి 28: ప్రాంతీయంగా విమాన సర్వీసులను పెంచుకోవడంలో భాగంగా హైదరాబాద్-నాగపూర్-హైదరాబాద్‌తోపాటు హైదరాబాద్-మంగళూరు-హైదరాబాద్‌ల మధ్య విమాన సర్వీసులను నడుపనున్నట్లు ఇండిగో ప్రకటించింది. మార్చి 25 నుంచి అందుబాటులోకి రానున్న ఈ సర్వీసులకోసం సంస్థ ఏడు నూతన ఏటీఆర్‌లను కొనుగోలు చేసింది.

రిలయన్స్ ట్రెండ్ ప్రచారకర్తగా రాణా




హైదరాబాద్, ఫిబ్రవరి 28: రిలయన్స్‌కు చెందిన దుస్తుల విక్రయ సంస్థ ట్రెండ్ ప్రచారకర్తగా ప్రముఖ నటుడు దగ్గుబాటి రాణా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కంపెనీ మార్కెటింగ్ హెడ్ కపిల్ కట్టర్ మాట్లాడుతూ..మరింత మంది ఫ్యాషన్ ప్రియులకు చేరువకావాలనే ఉద్దేశంతో 'గెట్ దెమ్ టాకింగ్' పేరుతో నిర్వహిస్తున్న ప్రచారానికి రాణాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు చెప్పారు.

ప్రగతివైపు పరుగులు

క్యూ3లో వృద్ధి 7.2 శాతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ దెబ్బకు ఢీలా పడిన దేశ ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిలోపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను దేశ వృద్ధిరేటు 7.2 శాతంగా నమోదైంది. వ్యవసాయం, తయారీ, నిర్మాణ, సేవల రంగాలు వృద్ధిబాట పట్టడంతో జీడీపీ ఐదు త్రైమాసికాల గరిష్ఠ స్థాయికి చేరుకోవడానికి దోహదపడిందని కేంద్ర గణాంకాల శాఖ వెల్లడించింది. దీంతో భారత్ తిరిగి ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని సాధిస్తున్న దేశంగా అవతరించిందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం విషయానికి వస్తే వృద్ధి 6.6 శాతంగా నమోదవనున్నదని వెల్లడించింది. 2016-17లో ఇది 7.1 శాతంగా ఉన్నది. గతంలో 6.5 శాతంగా ఉంటుందని అంచనా వేసిన విషయం తెలిసిందే. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన వృద్ధిరేటును 6.3 శాతం నుంచి 6.5 శాతానికి సవరించింది. గతంలో 2011-12 సంవత్సరం ఆధారంగా జీడీపీ గణాంకాలను విడుదల చేయనున్న కేంద్రం దీనిని ఇటీవల 2017-18కి మార్చివేసింది. నూతన గణాంకాల ప్రకారం దేశ జీడీపీ విలువ రూ.130.04 లక్షల కోట్లుగా ఉన్నది. తయారీ, నిర్మాణ రంగాలు మళ్లీ ఎగువముఖం పట్టడంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నడానికి ఇవే సంకేతాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ సరైన దిశలోనే ప్రయాణిస్తున్నదని, గతంలో కేంద్రం తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ప్రధాని ఆర్థిక సలహా కమిటీ చైర్మన్ బిబేక్ దేబ్రాయ్ తెలిపారు.

జీడీపీ | త్రైమాసికాల వారీగా వృద్ధి రేటు ముఖచిత్రం



వచ్చే త్రైమాసికాల్లో వృద్ధి మరింత పరుగులు పెట్టే అవకాశం ఉన్నదన్నారు. గడిచిన త్రైమాసికంలో తయారీ రంగంలో వృద్ధి 8.9 శాతంగా నమోదవగా, వ్యవసాయ రంగంలో 4.1 శాతం, నిర్మాణ రంగంలో 6.8 శాతం, ఆర్థిక సేవలు 6.7 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేసుకున్నాయి.

కీలక రంగాల్లో ఉత్తేజం

జనవరిలో 6.7 శాతం వృద్ధి

కీలక రంగాల్లో ఉత్తేజం నెలకొన్నది. జనవరి నెలకుగాను ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధి ఏడాది ప్రాతిపదికన 6.7 శాతంగా నమోదైందని కేంద్రం వెల్లడించింది. పెట్రోలియం, సిమెంట్, స్టీల్, బొగ్గు రంగాలు మెరుగైన పనితీరు కనబరుచడం ఇందుకు దోహదం చేసింది. డిసెంబర్‌లో 4.2 శాతంగా నమోదైన వృద్ధి, నవంబర్‌లో 7.4 శాతంగా ఉంది. గడిచిన నెలలో పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తుల్లో వృద్ధి 11 శాతం నమోదవగా, సిమెంట్ రంగంలో 20.7 శాతం, విద్యుత్ 8.2 శాతం, బొగ్గు విభాగంలో 3 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేసుకున్నాయి. కానీ క్రూడాయిల్ ఉత్పత్తిలో మాత్రం 3.2 శాతంగా తగ్గగా, ఎరువులు 1.6 శాతం, సహజ వాయువు 1 శాతం వరకు పడిపోయాయి. ఏప్రిల్ నుంచి జనవరి మధ్యకాలంలో కీలక రంగాల వృద్ధి సరాసరిగా 4.3 శాతంగా ఉన్నది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన 5.1 శాతంతో పోలిస్తే మాత్రం తగ్గింది.

ఉచితంగా డీటీహెచ్ సేవలు

- ప్రకటించిన రిలయన్స్ బిగ్ టీవీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: అనిల్ అంబానీకి చెందిన డైరెక్ట్-టూ-హోమ్(డీటీహెచ్) సేవల సంస్థ రిలయన్స్ బిగ్ టీవీ ఉచితంగా సేవలు అందించనున్నట్లు ప్రకటించింది. 500 వరకు చానెళ్లను ఐదేండ్లపాటు అందించనున్న సంస్థ..పే చానెళ్లను మాత్రం ఏడాది పాటు దేశవ్యాప్తంగా ఫ్రీగా అందించనున్నది. వీటితోపాటు ఉచితంగా హెచ్‌డీ హెచ్‌ఈవీసీ సెట్ టాప్ బాక్స్‌ను కేటాయించనున్నది. స్వల్పకాలం పాటు అమలులో ఉండనున్న ఈ ఆఫర్ మార్చి 1న(గురువారం) ప్రారంభించనున్నట్లు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రతి భారతీయుడికి టీవీల ద్వారా ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాలను అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత సేవలకు శ్రీకారం చుట్టినట్లు రిలయన్స్ బిగ్ టీవీ డైరెక్టర్ విజేందర్ సింగ్ తెలిపారు. ఇందుకోసం ముందస్తుగా సెట్ టాప్ బాక్స్, అవుట్‌డోర్ యూనిట్‌కోసం రూ.499, మిగతా రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఆఫర్ పరిధిలోకి రావాలంటే రెండో సంవత్సరం నుంచి ప్రతినెలా రూ.300 చొప్పున రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా చెల్లించిన వారికి పే చానెళ్లు మరో రెండేండ్ల పాటు తిలకించవచ్చును. వినియోగదారుడికి లాయల్టీ కింద రూ.1,999 లభించనున్నాయని పేర్కొంది.

ఎయిర్‌సెల్ దివాలా పిటిషన్

15,500 కోట్లకు చేరిన కంపెనీ రుణ భారం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: మలేషియా కుబేరుడైన టీ ఆనంద కృష్ణన్‌కి చెందిన మొబైల్ సేవల సంస్థ ఎయిర్‌సెల్..దివాలా పిటిషన్‌ను దాఖలు చేసింది. టెలికం రంగంలో నెలకొన్న పోటీ, రోజు రోజుకు పెరుగుతున్న రుణభారంతో ఈ పిటిషన్ దాఖలు చేయాల్సి వచ్చిందని కంపెనీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎయిర్‌సెల్‌లో 74 శాతం వాటా కలిగిన మలేషియాకు చెందిన మాక్సిస్ కమ్యూనికేషన్స్..గతంలో రిలయన్స్ కమ్యూనికేషన్‌లో విలీనం చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఈ విలీన ప్రతిపాదనకు రెగ్యులేటరీ అనుమతించకపోవడం, టెలికం రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితి ఇందుకు కారణమని విశ్లేషించింది. ప్రస్తుతం సంస్థకు రూ.15,500 కోట్ల స్థాయిలో అప్పు ఉన్నది. వీటిలో ఒక ఎస్‌బీఐకే రూ.5 వేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. వీటితోపాటు పీఎన్‌బీ, బీవోబీ, కెనరా బ్యాంకులకు సైతం ఎయిర్‌సెల్ భారీగా రుణాలు చెల్లించాల్సి ఉంది. అన్ని దారులు మూసుకుపోవడంతో ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వద్ద దివాలా పిటిషన్ బుధవారం దాఖలు చేసింది. సెక్షన్ 10 కింద దివాలా, దివాలా కోడ్ 2016 చట్టానికి లోబడి బుధవారం సమావేశమైన బోర్డు డైరెక్టర్లు ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు ఎయిర్‌సెల్ సెల్యులార్, డిష్‌నెట్ వైర్‌లెస్, ఎయిర్‌సెల్ లిమిటెడ్‌లు ఒక ప్రకటనలో వెల్లడించాయి. 2005లో భారత్‌లో టెలికం సేవలు ఆరంభించిన సంస్థకు ప్రస్తుతం 8.5 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు.




హైదరాబాద్‌లో ఎస్‌బీఐ వెల్త్‌సేవల విస్తరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 28: బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) హైదరాబాద్‌లో వెల్త్‌మేనేజ్‌మెంట్ సర్వీసులను విస్తరించింది. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎనిమిదో హబ్‌ను బ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ జే స్వామినాథన్ ఇటీవల ప్రారంభించారు.

క్రీడాకారులకు ఉపయోగపడే డీఎన్‌ఏ స్కాన్

కష్టపడి పనిచేసే తత్వం, అంకిత భావం తప్పనిసరిగా క్రీడాకారుడికి ఉండాల్సిన లక్షణాలు. అయితే మనలోని జన్యువులు కూడా ఇందుకు దోహదం చేస్తాయా? 1999వ సంవత్సరంలో బెర్లిన్‌లో ఒక సూపర్ బేబి పుట్టాడు. అతడి తొడలు, భుజాల దగ్గర ప్రత్యేకంగా బలమైన కండరం అభివృద్ధి చెందడం మొదలు పెట్టింది. నాలుగు (4) సంవత్సరాల వయసు వచ్చేనాటికి చాలా మంది పెద్దలు కష్టంగా చేసే పనులు కూడా ఆ బాబు చాలా సులభంగా చేయగలిగాడు. అతడిలోని జీన్స్‌లో చిన్న పరిణామం చెందడం వల్ల ఇలా జరిగింది. అప్పటి నుంచి శరీరంలోని రహస్యాలను తెలుసుకునేందుకు ప్రపంచ శాస్త్రవేత్తలంతా కూడా జన్యువుల బ్లూప్రింట్ అధ్యయనం మీద దృష్టి సారించారు. డీఎన్‌ఏ అధ్యయనం ద్వారా ఏ స్పోర్ట్స్‌లో ఎవరు ఎంత వరకు విజయం సాధించవచ్చు వంటి విషయాలను కొంత వరకు అంచనా వెయ్యవచ్చు. అంతేకాదు క్రీడల్లో ఎలాంటి గాయాలు అయ్యేందుకు ఆస్కారం ఉంది, ఎలాంటి ఆహారం తీసుకోవడం మంచిది వంటి అంశాలను సైతం అంచనా వెయ్యడం కొంత వరకు సాధ్యపడుతుంది. ఇప్పుడు అందుబాటులో ఉన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఉపయోగించి క్రీడాకారుల డీఎన్‌ఏ స్కాన్ చెయ్యడం ద్వారా వారిలో నైపుణ్యాలు పెంపొందించుకోవడానికి కావాల్సిన జాగ్రత్తలు తీసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇది వారిలోని పోటితత్వానికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది.



మనలోని జన్యువులు డీఎన్‌ఏ అనే చిన్నచిన్న బ్లూ ప్రింట్స్‌తో ఏర్పడుతాయి. ఈ డీఎన్‌ఏలోనే జీవిత రహస్యాలు దాగి ఉంటాయి. వీటి ద్వారానే శరీరంలోని అన్ని కణాలకు వాటి విధులను నిర్వర్తించేందుకు అవసరమైన సమాచారం చేరుతుంది. ఈ అంశం గురించిన పరిశోధనలు జరుపుతున్న శాస్త్రవేత్తలు స్పీడ్ జీన్ లేదా స్ప్రింట్ జీన్ అనే ఒక జన్యువును గుర్తించారు. ఈ జీన్స్ రెండు జతలు కలిగిన వారు సాకర్, బాస్కెట్ బాల్, షార్ట్ స్విమ్మింగ్, షార్ట్ బైకింగ్ వంటి క్రీడల్లో ప్రతిభ కలిగి ఉంటారు. ఇలాంటి జీన్స్ లేని వారు లాంగ్ స్విమ్మింగ్, రన్నింగ్, బైకింగ్ వంటి వాటిల్లో ప్రతిభ కలిగి ఉంటారు. ఒక జత స్పీడ్ జీన్స్ కలిగిన వారు ఎలాంటి క్రీడలోనైనా పెద్దగా కష్టం లేకుండానే రాణిస్తారు.

క్రీడల వల్ల కలిగే గాయాల తాకిడిని తగ్గించుకునేందుకు జీన్ టెస్టింగ్ ఉపయోగపడుతుంది. ఈ గాయాలు చాలా సందర్భాల్లో క్రీడాకారుల క్రీడా జీవితానికి ముగింపుకు కారణమవుతాయి. ఇది వ్యక్తిగతంగా క్రీడాకారులకు మాత్రమే కాదు క్రీడా సమాఖ్యలకు కూడా తీరని నష్టానికి కారణమవుతాయి. గాయాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం క్రీడాకారులకు తప్పనిసరి. డీఎన్‌ఏ స్కాన్ ద్వారా గాయాలు ఏర్పడేందుకు ఎంతవరకు ఆస్కారం ఉందనేది ముందుగానే తెలుసుకునేందుకు అవకాశం ఉంటుంది. డీఎన్‌ఏ స్కాన్ ద్వారా ఏసిఎల్ లిగమెంట్ రప్చర్, టెండినోపతి వంటి ఇతర లిగమెంట్ సంబంధిత గాయాలు ఏర్పడేందుకు ఎంత వరకు ఆస్కారం ఉందో ముందుగానే ఊహించవచ్చు. ఈ పరీక్ష ద్వారా ప్రాణాలకు ప్రమాదం ఏర్పరిచే కార్డియో మయోపతి వంటి గుండె సమస్యలను కూడా ముందుగానే పసిగట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

జెనెటిక్ కోడ్ ద్వారా ఎలాంటి ఆహారానికి మన శరీరం ఎలా ప్రతిస్పందిస్తుందో కూడా తెలుసుకోవడం వీలవుతుంది. కార్బోహైడ్రేట్లు తీసుకునే ప్రతి ఒక్కరు బరువు పెరగరు. ఎక్కువ బరువు ఉన్న ప్రతి ఒక్కరు ఎక్కువ కార్బోహైడ్రేట్లు తీసుకోరు. దీన్ని బట్టి ఆహారం నుంచి వచ్చే శక్తిని కొంత మంది శరీరాలు మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోగలుగుతున్నాయని అర్థం అవుతోంది. డీఎన్‌ఏ స్కాన్ ద్వారా లాక్టోజ్, గ్లుటేన్ ఇన్‌టాలరెన్స్‌ను కూడా గుర్తించడం వీలవుతుంది.

జీన్ థెరపీ ద్వారా ప్రతి వ్యక్తికి వారి శరీరం తీరును అనుసరించి ఆరోగ్య సంరక్షణా విధానాలను రూపొందించేందుకు వీలు ఏర్పడుతుంది. భవిష్యత్తులో ఇలాంటి చికిత్సా విధానాలు రూపొందించబడతాయని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. డిఎన్‌ఏ స్కాన్ వల్ల కేవలం క్రీడాకారులకు మాత్రమే కాదు ఆరోగ్యం కోసం తపన పడే ప్రతి ఒక్కరికి ఉపయోగపడే ప్రక్రియ. ఇది సరైన క్రీడను ఎంచుకోవడానికి, శిక్షణ తీసుకోవడానికి ఎంతో ఉపయోగపడే అద్భుతమైన ప్రక్రియ.

డాక్టర్ అజయ్‌సింగ్ ఠాకూర్
కన్సల్టెంట్ ఆర్థోస్కోపీ అండ్ స్పోర్ట్స్ సర్జన్
భుజం, మోకాలు గాయాల నిపుణులు
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్: 70970 60006, 040-447 77777



● అశ్వవాహనంపై నారసింహుడు



జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం రాత్రి లక్ష్మీనరసింహస్వామిని అశ్వవాహనంపై ఊరేగించారు. రాత్రి 8 గంటలకు అందంగా అలంకరించిన వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి భజనలు తోడు రాగా క్షేత్ర పురవీధుల్లో తిప్పగా మహిళలు మంగళహారతులు ఇచ్చి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - ధర్మపురి టౌన్

కోమటి చెరువు వద్ద నేటి నుంచి కళోత్సవాలు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సిద్దిపేట కోమటి చెరువు వద్ద నేటి నుంచి మూడు రోజుల పాటు కళోత్సవాలు జరుగనున్నాయి. చెరువు వద్ద నిర్మించిన ఓపెన్ ఎయిర్ ఆడిటోరియాన్ని నేడు మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కళోత్సవాల్లో భాగంగా మొదటిరోజు కళారూపాల ప్రదర్శన, గాన లహరి, సభా కార్యక్రమం, కళారూపాల కవాతు, తదితర కార్యక్రమాలు, రెండో రోజు గీతలహరి, దేశీరాగం, ఆహా, మాతృవందనం, వాద్య విన్యాసం, సంకీర్తన లహరి తదితర, మూడో రోజు సమాపనోత్సవానికి ముఖ్య అతిథిగా గిరిజన అభివృద్ధి పర్యాటక శాఖ మంత్రి చందులాల్ హాజరవుతారు. ఆ రోజు బాలీవుడ్ ఫిల్మీ గజల్స్ – పాటలు, బతుకమ్మ నృత్యరూపకం, పేరిణి నాట్యం తదితర కార్యక్రమాలు ఉంటాయి.

పెరిగిన పగటి ఉష్ణోగ్రతలు

■ మండుతున్న ఎండలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరుగుతుండటంతో ఎండలు దంచికొడుతున్నాయి. అయితే గత సంవత్సరంతో పోల్చితే ఈసారి వేసవికాలంలో ఎండల తీవ్రత తక్కువగానే ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి చివరి వారంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు దాటి నమోదవగా ఈ సారి మాత్రం 35 డిగ్రీల్లోపు మాత్రమే నమోదవడంతో పాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతూ రాత్రి సమయాల్లో చలిగాలులు వీస్తున్నట్టు అధికారులు తెలిపారు. అయితే రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని.. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం 8.30గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 35.1 డిగ్రీల సెల్సియస్ నమోదవగా కనిష్ఠ ఉష్ణోగ్రత 19.0 డిగ్రీల సెల్సియస్ నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	38.8	12.8
వికారాబాద్	38.8	13.2
మహబూబ్‌నగర్	38.3	13.2
కుమ్రంభీం ఆసిఫాబాద్	38.8	13.4
కామారెడ్డి	38.0	13.8
సిద్దిపేట	38.8	14.7
నాగర్‌కర్నూల్	37.9	15.1
మంచిర్యాల	38.8	15.3
జయశంకర్ భూపాలపల్లి	39.2	15.4
భద్రాద్రి కొత్తగూడెం	39.4	15.5
మేడ్చల్	38.3	15.5
రాజన్న సిరిసిల్ల	39.2	15.5
మెదక్	38.8	15.6
నిజామాబాద్	38.8	15.8
జోగులాంబ గద్వాల	38.3	15.8
పెద్దపల్లి	39.3	15.9
ఆదిలాబాద్	38.8	16.0
కరీంనగర్	39.0	16.0
సంగారెడ్డి	38.7	16.0
యాదాద్రి భువనగిరి	38.8	16.1
హైదరాబాద్	37.8	18.2
జనగామ	38.8	16.2
నిర్మల్	38.8	16.4
జగిత్యాల	38.8	16.6
నల్లగొండ	39.0	16.6
ఖమ్మం	39.4	16.7
వరంగల్ రూరల్	38.8	16.8
వరంగల్ అర్బన్	38.8	16.8
సూర్యాపేట	39.3	17.4
మహబూబాబాద్	39.2	17.6
వనపర్తి	38.2	17.7



మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లిలో మాట్లాడుతున్న మంత్రి లక్ష్మారెడ్డి

కాంగ్రెస్‌ను తరిమికొట్టండి: మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: తెలంగాణ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్, జడ్చర్ల మండలాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బంగారు తెలంగాణ కోసం పార్టీలకతీతంగా కలిసిరావాలని కోరారు. టైలర్లను ఆదుకునేందుకు కృషి చేస్తామని, ఈ విషయమై సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతానన్నారు. అనంతరం బాలానగర్ మండలం మోతిఘనపూర్‌లోని మేడిగడ్డ తండా, కల్లెపల్లి గ్రామ బీటీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. బాదేపల్లిలోని చంద్రా గార్డెన్స్‌లో టైలర్స్ డే సందర్భంగా పేద టైలర్లకు సీఎన్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా 125 మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వాల్యానాయక్, జడ్పీటీసీ ఫోరం జిల్లా అధ్యక్షుడు పట్ల ప్రభాకర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ దగా రాజకీయాలు?!

■ పార్లమెంట్ టీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ జితేందర్‌రెడ్డి



పాలమూరు : సమైక్య రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణకు అన్యాయం చేసిందనీ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా కాంగ్రెస్ నేతలు దగాకోరు రాజకీయాలు చేస్తూ అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని పార్లమెంట్ టీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్, మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమైక్యపాలనలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ తెలంగాణను అన్నివిధాలా భ్రష్టు పట్టించిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలోని ఏడు మండలాలను ఎన్డీఏ ప్రభుత్వం ఏపీలో కలుపుతుంటే కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును మేమే డిజైన్ చేశామని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు, ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదాను కల్పించాలని, కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా గురించి ఒక్క రోజైనా కేంద్రాన్ని అడిగారా? అని ప్రశ్నించారు. ఇక్కడ చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం మినహారాష్ట్రానికి ప్రయోజనాలను కల్పించాలన్న ఆలోచన కాంగ్రెస్ నేతలకు ఎంతమాత్రం లేదన్నారు. రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాల విషయంలో పార్లమెంటులోనే కాకుండా స్వయంగానూ మంత్రులను నిలదీస్తున్నామని జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు.



వనపర్తి జిల్లా బద్ధారంలో గొర్రెల యూనిట్లను పంపిణీ చేస్తున్న నిరంజన్‌రెడ్డి

పాడి పంటలతోనే పల్లె ప్రగతి

■ గొర్రెలను పంపిణీ చేసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి

గోపాల్ పేట: పాడి పంటలతోనే పల్లెల్లో ప్రగతి ఉంటుందని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామంలో సబ్సిడీపై ప్రభుత్వం నుంచి మంజూరైన గొర్రెల యూనిట్లను నిరంజన్‌రెడ్డి రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైతు సమన్వయ సమితుల వల్ల రైతుల ధాన్యానికి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. వచ్చే తొలాయిటి నాటికి ఏదుల రిజర్వాయర్‌ను ఎంజీకేఎల్ఐ నీటితో నింపి రైతుల పంట పొలాలకు సాగు నీరు అందించనున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతలు అసత్య ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు.

పాలకవర్గం.. ఏకపక్ష నిర్ణయం

■ గద్వాల మున్సిపాలిటీ సమావేశంలో రెచ్చిపోయిన వైస్ చైర్మన్

■ టీఆర్‌ఎస్ కౌన్సిలర్ సస్పెన్షన్.. వ్యతిరేకించిన టీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్

గద్వాల టౌన్: గద్వాల మున్సిపాలిటీ పాలకవర్గం(కాంగ్రెస్) ఏకపక్షంగా వ్యవహరిస్తున్నది. 'మేం చెప్పిందే జరగాలి.. మేం చేసిందే చూడాలి.. అధికారులు గానీ, ప్రతిపక్షం గానీ ఎలాంటి అభ్యంతరాలూ చెప్పొద్దు.. అడ్డుతగిలితే ఎంతకైనా సిద్ధం'.. అనేలా ఉందన్న విషయం చెప్పడానికి గురువారం జరిగిన జోగుళాంబ గద్వాల మున్సిపాలిటీ సమావేశ సంఘటనే నిదర్శనం. మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ ప్రభాకర్ ఎజెండాను ప్రవేశపెట్టగా, 25వ అంశాన్ని టీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ మహిమూద్ అడ్డుకున్నారు. ఇందుకు వైస్‌చైర్మన్ శంకర్ ఆగ్రహిస్తూ, అది తన వార్డుకు సంబంధించినదని, కచ్చితంగా తీర్మానించాలని చెప్పగా, మహిమూద్‌తో పాటు మరో కౌన్సిలర్(టీఆర్‌ఎస్) గోవింద్ అభ్యంతరం తెలిపారు. దీంతో వైస్ చైర్మన్ ఊగిపోతూ గోవింద్‌పై వాటర్ బాటిల్ విసురగా, సహనంకోల్పోయిన గోవిందు చెప్పు విసిరాడు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, ఓ దశలో 'నీ అంతు చూస్తా'.. అంటూ వైస్ చైర్మన్ హెచ్చరించాడు. కౌన్సిలర్ గోవిందును సస్పెండ్ చేయగా, చైర్‌పర్సన్ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారని, ఇది సరైంది కాదని టీఆర్‌ఎస్ కౌన్సిలర్లు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

నేడు బాబ్లీ నీటి విడుదల

మెండోరా: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువ భాగాన మహారాష్ట్రలో నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి గురువారం నీటిని విడుదల చేయనున్నారు. మార్చి 1న బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి దిగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేయాలని సూచించగా, నీళ్లు తక్కువగా ఉన్న కారణంగా బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి 0.4 టీఎంసీలు మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు.

పారదర్శకతకు నిలువుటద్దం
పౌరసరఫరాల శాఖ

■ పీడీఎస్ బియ్యం పేదలకే చెందాలన్నదే సీఎం సీకేసీఆర్ లక్ష్యం

■ ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం

■ భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

■ సిద్దిపేటలో తొలి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్



సిద్దిపేటలో పాసుపోర్ట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: గత ప్రభుత్వాల హయాంలో అవినీతికి కేరాఫ్‌గా ఉన్న పౌరసరఫరాల శాఖ.. స్వరాష్ట్రంలో పారదర్శకతకు నిలువుటద్దంగా మారిందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని చూసి నేర్చుకోండని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారత్‌నగర్‌లోని 17వ రేషన్ దుకాణం వద్ద ఐరీస్ కేంద్రాన్ని, కలెక్టరేట్‌లో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్, మెదక్ పార్లమెంట్ సభ్యుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ అధ్యక్షురాలు రాజమణి, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, జేసీ పద్మాకర్, డీఎస్ఓ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. పౌరసరఫరాల శాఖను ఇంత ఆదర్శవంత శాఖగా తీర్చిదిద్దినందుకు మంత్రి ఈటల రాజేందర్, కమిషనర్ సీవీ ఆనంద్‌ను అభినందించారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా కమాండ్ కంట్రోల్ రూంను సిద్దిపేటలో ప్రారంభించామన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాప్‌నకు బియ్యం తరలించే వాహనాలకు జీపీఎస్ విధానాన్ని అనుసంధానం చేసినట్టు చెప్పారు. దీంతో ఎక్కడా కూడా బియ్యం పక్కదారి పట్టే పరిస్థితి ఉండదన్నారు. నిజమైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను ఇచ్చామనీ, ఇంకా అర్హులుంటే ఎప్పటికప్పుడు అందజేస్తున్నామని చెప్పారు. పీడీఎస్ బియ్యం పేదలకు చెందాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. ఏ జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆ జిల్లాలోని బియ్యంగా మార్చి లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. తూకంలో తేడా రాకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఈ–పాస్ విధానాన్ని అమలు చేసి లబ్ధిదారులకు మేలు చేకూర్చామన్నారు. ఈ–పాస్ విధానంతో రూ.500 కోట్లు మిగులుగా వచ్చిందన్నారు. దీంతో హాస్టళ్లకు, మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యానికి వెచ్చించాని చెప్పారు. నెల రోజుల్లో రాష్ట్రమంతటా ఐరీస్ విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నం జరుగుతుందన్నారు. అనంతరం పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖలో అమలు చేస్తున్న విధానాలను వివరించారు.

పాసుపోర్ట్ కేంద్రం ప్రారంభం

సిద్దిపేట జిల్లా కేంద్రంలో పాసుపోర్ట్ కేంద్రాన్ని మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా ప్రజలతో పాటు చుట్టు పక్కన ఉన్న ప్రజలకు పాసుపోర్ట్ సేవా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. త్వరలోనే సిద్దిపేటకు కేంద్రీయ విశ్వ విద్యాలయం మంజూరు కానుందని తెలిపారు. అంతకు ముందు గొర్రెల అభివృద్ధి పథకంపై సిద్దిపేట నియోజకవర్గ లబ్ధిదారుల అవగాహన సదస్సులో పాల్గొన్నారు.



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అచ్చుమాయపల్లి మదిర గ్రామంలోని పర్శరాంనగర్‌లో బుధవారం రాత్రి డబుల్ బెడ్ ఇండ్లను ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామలింగారెడ్డిలతో కలిసి భారీనీటిపారుదల శాఖమంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. లబ్ధిదారులకు దగ్గరుండి గృహ ప్రవేశం చేయించారు. పూరి గుడిసెలలో, శిథిలావస్థకు చేరిన పెంకుటిండ్లలో ఎన్నో ఇబ్బందులతో జీవించిన ముదిరాజ్‌లకు ఇవాళ సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్ల కట్టించడంతో సంబురం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి ప్రత్యేక చొరవతో ఆరు నెలల్లోనే తొలి విడుతలో 25 ఇండ్లు నిర్మించి పేదలకు అందజేశారు. - దుబ్బాక, నమస్తే తెలంగాణ

రేవంత్‌రెడ్డి దౌర్జన్యం

■ మద్దూరులో అనుచరులతో కలిసి అభివృద్ధి పనుల శిలాఫలకం ధ్వంసం





వాహనం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు, కారు దిగి బైక్‌పై వెళుతున్న ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి

మద్దూరు: మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం నందిగామలో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి, అతని అనుచరులు దౌర్జన్యం చేశారు. గ్రామంలో బుధవారం జరిగిన బీటీ రోడ్డు పనుల ప్రారంభానికి మంత్రులు ఆలస్యంగా హాజరయ్యారని పోలీసులతో వాగ్వాదానికి దిగి, తోపులాటకు ఉపక్రమించారు. శిలాఫలాకాన్ని ధ్వంసం చేశారు. వివరాల్లోకి వెళితే.. నందిగామ గ్రామానికి రూ.60 లక్షలతో మంజూరైన బీటీ పనులను బుధవారం మంత్రులు ప్రారంభించారు. అంతకుముందు వివిధ గ్రామాలకు మంజూరైన బీటీ రోడ్లు, పాఠశాల భవనాలను ప్రారంభించి నందిగామకు బయలుదేరారు. ఇంకా మంత్రులు కార్యక్రమానికి రాలేదని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ శంకుస్థాపన చేసేందుకు శిలాఫలకం వైపు వెళ్లారు. మంత్రులు వస్తున్నారని పోలీసులు సర్ది చెప్పినా వినకుండా, అనుచరులతో కలిసి పోలీసుల ను తోసుకుంటూ వెళ్లి శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనకు నిరసనగా గ్రామస్థులు రేవంత్‌రెడ్డి వాహనాన్ని అడ్డుకొని, రోడ్డుపై బైఠాయించారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం సమంజసం కాదంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులుఆలస్యంగా వచ్చారని శిలాఫలకాన్ని ధ్వంసం చేయడమేమిటని ప్రశ్నించారు. ఈ సంఘటనకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్‌చేశారు. దీంతో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి కారు దిగి ఓ కార్యకర్త బైక్‌పై వెళ్లిపోయారు. తర్వాత పోలీసులు శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని కోయిలకొండ పోలీసు స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరులో మాట్లాడుతున్న మంత్రి

రేవంత్‌ది.. నీచ సంస్కృతి

■ మంత్రులు మహేందర్‌రెడ్డి, జూపల్లి

మద్దూరు: ఎమ్మెల్యే పదవిలో ఉంటూ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం నీచ సంస్కృతికి నిదర్శనమని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, పంచాయత్‌రాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలంలో బుధవారం వారు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో వెనుకబడిన నియోజకవర్గంలో అభివృద్ధి చేపడుతుంటే సహకరించాల్సిన ఎమ్మెల్యే అడ్డుకోవడం ఏమిటని నిలదీశారు. ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారని పేర్కొన్నారు. అభివృద్ధికి నిరోధకుడిగా ఎమ్మెల్యే రేవంత్ తయారయ్యాడని ధ్వజమెత్తారు. దమ్ముంటే బాధ్యతగల ఎమ్మెల్యేగా అభివృద్ధికి సహకరించాలని, లేదంటే మౌనంగా ఉండాలని హితవు పలికారు. అడ్డుతగిలితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మాట్లాడుతున్న స్పీకర్ మధుసూదనాచారి

బంజారాల స్ఫూర్తి ప్రదాత సేవాలాల్

■ స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి చందూలాల్

ములుగు, నమస్తే తెలంగాణ: బంజారాల స్ఫూర్తి ప్రదాత సంత్ సేవాలాల్ మహరాజ్ అని శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి చందూలాల్ అన్నారు. బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ములుగు డివిజన్ కేంద్రంలోని డీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమ, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ అధ్యక్షతన జరిగిన సేవాలాల్ 279వ జయంతికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంత్ సేవాలాల్ మనుషుల్లో మహనీయుడని కొనియాడారు. సమాజహితం కోసం తండాకొక సేవాలాల్ ఉద్భవించాలని పిలుపునిచ్చారు. మంత్రి చందూలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. సమాఖ్య పాలనలో నిర్లక్ష్యానికి గురిచేశారని ఆరోపించారు. సేవాలాల్ మహరాజ్ బంజారా జాతిని జాగృతం చేయడం కోసం కృషి చేశారని తెలిపారు.

టీఆర్‌ఎస్‌లోకి భారీగా చేరికలు



రంగారెడ్డి జిల్లా అనాజ్‌పూర్‌లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు



కామారెడ్డి జిల్లా ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న తిమ్మోజివాడి నాయకులు

నెట్‌వర్క్: టీఆర్‌ఎస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. అభివృద్ధికి ఆకర్షితులవుతున్న విపక్షనేతలు భారీగా పార్టీలో చేరుతున్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామశాఖ టీఆర్‌ఎస్ అధ్యక్షుడు బొడిగె రవిగౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన సమక్షంలో టీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలోని తిమ్మోజివాడ గ్రామానికి చెందిన 20 మంది కాంగ్రెస్, టీడీపీలకు చెందిన నాయకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతిఘనపూర్ పంచాయతీలోని మేడిగడ్డ తండా, తిర్మలాయ తండా, అప్పాజితండా, నేలబండ తండాకు చెందిన 200 మంది కాంగ్రెస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



ఆదిలాబాద్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ముదిరాజ్ నాయకులు

సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

నెట్‌వర్క్: సీఎం కేసీఆర్ వరాలపై రైతులు సంబురాలు చేసుకున్నారు. రైతులకు రూ.5లక్షల ప్రమాద బీమా, హైదరాబాద్‌లో ముదిరాజ్‌లకు సంఘ భవన నిర్మాణానికి ఐదెకరాల స్థలం, రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా హర్షం వ్యక్తమైంది. కామారెడ్డి, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో సీఎం కేసీఆర్, ఎంపీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం రాష్ట్రంలోని అన్ని గ్రామ, మండల, జిల్లా రైతు సమన్వయ సమితీలను ఏర్పాటు చేసి రైతుల జీవితాలకు భద్రత కల్పించారన్నారు. ఆయా చోట్ల స్వీట్లు పంచి, ఆనందాన్ని వ్యక్తపరిచారు.



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్, ఎంపీ కవిత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

ప్రాణాలు తీసిన కుటుంబ కలహాలు

■ కూతురికి విషమిచ్చి.. తాను ఆత్మహత్య చేసుకున్న తండ్రి

మహబూబ్‌నగర్ క్రైం: కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన తండ్రి కూతురికి పురుగుల మందు తాగించి, తాను తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ మండలం జైనల్లీపూర్ పంచాయతీ తువ్వాగడ్డతండాలో బుధవారం జరిగింది. రూరల్ ఎస్సై భాస్కర్‌రెడ్డి వివరాల ప్రకారం.. తువ్వాగుడ్డ తండాకు చెందిన ఇస్లావత్ కిషన్ నాయక్(30) భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడితో కలిసి బతుకు దెరువు కోసం మహారాష్ట్రలోని పూణెకు వెళ్లి, కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే పదిరోజుల క్రితం భార్యభర్తలు గొడవ పడటంతో పెద్ద కూతురు నందిని(8)తో ండ్రి కిషన్ తువ్వాగడ్డతండాకు వచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మద్యం తాగి, పురుగుల మందు కలిపిన కూల్‌డ్రింక్ కూతురుకు తాగించి, తాను తాగాడు. చుట్టూపక్కల వారు గమనించి వారిని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చిన్నారి మృతి చెందగా, చికిత్స పొందుతూ కిషన్ బుధవారం మృతి చెందాడు.

ఆడపిల్లను అమ్మేసిన తండ్రి



పాపను తనకు అప్పగించాలని వేడుకుంటున్న హస్లిబాయి

కులకచర్ల: రెండో సంతానంగా కూతురే పెట్టిందని భావించిన తండ్రి, ఆమెను రూ.15వేలకు అమ్మేసిన ఘటన రంగారెడ్డి జిల్లా ఫారుక్‌నగర్ మండలం మెక్కంగుట్ట తండాలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం గుడ్డిరుక్యతండాకు చెందిన కుమార్–హస్లీబాయి దంపతులకు రెండో సంతానం కూడా ఆడ పిల్ల పుట్టగా, కుమార్ రూ.15వేలకు పాపను ఓ మార్వాడికి అమ్మేశాడు. ఈ విషయాన్ని ఎవరికైన చెబితే చంపేస్తానని భార్యను బెదిరించాడు. హస్లిబాయి బుధవారం తల్లిగారిల్లయిన వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ గుడ్డిరుక్యతండాకు చేరుకొని బోరుమంది. తన పాపను తనకు ఇప్పించాలని వేడుకుంది.


నమస్తే తెలంగాణ
ఆట
[హైదరాబాద్]
గురువారం 1 మార్చి 2018

భారత్‌కు సులువైన డ్రా

● హాకీ ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల



న్యూఢిల్లీ: భారత హాకీ జట్టుకు శుభవార్త. ఈ ఏడాది చివర్లో జరుగనున్న హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు సులువైన డ్రా లభించింది. హాకీ ప్రపంచకప్ షెడ్యూల్‌ను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) బుధవారం విడుదల చేసింది. పూల్ సీ లో భారత్‌తో పాటు బెల్జియం, కెనడా, దక్షిణాఫ్రికా ఉన్నాయి. భారత్ తన తొలి మ్యాచ్‌ను దక్షిణాఫ్రికాతో ఆడుతుంది. భారత్ ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీ నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16 వరకు భువనేశ్వర్ జరుగనున్నది. డిసెంబర్ 8 వరకు పూల్ మ్యాచ్‌లు, డిసెంబర్ 12, 13న క్వార్టర్ ఫైనల్స్, డిసెంబర్ 15న సెమీఫైనల్, 16న ఫైనల్ మ్యాచ్ జరుగుతాయి. భారత్ నవంబర్ 28న దక్షిణాఫ్రికాతో, డిసెంబర్ 2న బెల్జియం, డిసెంబర్ 8న కెనడాతో లీగ్ మ్యాచ్‌లో తలపడుతుంది. పూల్ ఏ: అర్జెంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్..పూల్ బీ: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఐర్లండ్, చైనా..పూల్ సీ: బెల్జియం, ఇండియా, కెనడా, దక్షిణాఫ్రికా..పూల్ డీ: నెథర్లాండ్స్, జర్మనీ, మలేసియా, పాకిస్థాన్.



ఫెడరర్ డబుల్ ధమాకా

■ మొత్తం ఆరు పురస్కారాలతో కొత్త చరిత్ర

మొనాకో: ప్రతిష్ఠాత్మక 'లౌరెస్ వరల్డ్ స్పోర్ట్స్' అవార్డుల్లో స్విస్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ ఏడాది 'వరల్డ్ స్పోర్ట్స్‌మెన్ ఆఫ్ ద ఇయర్'తో పాటు 'బెస్ట్ కమ్‌బ్యాక్' పురస్కారాలను సొంతం చేసుకున్నాడు. దీంతో కెరీర్‌లో మొత్తం ఆరు లౌరెస్ అవార్డులను గెలుచుకున్న తొలి క్రీడాకారుడిగా రికార్డులకెక్కాడు. గతంలో ఎవరికీ ఇన్ని అవార్డులు దక్కలేదు. వరల్డ్ స్పోర్ట్స్‌మెన్ అవార్డు కోసం రాఫెల్ నాదల్ (టెన్నిస్), క్రిస్టియానో రొనాల్డో (ఫుట్‌బాల్), లూయిస్ హామిల్టన్ (ఫార్ములావన్) నుంచి గట్టిపోటీ ఎదురైనా చివరకు ఫెడ్డీ విజేతగా నిలిచాడు. ప్రమాదకరమైన మోకాలి గాయం నుంచి కోలుకుని ఆస్ట్రేలియా ఓపెన్, వింబుల్డన్ టైటిల్స్‌ను సాధించడం ఫెడరర్‌కు బాగా కలిసొచ్చింది. మహిళల కేటగిరీలో అమెరికా టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్‌కు 'స్పోర్ట్స్ వుమెన్ ఆఫ్ ద ఇయర్' పురస్కారం దక్కింది. ఆస్ట్రేలియా ఓపెన్‌తో కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్‌ను దక్కించుకోవడం ఆమెకు అవార్డును తెచ్చిపెట్టింది. ఓవరాల్‌గా సెరెనా కెరీర్‌లో ఐదు లౌరెస్ అవార్డులు ఉన్నాయి. ఇప్పటివరకు ఏ మహిళా క్రీడాకారిణి కూడా ఇన్ని అవార్డులు సాధించలేదు. నాదల్ ఖాతాలో మూడు అవార్డులు ఉన్నాయి. 36 ఏండ్ల వయసులో నంబర్‌వన్‌కు చేరుకుని ఈ అవార్డును గెలుస్తానని అనుకోలేదని ఫెడరర్ అన్నాడు. 'ఈ ఏడాది నాకెంతో ప్రత్యేకం. లౌరెస్ అవార్డులను నేను చాలా గౌరవిస్తా. ఈ ఏడాది మరో రెండు గెలువడం చాలా అద్భుతంగా అనిపించింది. నాకు మద్దతుగా నిలిచిన లౌరెస్ అకాడమీకి కృతజ్ఞతలు. కఠినమైన 2016 తర్వాత ఇంతలా పుంజుకుంటానని అనుకోలేదు. 2005లో తొలి లౌరెస్ అవార్డును గెలిచినప్పుడు ఆరు సాధిస్తానని అనుకోలేదు' అని ఫెడరర్ పేర్కొన్నాడు.

ఐపీఎల్ కెప్టెన్సీ రికార్డ్:
మ్యాచ్‌లు: 66
విజయాలు: 40
ఓటములు: 26



రోహిత్ ROHIT 2.0

ఫీచర్ ఫోన్‌ల జమానాలో సచిన్, ద్రవిడ్, గంగూలీ భారత జట్టును నడిపించారు..అప్పటి కిక్కు అప్పటిదే..ఇక మహేంద్రసింగ్ ధోనీ హయాంలో సరికొత్త ట్రెండ్ నడిచింది..విరాట్ కోహ్లీ దగ్గరికొచ్చే సరికి అంతా స్మార్ట్ మయమైంది. పరుగులు, రికార్డులూ పోటీపడుతూ క్రికెట్‌లో మరింత మజాను తీసుకొచ్చాయి. ఇప్పుడు రోహిత్ వంతు. భారత కెప్టెన్లలో కొత్త వర్షన్ ఇతడే..గతంలో మూడు రోజుల్లో సాధించిన పరుగులను, ఇతడు మూడు గంటల్లోనే కొట్టేస్తాడు.. డబుల్ సెంచరీలను మంచినీళ్లలా మింగేస్తాడు..మహేంద్రసింగ్‌ధోనీలా ప్రశాంతంగా కనిపిస్తాడు..కానీ లోపల ఒరిజినల్ వేరే ఉంటుంది..విరాట్ కోహ్లీలా దూకుడుగా కనిపించడు..కానీ లోలోన లావా ఉప్పొంగుతూ ఉంటుంది.. నిశ్శబ్దంగా కనిపిస్తూనే విధ్వంసం సృష్టిస్తాడు..బ్యాట్స్‌మన్‌గా హిట్ అయిన రోహిత్, కెప్టెన్‌గానూ తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యాడు.

కెప్టెన్లలో కొత్త వర్షన్

ధోనీ కంటే ప్రశాంతం.. ● కోహ్లీని మించిన తెంపరితనం
● పొట్టి ఫార్మాట్‌లో హిట్ ఫార్ములా

భారత జట్టుకు రోహిత్‌శర్మ అవసరమా..? వరుసగా విఫలమవుతున్నా ఎందుకు అతడినే ఆడిస్తున్నారు..? దక్షిణాఫ్రికా పర్యటనలో రోహిత్ విఫలమైన సందర్భంలో వచ్చిన విమర్శలివి. కానీ అవేవీ రోహిత్‌పై ప్రభావం చూపించలేదు. కెప్టెన్ విరాట్ కోహ్లీ , కోచ్ రవిశాస్త్రి బాసటగా నిలిచారు. ఇంకెవరైనా అయితే పక్కన పెట్టేవారేమో గానీ, టన్నుల కొద్దీ ప్రతిభ ఉన్న రోహిత్ విషయంలో ఆ పని చేయలేకపోయారు. అతడి ఆటతీరుపై టీమ్ మేనేజ్‌మెంట్‌కు ఉన్న నమ్మకం అది. ఇప్పుడు అదే నమ్మకంతో హిట్‌మ్యాన్‌కు టీ20 పగ్గాలు అప్పగించారు. శ్రీలంకలో జరుగబోయే ముక్కోణపు టీ20లో రోహిత్‌శర్మ టీమ్‌ఇండియాను నడిపించబోతున్నాడు. అయితే ఈ ముంబైకర్ ఆ బాధ్యతను ఎంత మేరకు సక్రమంగా నిర్వహిస్తాడనే చర్చ క్రికెట్ వర్గాల్లో మొదలైంది.

టీ20 కెప్టెన్లు	మ్యాచ్‌లు	విజయాలు	ఓటములు	టై	నో రిజల్ట్
సెహ్వాగ్ (2006)	1	1	0	0	0
ధోనీ (2007–16)	72	41	28	1	2
రైనా (2010–11)	3	3	0	0	0
రహానే (2015)	2	1	1	0	0
కోహ్లీ (2017)	13	8	5	0	0
రోహిత్ (2017)	4	4	0	0	0



లంకతో ధనాధన్

టీ20ల్లో కెప్టెన్సీ చేయడం రోహిత్‌కు కొత్తేమీ కాదు. ఇప్పటి వరకు 4 మ్యాచుల్లో నాయకత్వం వహించి, ఆ నాలుగింటిలోనూ విజయాలు సాధించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన చివరి టీ20లో ఈ హిట్‌మ్యాన్ కెప్టెన్సీలోనే భారత్ గెలిచి సిరీస్‌ను దక్కించుకున్నది. అంతకు ముందు స్వదేశంలోశ్రీలంకతో జరిగిన టీ20 సిరీస్‌లో రోహిత్ తొలిసారిగా నాయకత్వం వహించి 3–0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేశాడు. ఆ సిరీస్‌లో ఇండోర్ వేదికగా జరిగిన రెండో మ్యాచ్‌లో రోహిత్ 35 బంతుల్లోనే సెంచరీ చేసి, టీ20ల్లో వేగంగా సెంచరీ చేసిన బ్యాట్స్‌మన్‌గా వాన్‌డర్ (నమీబియా), మిల్లర్ (దక్షిణాఫ్రికా) సరసన నిలిచాడు. మొత్తంగా కెప్టెన్సీ చేసిన తొలి మూడు టీ20ల్లో వరుసగా 17, 118, 27 స్కోర్లు నమోదు చేశాడు. తాజాగా దక్షిణాఫ్రికాపై మూడు టీ20ల్లో (21, 0, 11) విఫలమైనా, భారత్‌కు సిరీస్ అందించిన కెప్టెన్‌గా నిలిచాడు.

ఐపీఎల్‌ను దున్నేసి..

రోహిత్‌శర్మలోని నాయకుడిని వెలికితీసింది ఐపీఎల్ అనే చెప్పాలి. సచిన్, హర్భజన్ సారథ్యంలో ముంబై ఇండియన్స్ తరపున ఆడిన రోహిత్ 2013లో జట్టుకు నాయకుడయ్యాడు. కెప్టెన్సీ చేపట్టిన తొలి సీజన్‌లోనే జట్టును చాంపియన్‌గా నిలిపాడు. బ్యాటింగ్‌లోనూ ఆకట్టుకుని మొత్తం 538 పరుగులు చేశాడు. ఆ తర్వాత 2015, 2017లోనూ జట్టుకు ట్రోఫీని అందించాడు. దేశీ, విదేశీ ఆటగాళ్లతో కలగలిసిన జట్టును సమర్థవంతంగా నడిపించాడు. ఇప్పటి వరకు 159 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన ఈ ముంబైకర్ 4207 పరుగులు (35 హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ) చేశాడు.

టీ20 కింగ్ ఇతడేనా..?

విరాట్ కోహ్లీ మూడు ఫార్మాట్లకూ కెప్టెన్సీ చేస్తుండటంతో అధిక భారం పడి, అతని బ్యాటింగ్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉన్నది. ముఖ్యంగా 2019 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని విరాట్‌పై ఒత్తిడి తగ్గించేందుకే.. టీ20లకు రోహిత్‌కే పూర్తి స్థాయి కెప్టెన్సీని అప్పగించే దిశగా సెలక్టర్లు ఆలోచనలు చేశారు. అందులో భాగంగానే గతంలో శ్రీలంతో సిరీస్‌కు, ఇప్పుడు ముక్కోణపు సిరీస్‌కు పగ్గాలు అప్పగించారు. 2015లో రహానేకు ఈ బాధ్యతలు అప్పగించినా, ఇప్పుడు రోహిత్ వైపే మొగ్గు చూపారు. వన్డేల్లో సైతం ఈ హిట్‌మ్యాన్ మూడు మ్యాచ్‌లకు కెప్టెన్సీ చేసి రెండింట విజయాలు సాధించాడు. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయలను తయారు చేసే పనిలో పడిన సెలక్టర్లు రోహిత్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నట్టు తెలుస్తున్నది. మరి టీమ్ మేనేజ్‌మెంట్ నమ్మకాన్ని ఈ ద్విశతక వీరుడు ఎంతవరకు నిలబెడుతాడో చూడాలి.


తనకు తానే సాటి..

మహేంద్రసింగ్ ధోనీ, విరాట్ కోహ్లీల నాయకత్వంలో ఆడిన రోహిత్‌శర్మ ఆ ఇద్దరి నుంచి ఎంతో నేర్చుకున్నాడు. మైదానంలో ధోనీ కంటే ప్రశాంతంగా కనిపిస్తాడు. మొన్నటికి మొన్న మహీ టీ20 మ్యాచ్ సందర్భంగా మనీశ్‌పాండేపై కస్సుబుస్సుమన్నాడు. కానీ రోహిత్ ఇంతవరకు మైదానంలో ఒకరిపై కోపగించుకున్నదే లేదు.ఇక కోహ్లీతో రోహిత్‌ను పోల్చడంపై గతంలో భారీ చర్చలే జరిగాయి. కోహ్లీ మూడు ఫార్మాట్లలో అదరగొడుతుండగా..రోహిత్ వన్డే, టీ20లకే పరిమితమయ్యాడు. వన్డేల్లో డబుల్ సెంచరీ సాధిస్తారా అంటూ కోహ్లీని ఒకరు ప్రశ్నించగా, ఆ పని రోహిత్ వల్లే అవుతుందని సమాధానమిచ్చాడు. అంటే ధనాధన్ ఫార్మాట్‌లో రోహిత్ మెరుగన్న విషయం చెప్పకనే చెప్పాడు. బ్యాటింగ్‌లో తనదైన రోజున రోహిత్, కోహ్లీ కన్నా దూకుడును ప్రదర్శిస్తాడు. ప్రత్యర్థి ఎంత రెచ్చగొట్టినా ఆవేశాన్ని బయటికి చూపడు, బ్యాట్‌తోనే సమాధానమిస్తాడు. నిలకడగా ఆడితే రోహిత్..కోహ్లీని మించిపోతాడని ఇప్పటికే అనేక మంది మాజీలు చెప్పిన విషయం తెలిసిందే. అయితే కెప్టెన్సీ చేస్తూ బ్యాటింగ్‌లోనూ రాణించడమనేది కష్టమైన పనే. కోహ్లీ, స్మిత్ (ఆస్ట్రేలియా) తప్ప మిగతా దేశాల కెప్టెన్లందరూ ఈ విషయంలో వెనుకబడే ఉన్నారు. బ్యాటింగ్‌లో నిలకడగా రాణించాలంటే రోహిత్..రనౌట్లు కావడం, అనవసరంగా వికెట్ పారేసుకోవడం వంటి పొరపాట్లను సరిదిద్దుకోవాల్సి ఉంటుంది. కెప్టెన్సీ విషయంలోనూ టెస్ట్, వన్డే ఫార్మాట్ల సంగతి పక్కన పెడితే..టీ20ల్లో రోహిత్ గణాంకాలు బాగానే ఉన్నాయి. ఐపీఎల్‌లో కోహ్లీ ఇంతవరకూ తమ జట్టు ఆర్సీబీని చాంపియన్‌గా నిలుపనే లేదు. కానీ రోహిత్ ముంబైఇండియన్స్‌కు మూడుసార్లు ట్రోఫీని అందించాడు. పటిష్ఠమైన టీమ్ ఉండటం వల్లే రోహిత్‌కు కలిసొచ్చిందన్న వాళ్లూ లేకపోలేదు. కానీ ఉన్న వనరులను వినియోగించుకోవడంలో హిట్‌మ్యాన్ తనదైన వ్యూహంతో ముందుకెళ్లాడు.



నన్ను బస్ డ్రైవర్ అన్నాడు!

న్యూఢిల్లీ: 2002 నాట్‌వెస్ట్ సిరీస్ సందర్భంగా తనను 'బస్ డ్రైవర్' అని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ సంబోధించాడని మహ్మద్ కైఫ్‌చెప్పాడు. కీలకమైన ఆ మ్యాచ్‌లో కైఫ్ (87).. యువరాజ్ (69)తో కలిసి 121 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాం. దీనిని జీర్ణించుకోలేని నాసిర్.. దురహంకారమైన వ్యాఖ్యలు చేశాడని గుర్తు చేశాడు. ఈ విషయానికి తానేమీ బాధపడలేదని మంచి రైడర్‌గా జట్టును గెలిపించడం చాలా సంతోషానిచ్చిందన్నాడు.



హసన్‌పై ఏడాది నిషేధం

కరాచీ: పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడిన ఓపెనర్ షాజాబ్ హసన్‌పై ఏడాది నిషేధం, రూ. 10 లక్షల జరిమానా విధించారు. ఈ మేరకు పీసీబీ అవినీతి నిరోధక ట్రిబున్యల్ బుధవారం నిర్ణయం తీసుకుంది. పీఎస్ఎల్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడిన మూడో ఆటగాడు హసన్. కరాచీ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన హసన్.. 2009లో టీ20 వరల్డ్‌కప్ గెలిచిన జట్టులో సభ్యుడు. మరే క్రికెటర్ ఫిక్సింగ్‌కు పాల్పడకుండా హసన్‌పై కఠిన చర్యలు తీసుకునేలా చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పీసీబీ న్యాయ సలహాదారుడు తఫాజుల్ రిజ్వీ వెల్లడించారు.



తెలుపు, ముదరు నీలం రంగు మస్కట్ ఒలింపిక్స్..తెలుపు, గులాబీ రంగు మస్కట్ పారాలింపిక్స్‌ను సూచించేలా జపాన్ ఆతిథ్యమిస్తున్న 2020 ఒలింపిక్స్ మస్కట్‌ను ప్రదర్శిస్తున్న జపాన్ చిత్రకారుడు రయో తనిగుచి.

'కంగారు'పెట్టిస్తారా!

■ నేటి నుంచి దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు ■ జోరుమీదున్న ఇరుజట్లు

డర్బన్: ప్రపంచంలోనే అత్యుత్తమ పేస్ బౌలింగ్ లైనప్ కలిగిన రెండు జట్ల మధ్య ఐదు రోజుల పోరాటానికి రంగం సిద్ధమైంది. బ్యాటింగ్‌లోనూ సమతూకంగా నిలిచే ఆటగాళ్ల మధ్య రసవత్తర పోరుకు సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య గురువారం నుంచి తొలి టెస్టు జరుగనుంది. భారత్‌పై 2–1తో టెస్టు సిరీస్‌ను గెలిచిన మంచి జోరు మీదున్న సఫారీలు.. స్వదేశంలో ఆసీస్‌ను కంగారుపెట్టాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గాయాలతో పరిమిత ఓవర్ల సిరీస్‌కు దూరమైన డీ గ్యాంగ్ సత్తా చాటేందుకు సిద్ధమైంది. డుప్లెసిస్, డివిలియర్స్, డికాక్ ఈ సిరీస్‌కు అందుబాటులోకి వచ్చారు. స్టార్ హిట్టర్ క్లాసెన్ టెస్టు ఫార్మాట్‌లో అరంగేట్రం చేసే అవకాశాలున్నాయి. మరోవైపు యాషెస్‌లో ఇంగ్లండ్‌ను వణికించిన స్మిత్‌సేన ఈ సిరీస్‌కు సరికొత్త ప్రణాళికలతో దిగుతున్నది. స్టార్క్, హాజెల్‌వుడ్, కమిన్స్‌ల పేస్ బలానికి స్పిన్నర్ లియోన్ అండగా నిలిస్తే సఫారీలకు కష్టాలు తప్పవు.



ట్రోఫీతో స్మిత్, డుప్లెసిస్

సాట్స్ ఆధ్వర్యంలో 3న బుడ్డా అరుణారెడ్డికి సన్మానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: ప్రపంచకప్ జిమ్నాస్టిక్స్‌లో దేశానికి తొలి పతకం అందించిన హైదరాబాదీ బుడ్డా అరుణారెడ్డికి ఈ నెల 3న సన్మానం చేస్తున్నట్లు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) చైర్మన్ ఏ వెంకటేశ్వరరెడ్డి ప్రకటించారు. ఎల్బీ స్టేడియంలో వచ్చే శనివారం సాయంత్రం 4–30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడల మంత్రి పద్మారావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు వెల్లడించారు. జిమ్నాస్టిక్స్‌లో కఠినమైన వాల్ట్స్ విభాగంలో కాంస్యం పతకం సాధించిన అరుణకు అభినందనలు తెలిపారు.



బుధవారం ఢిల్లీ ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో అరుణారెడ్డిని అభినందిస్తున్న తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కే రంగారావు, తెలంగాణ జిమ్నాస్టిక్స్ సంఘం కార్యదర్శి కే మహేశ్వర్

ఇంగ్లండ్‌దే రెండో వన్డే

స్టోక్స్, మోర్గాన్ అర్ధసెంచరీలు



బెన్ స్టోక్స్ (63★)

మౌంట్ మునగాని (న్యూజిలాండ్): లక్ష్య ఛేదనలో బెన్ స్టోక్స్ (74 బంతుల్లో 63 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), మోర్గాన్ (63 బంతుల్లో 62; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) అర్ధసెంచరీలతో చెలరేగడంతో.. బుధవారం జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ ప్రస్తుతం 1–1తో సమంగా ఉంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ 49.4 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. సాంట్నర్ (52 బంతుల్లో 63 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), గప్టిల్ (87 బంతుల్లో 50; 7 ఫోర్లు), గ్రాండ్‌హోమీ (38) రాణించారు. ఆరంభం నుంచే ఇంగ్లండ్ బౌలర్లు చెలరేగడంతో ఆతిథ్య జట్టు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. వోక్స్, అలీ, స్టోక్స్ తలా రెండు వికెట్లు తీశారు. తర్వాత ఇంగ్లండ్ 37.5 ఓవర్లలో 4 వికట్లకు 225 పరుగులు చేసి నెగ్గింది. బెయిర్‌స్టో (37) శుభారంభానివ్వగా, మోర్గాన్, స్టోక్స్ చెలరేగి ఆడారు. రూట్ (9), రాయ్ (8) విఫలంకావడంతో పర్యాటక జట్టు 47 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో మోర్గాన్ రెండు కీలక భాగస్వామ్యాలతో జట్టును ఆదుకున్నాడు. బెయిర్‌స్టోతో రెండో వికెట్‌కు 39, స్టోక్స్‌తో నాలుగో వికెట్‌కు 88 పరుగులు జత చేశాడు. చివర్లో జోస్ బట్లర్ (36 నాటౌట్) దుమ్మురేపాడు. స్టోక్స్‌తో ఐదో వికెట్‌కు అజేయంగా 51 పరుగులు జత చేసిన జట్టును గెలిపించాడు. బౌల్ట్ 2 వికెట్లు తీశాడు. స్టోక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇరుజట్ల మధ్య మూడో వన్డే శనివారం వెల్లింగ్టన్‌లో జరుగుతుంది.

దేవధర్ ట్రోఫీకి అశ్విన్ దూరం



న్యూఢిల్లీ: గాయం కారణంగా ఆఫ్ స్పిన్నర్ అశ్విన్.. దేవధర్ ట్రోఫీకి దూరమయ్యాడు. గాయంపై పూర్తిస్థాయి స్పష్టత లేకపోయినా.. వారం రోజుల విశ్రాంతి అవసరమని బీసీసీఐ డాక్టర్లు తేల్చడంతో టోర్నీ నుంచి వైదొలిగాడు. ఈ మ్యాచ్ ఈనెల 4 నుంచి 8 వరకు ధర్మశాలలో జరుగనుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో చోటు కోసం ఎదురుచూస్తున్న అశ్విన్.. దేవధర్ ట్రోఫీ మంచి అవకాశంగా భావించాడు. ఇందులో రాణించి సెలెక్టర్ల మెప్పు పొందితే 2019 వన్డే వరల్డ్‌కప్ జట్టులో చోటు దక్కే అవకాశాలు మెరుగయ్యేవి. అశ్విన్ స్థానంలో షాబాజ్ నదీమ్‌ను తీసుకున్నారు. అలాగే భారత్–ఎ జట్టుకు అంకిత్ బావ్నే కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. భారత్–బి జట్టు పగ్గాలు అక్షదీప్ నాథ్ చేపట్టనున్నాడు.

జీతాలు పెరుగుతున్నాయ్!

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా క్రికెటర్ల వేతనాలు త్వరలో పెరుగనున్నాయి. ఆటగాళ్లకు వేతనాలు పెంచాలంటూ కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి గతంలోనే బీసీసీఐని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం ముంబైలో సమావేశమైన బీసీసీఐ ఆటగాళ్లను ఏ ఏప్లస్ బి సి విభాగాలుగా విభజించినట్టు సమాచారం. ఈ సమావేశంలో కోచ్ శాస్త్రితో పాటు కోహ్లీ కూడా పాల్గొన్నట్టు తెలుస్తున్నది. మూడు ఫార్మాట్లలో ఆడుతున్న విరాట్ కోహ్లీ, ధవన్, రోహిత్, బుమ్రా, భువనేశ్వర్ రూ.2కోట్ల వార్షిక వేతనం దక్కనున్నది. గతంలో బీసీసీఐ ప్రకటించిన జాబితాలో టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన ధోనీ అగ్రస్థానంలో ఉండటంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఉగ్రవాదంపై పాక్ తీరు ఇంకా మారలేదు

అమెరికా సైన్యాధికారి జోసఫ్ వోటెల్

వాషింగ్టన్: ఉగ్రవాదుల అణచివేతకు పాకిస్థాన్ ఇంకా కృతనిశ్చయంతో కూడిన చర్యలు తీసుకోవడం లేదని అమెరికా సైన్యాధికారి జోసఫ్ వోటెల్ తెలిపారు. పాక్‌కు అమెరికా నుంచి భద్రతాపరమైన ఆర్థికసాయం నిలిపివేత కొనసాగుతుందని చెప్పారు. ట్రంప్ అమెరికా దేశాధ్యక్షుడైన తరువాత తాలిబన్, హక్కానీ వంటి ఉగ్రవాద సంస్థలపై కఠినచర్యలు తీసుకోవాలని పాక్‌ను కోరారు. అయినా పాక్ ఆశించిన మేరకు చర్యలు చేపట్టలేదు. ఉగ్రవాదులకు ఆశ్ర యం కల్పించడం మానుకోలేదు. దాంతో పాక్‌కు ఇచ్చే రెండు బిలియన్ డాలర్ల ఆర్థికసాయాన్ని ట్రంప్ నిలిపి వేశారు. ఇది జరిగి చాలాకాలమైనా పాక్ ధోరణిలో మార్పు రాలేదని, పరిస్థితి ఇంకా అలాగే ఉన్నదని చెప్పారు. పాక్‌కు ఆర్థికసాయం నిలిపివేత ఎంతకాలం కొనసాగుతుందని సెనేట్ ఆర్మ్‌డ్ సర్వీసెస్ కమిటీ సభ్యులు అడిగినపుడు ఆయన ఈ విషయం తెలిపారు.

అమెరికా సైనిక స్థావరంలో లేఖ కలకలం

ఎన్వలప్ తెరువడంతో 11 మందికి అస్వస్థత

వాషింగ్టన్: అమెరికా రాజధాని వాషింగ్టన్‌కు సమీపంలో ఉన్న సైనిక స్థావరానికి వచ్చిన ఓ లేఖ కలకలం సృష్టించింది. వర్జీనియాలోని ఆర్లింగ్‌టన్ వద్ద గల ఫోర్ట్ మేయర్ హెండర్సన్‌లో ఉన్న సైనిక స్థావరానికి వచ్చిన లేఖను అక్కడి అధికారి తెరిచారు. దీంతో 11 మందికి చేతులు, మొహానికి దురద మొదలైంది. మరికొందరికి ముక్కునుంచి రక్తం వచ్చిందని అధికారి ఒకరు తెలిపారు. ఆ లేఖలో హానికరమైన పదార్థం గురించి పరీక్షల నిమిత్తం పంపగా నివేదిక ప్రతికూలంగా వచ్చింది. తదుపరి పరీక్షల కోసం లేఖను క్వాంటిగో పంపారు.

చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో ఉరి

షాదోల్: నాలుగేండ్ల బాలికపై లైంగికదాడి, ఆపై హత్య చేసిన దోషికి మరణశిక్ష విధిస్తూ మధ్యప్రదేశ్‌లోని షాదోల్ జిల్లా కోర్టు జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. గత మేలో నిందితుడు వినోద్ చౌదా నాలుగేండ్ల బాలికపై లైంగికదాడికి పాల్పడి అనంతరం హత్యచేసి.. బాలిక మృతదేహాన్ని పొదల్లో పడేశాడు. దీంతో కేసు విచారించిన న్యాయస్థానం మరణశిక్ష విధించింది.

ఐఐఎస్ఈఆర్‌లో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)లో బీఎస్ - ఎంఎస్ డ్యూయల్ డిగ్రీలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

దేశంలోని అత్యున్నత ప్రమాణాలతో సైన్స్ విద్యను అందించాలనే సంకల్పంతో కేంద్ర మానవ వనరుల శాఖ దేశవ్యాప్తంగా ఏడు ఐఐఎస్ఈఆర్‌లను ప్రారంభించింది.

- ఐఐఎస్ఈఆర్ క్యాంపస్‌లు: బెర్హంపూర్, భోపాల్, కోల్‌కతా, మొహాలి, పుణె, తిరువనంతపురం, తిరుపతి.
- ఐఐఎస్ఈఆర్ అనేది కేంద్ర మానవ వనరుల శాఖ పరిధిలోని స్వతంత్ర సంస్థ.
- **కోర్సు:** బీఎస్ – ఎంఎస్ డ్యూయల్ డిగ్రీ
- ఇది ఐదేండ్ల కోర్సు
- మొదటి రెండేండ్లు బేసిక్ సైన్సెస్‌లలో కోర్ కోర్సులను అందిస్తారు. మూడు, నాలుగు సంవత్సరాల్లో స్పెషలైజేషన్ సబ్జెక్టులను, ఐదో సంవత్సరం రిసెర్చ్ ప్రాజెక్ట్ ఉంటుంది.
- **అర్హతలు:** ఇంటర్/10+2 లేదా తత్సమాన కోర్సులో సైన్స్ స్ట్రీంలో ఉత్తీర్ణత. 2017/2018లో పరీక్షలు రాస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఐఐఎస్ఈఆర్‌లో మూడు చానల్స్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.
- 1. కిషోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజనా (కేవీపీవై)
- 2. ఐఐటీ – జేఈఈ అడ్వాన్స్‌డ్ (జేఈఈ–అడ్వాన్స్‌డ్ 2018లో 10వేలలోపు ర్యాంకు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు)
- 3. స్టేట్, సెంట్రల్ బోర్డు చానెల్ (ఎస్‌సీబీ) ద్వారా (2017/2018లో ఇంటర్ ఉత్తీర్ణులు ఐఐఎస్ఈఆర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. సంస్థ నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్ట్ రాయాలి. సంస్థ నిబంధనల ప్రకారం కటాఫ్ మార్కులను ప్రకటించి తుది ఎంపికచేస్తారు. ఈ పరీక్షను జూన్‌లో నిర్వహిస్తారు.
- **స్కాలర్‌షిప్స్:** కేవీపీవై నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్స్ ఇస్తారు. జేఈఈ, ఎస్‌సీబీ చానెల్ ద్వారా ఎంపికైన వారికి పరిమిత సంఖ్యలో ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్స్ కింద నెలకు రూ. 5,000/-,

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో (దరఖాస్తుల స్వీకరణ మేలో ప్రారంభమవుతుంది)
- **దరఖాస్తు ఫీజు:** రూ. 2,000/-
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ. 1,000/-

- **పూర్తి వివరాల కోసం:**

The Chairperson
Joint Admissions Committee 2018
Indian Institute of Science
Education and Research Mohali
Knowledge City, Sector 81,
Mohali P.O Manauli 140306 (Punjab)
Email: ask-jac2018 [AT] iisermohali.ac.in

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈఎల్‌లో ఇంజినీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)లో ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

బీఈఎల్ భారత ప్రభుత్వ రంగ సంస్థ. ఇది ఒక నవరత్న కంపెనీ.

- డిప్యూటీ ఇంజినీర్ (కంప్యూటర్ సైన్స్) – 18 పోస్టులు
- **అర్హతలు:** బీఈ/బీటెక్ లేదా ఏఎంఐఈ లేదా బీఎస్సీ ఇంజినీరింగ్‌లో కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇంజినీరింగ్ బ్రాంచీ/కంప్యూటర్ ఇంజినీరింగ్ బ్రాంచీల్లో ఉత్తీర్ణులు.
- డిప్యూటీ ఇంజినీర్ (ఎలక్ట్రానిక్స్) – 5 పోస్టులు
- **అర్హతలు:** ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్ / ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ లేదా ఈసీఈ బ్రాంచీల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **నోట్:** పై రెండు పోస్టులకు బీఈ/బీటెక్ తర్వాత ఏడాది అనుభవం ఉండాలి.
- **పేస్కేల్:** రూ. 40,000 – 3% – 1,40,000/-
- **వయస్సు:** పై రెండు పోస్టులకు 2018, ఫిబ్రవరి 1 నాటికి 26 ఏండ్లు మించరాదు.
- ఈ పోస్టులను మూడేండ్ల కాలపరిమితికి తీసుకుంటారు.
- **పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్:** www.bel-india.com

రిసెర్చ్ అసోసియేట్

- ఐసీఏఆర్ – ఇండియన్ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐవీఆర్ఐ)లో రిసెర్చ్ అసోసియేట్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.
- రిసెర్చ్ అసోసియేట్ – 1 పోస్టు
- **అర్హతలు:** వెటర్నరీ, పాథాలజీ వెటర్నరీ, బ్యాక్టీరియా వైరాలజీ లేదా తత్సమాన సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ లేదా ఎంవీఎస్సీతోపాటు నెట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- **వయస్సు:** 35 ఏండ్లు మించరాదు
- **కాంట్రాక్టు పీరియడ్:** 2020, జనవరి 31 వరకు.
- **జీతభత్యాలు:** నెలకు రూ. 40 వేలు + 20 % హెచ్‌ఆర్‌ఏ ఇస్తారు.
- **వివరాల కోసం వెబ్‌సైట్:** www.ivri.nic.in

ఐడీఎస్ఏలో

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలసిస్ (ఐడీఎస్ఏ)లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- సెక్షన్ ఆఫీసర్ – 1
- **వయస్సు:** 45 ఏండ్లు మించరాదు.
- **అర్హతలు:** కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత.
- పేస్కేల్: రూ. 9,300– 34,800 + గ్రేడ్ పే రూ. 4,600/-
- **జూనియర్ అసిస్టెంట్ – 1**
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **అర్హతలు:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కామర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.
- కంప్యూటర్ నాలెడ్జ్, ఎంఎస్ ఆఫీస్, టాలీ, ఈఆర్‌పీఎస్, జీఎస్‌టీ తదితరాలు తెలిసి ఉండాలి.
- పేస్కేల్: రూ. 5,200 – 20,200 + గ్రేడ్ పే రూ. 2,400/-

- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 14
- **వెబ్‌సైట్:** www.idsa.in

యూపీఎస్సీ

Union Public Service Commission

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది.

- పోస్టులు – ఖాళీలు:
- ట్రాన్స్‌లేటర్ (టిబెటన్) – 1
- ఈ పోస్టు రక్షణ మంత్రిత్వశాఖలో ఉంది.
- అసిస్టెంట్ డైరెక్టర్ సేఫ్టీ (కెమికల్) – 1
- ఈ పోస్టు లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ మంత్రిత్వశాఖలో ఉంది.
- అసిస్టెంట్ డైరెక్టర్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) – 1
- ఈ పోస్టు లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ మంత్రిత్వశాఖలో ఉంది.
- అసిస్టెంట్ డైరెక్టర్ సేఫ్టీ (మెకానికల్) – 3
- ఈ పోస్టులు లేబర్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ మంత్రిత్వశాఖలో ఉన్నాయి.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 15
- **వెబ్‌సైట్:** www.upsc.online.nic.in

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఒక పబ్లిక్ సెక్టార్ బ్యాంక్. దీని ప్రధాన కార్యాలయం పుణెలో ఉంది.
- చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ – 1, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ – 1, చీఫ్ రిస్క్ ఆఫీసర్ – 1, మార్కెట్ ఆఫీసర్ – 2 పోస్టులు ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో మార్చి 3 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** మార్చి 17
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

ఎయిమ్స్‌లో పీజీ కోర్సులు

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో డీఎం/ఎంసీహెచ్, ఎండీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

- ఎయిమ్స్‌లో జూలై 2018 సెషన్ కోసం ఈ ప్రవేశాలు.
- **కోర్సు:** డీఎం/ఎం.సీహెచ్ (మూడేండ్లు) & ఎండీ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్)

- **దరఖాస్తు దాఖలుకు చివరితేదీ:** మార్చి 13
- **ఎంపిక:** డీఎం/ఎం.సీహెచ్ (మూడేండ్లు) & ఎండీ (హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్)
- ఏప్రిల్ 7న ఉదయం 10 నుంచి 11.30 వరకు నిర్వహించే పరీక్ష ద్వారా చేస్తారు.
- **పరీక్ష కేంద్రాలు:** ఢిల్లీ/ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై.

- **సంస్థ:** ఎయిమ్స్ న్యూఢిల్లీ
- **దరఖాస్తు చేసుకోవడానికి చివరితేదీ:** మార్చి 8
- **కోర్సు:** ఫెలోషిప్ ప్రోగ్రామ్
- **సంస్థ:** ఎయిమ్స్ న్యూఢిల్లీ
- ఫెలోషిప్ ప్రోగ్రామ్ కోసం ఏప్రిల్ 14న పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు.
- **పరీక్ష కేంద్రం:** ఢిల్లీ/ఎన్‌సీఆర్
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** www.aiimsexams.org